


అడపా చిరంజీవి

అడపా చిరంజీవి

# గాలిబంగ్లా



జ్యోతిచిత్ర సినీవారపత్రిక సినిమా నవలా పోటీలో
ఉత్తమ ద్వితీయ బహుమతి రూ. 2,500/-
గెలుపొందిన హారర్ & సస్పెన్స్ థ్రిల్లర్



శ్రీకృష్ణదేవరాయ పబ్లికేషన్స్
302, శ్రీసాయి నివాస్, ప్లాట్ నెం. 4,
ఎల్ఐసి కాలనీ, శ్రీనగర్ కాలనీ పోస్ట్,
హైదరాబాద్ - 500 073

**GAALI BUNGLOW**
A Novel by: ***ADAPA CHIRANJEEVI***
**Cell: 9347513396**

First Edition: November, 1986
Second Edition: April, 2008

Cover Painting: N. Rajeswar, 94409 28524
Design: M. Swamynadh, 9247130732

Type Setting:
S. Mohanrao, 9160371381
M. Ramakrishnarao, 94404 14355

For copies:
Visalandhra Publishing House
Abids, Hyderabad.
Sultan Bazar, Hyderabad.
and
Vijayawada, Guntur, Anantapur, Tirupathi,
Visakhapatnam, Hanamkonda, Kakinada.
e-mail: visalandhraph@yahoo.com

D.T.P. & Layout at :

**Supraja Graphics,**
Plot. No. 90, Kalyan Gardens,
Sainikpuri, Secunderabad.
Cell: +91 97009 25706

Price: **Rs. 70/-**

—————మీ అభిమాన రచయిత—————

# ఆడేపు చిరంజీవి

## రచనలు

1. *మృత సంజీవని* (ఉదయం దినపత్రిక సీరియల్)
2. *గాలిబంగ్లా* (జ్యోతిచిత్ర వారపత్రిక సీరియల్)
3. *మరణ ముహూర్తం* (ఆంధ్రభూమి సీరియల్)
4. *మృత్యు సింహాసనం* (ఆంధ్రభూమి సీరియల్)
5. *ప్రేమ పోరాటం* (ఆంధ్రభూమి సీరియల్)
6. *ఆఖరిక్షణం* (ఆంధ్రభూమి సీరియల్)
7. *యమడేంజర్* (ఆంధ్రభూమి సీరియల్)
8. *హవేలి* (ప్రియదత్త వారపత్రిక సీరియల్)
9. *ట్రంప్ కార్డ్*
10. *రాబందుల రాజ్యం*
11. *సహస్రాక్షుడు*
12. *ది జంగిల్*
13. *ప్రవరాఖ్యుడు*
14. *నిశాచరుడు*

15. క్షణమొక యుగం

16. కింజోరి

17. మెగాస్టార్

18. చీకటి కళ్ళు

19. యమధర్మం

20. మరణ సరిహద్దు

21. దోషి

22. కపాలదుర్గం (చిన్నారిలోకం మాసపత్రిక సీరియల్)

# గాలిబంగ్లా

**గోడ గడియారం టంగ్... టంగ్.. మని సరిగ్గా 12 గంటలు కొట్టింది. అది రాత్రి సమయం.**

**ఎక్కడో నక్కల అరుపులు, గుడ్లగూబలు చేసే కీచు ధ్వనులతో కలసిపోయి లీలగా వినిపిస్తున్నాయి.**

**సరిగ్గా.. అదే సమయంలో ప్రారంభమైంది సన్నని ఏడుపు.**

**మంచం మీద ఆదమరచి నిద్రపోతున్న జమిందార్ రంగనాథవర్మ తృళ్లిపడి లేచాడు.**

ఏడుపు యింకా అలాగే భీతిగొలిపేలా వినిపిస్తూనే వుంది. కళ్లు నులుముకుని మరీ చూసాడు.

ఎదురుగా వున్న మంచం మీద అతని భార్య పద్మావతీదేవి పరిసరాలతో నిమిత్తం లేనట్లు హాయిగా నిద్రపోతోంది.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది రంగనాథవర్మకి ఒక విషయం. గత నాలుగు రోజులుగా

ఎవరిదో ఏడుపు, నవ్వు తోటలోంచి వినిపిస్తూనే వుంది. కాని ఆ ఏడ్చి, నవ్వే వ్యక్తి ఎవరో అతనికి తెలియదు.

ఎవరిదో ఆడగొంతు అని స్పష్టంగా తెలుస్తోంది. ఎవరిదా గొంతు? ఆ స్త్రీ ఎందుకలా ఏడుస్తోంది? ఏమో!?

కీచుగా, ఘోరంగా వినిపిస్తోందా ఏడుపు. ఆ ఏడుపు చాలా భీతిగొలిపేలా వుంది. చంటిపిల్లలు వింటే జడుసుకుంటారు. గుండెపోటు వున్నవాళ్లు వింటే గుండె ఆగడం ఖాయం.

ఏడుపు క్షణంలో మారిపోయి నవ్వు ప్రారంభమైంది. పకపకా భీకరంగా వినిపిస్తోందా నవ్వు. రంగనాథవర్మకి ఒళ్లు ఒక్కసారిగా జలదరించింది.

నక్కల ఆరుపులు, గుడ్లగూబల కీచుధ్వనులు ఆగిపోయాయి.

భయం అనేది తెలియని రంగనాథవర్మ మొహంపై చిరుచెమటలు అలుము కున్నాయి.

ఛ.. తనెందుకిలా భయపడుతున్నాడు. దెయ్యాలూ భూతాలూ అభూతకల్పన.. ఎవరు చెప్పినా తను నమ్మడు. అటువంటిది... ఎవరిదో ఏడుపు, నవ్వు నాలుగు రోజులుగా వినేసరికి తనలో ఇంత మార్పు సంభవించిందేమిటి? తనలో యింత మార్పును, మానసిక సంక్షోభాన్ని కలిగించిన ఆ స్త్రీ ఎవరో ఈరోజు తనెలాగైనా సరే తెలుసుకు తీరాలి..

మంచం మీంచి దిగి, మెడమెట్లు దిగసాగాడు...

అదే క్షణంలో ఏడుపు ఆగిపోయింది.

అంతటా నిశ్శబ్దం..

కాని పురాతన గోడ గడియారం పెండ్యూలం చేసే టిక్..టిక్.. ధ్వని భీకరంగా వినిపిస్తూ నిశ్శబ్దంలో ఢంకా ధ్వనుల్లా గుండెల్లో అదోరకమైన భయంతో కూడిన దడను పుట్టిస్తోంది.

అదురుతున్న గుండెలు అరచేతుల్లో పట్టుకొని సింహద్వారం దాటి బయట తోటలోకి వచ్చాడు.

వెన్నెల పిండారబోసినట్లు వుంది. ఆకాశం నిర్మలంగా వుంది.

తోటలోని చెట్లు గాలికి అల్లల్లాడుతున్నాయి. ఆకుల గలగల శబ్దాలు, దెయ్యాల్లా తలలూపుతున్న భావం కలిగించేలా ఊగుతున్న మఱ్రిచెట్ల ఊడలు రంగనాథవర్మకి అదోలా అనిపించాయి.

ధైర్యం కూడగట్టుకుని చెట్ల మధ్యగా నాలుగు అడుగులు వేశాడు..అంతే..

గుడ్లగూబ కీచుధ్వని విని అదిరిపాటుగా వెనక్కి తిరిగాడు.

ఎభై గజాల దూరంలో ఒక స్త్రీమూర్తి నిశ్శబ్దంగా నడచిపోతోంది. కాని ఆమె కాలికున్న గజ్జల శబ్దం మాత్రం గుండెల్లో గుబులును రేపుతోంది.

మల్లెపూవు లాంటి తెల్లని వస్త్రాల్లో విరబోసుకున్న శిరోజాలతో ముగ్ధలా ముందుకు పోతోంది.

అతని శరీరం సన్నగా కంపించింది.

ఆ స్త్రీమూర్తి నేలమీద నడుస్తున్నట్లు లేదు. భూమికి అరడుగు ఎత్తులో గాలిలో తేలుతున్నట్టుగా అనిపించసాగింది.

ఇది కలా? నిజమా? లేక కేవలం తన భ్రమా! ఏదీ నిశ్చయించుకోలేక అసంకల్పితంగా ఆమె వెనుకే నడిచాడు రంగనాథవర్మ.

ఆ తోపులో చెట్ల మధ్యగా పోతుందా స్త్రీమూర్తి... స్త్రీమూర్తి అనేకంటే, ఆకారం అనడమే సబబుగా వుంటుంది.

కీచురాళ్ల రొద చాలా తీవ్రతరంగా వుంది. అటో ఇటో తేల్చుకోవాలనే దృఢ నిశ్చయంతో ధైర్యం చేసి ఆ ఆకారం వెనుక వేగంగా నడుస్తూ దాన్ని చేరుకోడానికి ప్రయత్నిస్తున్నాడు రంగనాథవర్మ.

తనకు మృత్యువు అతి సమీపంలో వుందని అతనికా క్షణంలో తెలియదు!!!

* * *

కండలు తిరిగిన బలమైన శరీర దారుఢ్యం గల ఆరడుగుల ఆగంతకుడు అతను..

బ్లాక్ పాంటు, అదే రంగు పొడవు చేతుల షార్క్ స్కిన్ షర్ట్ ధరించాడు. ఎర్రరంగు రబ్బరు బూట్లు ధరించాడు. చేతులకి బ్లాక్ కలర్ గ్లోవ్స్, తలకి ప్రత్యేకమైన అదే రంగు మాస్క్ ధరించాడు.

అతని కళ్లు, ఆ కళ్లకున్న ఎరుపురంగు జీరలు; ముక్కు వద్ద వున్న రెండు రంధ్రాలు తప్ప- ఆగంతకుని ఆకారం పూర్తిగా అతను ధరించిన వస్త్రాల మరుగున దాగింది.

తృప్తిగా ఒకసారి తనను తాను పరిశీలించుకుని ముందుకు నడచి బల్ల సొరుగును లాగాడు.

ఆ సొరుగులో నల్లగా నిగనిగలాడుతూ కనిపించింది పాయింట్ త్రీ ఎయిట్ కాలిబర్ రివాల్వర్. దాన్ని ఒకసారి పరిశీలించాడు.

రివాల్వర్ సిలెండర్‌ను రెండు డిగ్రీల క్లాక్‌వైజ్ డైరెక్షన్‌లో తెరిచాడు. ఆరు ఛాంబర్స్ ఖాళీగా వున్నాయి. (రివాల్వర్ బులెట్స్ నింపేదాన్ని సిలెండర్ అని, ఆ సిలెండర్‌లో వున్న ఆరు సెల్స్‌ను ఛాంబర్స్ అని అంటారు.)

సొరుగులోంచి ఫ్రెష్ బులెట్స్ తీసి ఒక్కొక్కటిగా ఆ ఛాంబర్స్‌లో నింపాడు. సిలెండర్ క్లోజ్ చేసి పాంటుజేబులో దోపుకున్నాడు.

మంచం వద్దకు వచ్చి పరుపు కింద వున్న కత్తిని బయటకు తీసాడు.

ఇరు ప్రక్కలా పదునైన బ్లేడ్‌తో 12 అంగుళాల పొడవున వుందా కత్తి. బలమైన చెక్కలోనైనా చాలా సులువుగా దిగిపోగల బలమైన కత్తి అది. దాని పిడి బంగారు రంగులో మెరుస్తోంది.

పాంటు మోకాలి నుంచి కిందవరకూ వున్న రహస్య పాకెట్‌కు జిప్పర్ ఏర్పాటు చేసాడు. ఆ జిప్పర్ లాగి, దాన్ని అందులో భద్రపరచి యధావిధిగా దాన్ని మూసేసాడు. గోడకున్న కొక్కానికి తగిలించి వున్న రెండడుగులు పొడవైన సన్నటి, మెత్తటి, బలమైన, నల్లని ప్రత్యేకమైన నైలాన్ తాడును బాక్ పాకెట్‌లో ముడిచి పెట్టాడు. చుట్టలు చుట్టుకుని వున్న నల్లని కాలనాగులా వుందా నైలాన్ తాడు.

ఆగంతకుని కళ్లల్లో ఏదో ఆకర్షణ కొట్టొచ్చినట్లు కనిపించసాగింది.

టైమ్ చూసాడు. 11-30 నిముషాలయింది.

అతని మనసు దేనిగురించో వేగిరపడమని హెచ్చరిస్తోంది.

నిశ్శబ్దంగా బయటకు వచ్చి ఇంటికి తాళం వేసాడు.

అక్కడే అతని కోసం సిద్ధంగా వున్న బుల్లెట్‌ను అధిరోహించి ఒక్క కిక్‌తో స్టార్ట్ చేసాడు.

దడదడలాడుతూ ముందుకు దూకింది బుల్లెట్. సాధారణ వేగంతో నడుపుతున్నాడు దాన్ని.

చుట్టుప్రక్కల ఎక్కడా మరో ఇల్లు అన్నది లేదు. ఆ ప్రాంతమంతా చిన్న చిన్న మెట్టలతో, చెట్లతో నిండి వుంది.

కీచురాళ్ల రొదను బుల్లెట్ శబ్దం మింగేస్తోంది. ఎత్తుపల్లాలను అధిగమిస్తూ శరవేగంగా పోతోంది బుల్లెట్.

వెన్నెల వెలుగులో చెట్ల నీడలు నేలపై ప్రతిబింబిస్తున్నాయి.

మళ్లీ టైము చూసాడు. పావు తక్కువ పన్నెండు అయింది. మరో ఐదు నిముషాలకి వర్షం ప్రారంభమైంది. దడదడలాడుతూ ఉధృతంగా కురవసాగింది.

ఉరుములు, మెరుపులతో ఆకాశం దద్దరిల్లిపోతోంది.

వర్షం ఆగంతుకునిపై పడి నేలజారిపోతోంది.

దృష్టిని మట్టిరోడ్డుపై కేంద్రీకరించి ముందుకు పయనిస్తున్నాడతను.

ఆగంతకుడు వెళ్లేది రంగనాథవర్మ వున్న భవంతికే...!

ఆహారం కోసం వేటకై బయలుదేరిన సింహరాజులా, రూపెత్తిన 'మృత్యువు'లా కనిపిస్తున్నాడా క్షణంలో ఆ ఆగంతకుడు.

* * *

నిర్భయంగా, నిశ్చింతగా ముందుకు సాగిపోతూనే వుందా ఆకారం.

గాలి చాలా వేగంగా వీస్తోంది. ఆమె కురులు అల్లల్లాడుతున్నాయి.

తోపులోని చెట్ల ఊడలు అటూ యిటూ ఊగిపోతున్నాయి.

కింద రాలిపడిన ఎండుటాకులు గాలి వేగానికి విచిత్ర శబ్దాలు చేస్తూ ఆకారం వెనుకగా రయ్యిమని ఎగిరిపోసాగాయి.

రంగనాథవర్మ అక్కడి భీకర వాతావరణం చూసి క్షణం ఆగిపోయాడు. అతని గుండెలు దడదడలాడాయి. అంత చలిలో కూడా ముచ్చెమటలు పోసాయి.

అదే క్షణంలో ఆకారం అదృశ్యమైంది.

వేగంగా నడిచి అక్కడంతా వెతికాడు. కాని ఆమె జాడలేదు.

సడెన్‌గా ప్రారంభమైంది వర్షం. సిగ్నల్ కూడా యివ్వకుండా కుంభవృష్టిలా కురవసాగింది.

పూర్తిగా తడిసి ముద్దయిపోయాడు.

అతని ఆశ్చర్యానికి అంతులేదు.

తన కళ్లెదురుగా వున్న ఆకారం అంత సడెన్‌గా ఎలా అదృశ్యమైంది? ఆమెకు అపురూప శక్తులు వున్నాయా?... అంటే ఆమె మనిషి కాదా! దెయ్యమా!! ఆ ఆలోచన అతన్ని మరింత భయపెడుతోంది.

ఉరుములు, మెరుపుల శబ్దానికి, వర్ష వేగానికి భయపడ్డ కీచురాళ్లు అరవడం మానేశాయి. ఒక వృక్షం మీద కూర్చున్న గుడ్లగూబ వెనువెంటనే తొర్రలో దూరిపోయింది.

మరొక్క క్షణం కూడా అక్కడ అతనికి వుండబుద్ధి కాలేదు.

వెనుతిరిగి వడివడిగా నడిచి భవనంలోకి చేరుకున్నాడు.

తడిసిన బట్టలు విప్పి ఒళ్లు తుడుచుకుని పొడిబట్టలు కట్టుకున్నాడు.

నాలుగు రోజులుగా తన నిద్రపాడుచేస్తూ తనను ఎందుకలా భయపెడుతోంది ఆ ఆకారం? ఎవరా దెయ్యం? తనను ఎందుకిలా బాధిస్తోంది?... జవాబులు దొరకని ప్రశ్నలతో సతమతమయిపోసాగాడు రంగనాథవర్మ.

పక్క మంచం మీద నిద్రిస్తున్న పద్మావతీదేవికి ప్రపంచంతో నిమిత్తం లేనట్లు గాఢ నిద్రలో మునిగి వుంది.

* * *

బుల్లెట్‌ను తోపులో ఒక చెట్టుకింద ఆపి స్టాండ్ వేశాడు ఆగంతకుడు.

క్షణం ఆగి నిశిత నేత్రాలతో అటు యిటు పరిశీలించి చూసాడు.

ఎవరూ లేరని నిశ్చయించుకున్న తరువాత చేతిగ్లోవ్స్ సరిచేసుకుని ముందుకు కదిలాడు.

వర్షం కురుస్తూనే వుంది.

ఉరుములు, మెరుపుల వెలుగులో కొన్ని క్షణాలు కనిపిస్తున్న అతని ఆకారం భీతి గొలిపేలా వుంది.

ఎక్కడో పిడుగు పడింది.

కాని ఆగంతకుడు మాత్రం జంకూ గొంకూ లేకుండా నిర్భయంగా ముందుకు పోతూనే వున్నాడు.

సింహద్వారం దాటి మేడమెట్లు ఎక్కసాగాడు. హాలులోని గోడగడియారం గంట కొట్టింది.

అప్పుడు సమయం పన్నెండున్నర అయింది. రంగనాథవర్మ వున్న గది తలుపుల్ని కాళ్లతో తన్నాడు ఆగంతకుడు.

భళ్లున తెరుచుకున్నాయవి.

ఆ శబ్దానికి రంగనాథవర్మతో పాటు పద్మావతీదేవి కూడా తృళ్లిపడి లేచి కూర్చుంది. ఇద్దరి కళ్లలో భయం కదలాడింది. ఆగంతకుడు జేబులోంచి రివాల్వర్ తీసి ఇద్దరికీ గురిపెట్టాడు.

పద్మావతీదేవి సన్నగా వణుకుతోంది.

‘‘ఎవరు నువ్వు?’’ రంగనాథవర్మ ధైర్యం చేసి ప్రశ్నించాడు.

గుండెలు జలదరించేలా, చెవులు చిల్లులు పడేలా విరగబడి వికృతంగా పకపకా నవ్వాడా ఆగంతకుడు.

ఇద్దరికీ పై ప్రాణాలు పైనే పోయాయి. కొయ్య బొమ్మల్లా బిగుసుకుపోయారు.

# 2

ఇంపాలా కారు తారు రోడ్డు మీద చాలా స్మూత్‌గా జారిపోతోంది.

డ్రైవింగ్ సీట్లో లలిత వుంది. ఆమె ప్రక్కనే జలజ కూర్చుంది. లలిత మావయ్య గిరిధర్ మరదలు జలజ.

నలభై కిలోమీటర్ల వేగంతో పోతూంది కారు.

డ్రైవ్ చేస్తోందన్న మాటేగాని ఆమె ఆలోచనలు పరిపరి విధాల పోతున్నాయి.

తన తల్లిదండ్రులు ఏమైపోయారు? 'గాలిబంగ్లా'లో రెస్టు తీసుకుంటున్న వాళ్లు ఉన్నట్లుండి ఎలా మాయమైపోయారు? చాలా విచిత్రంగా వుంది. పోనీ చనిపోయారని అనుకుందామన్నా వాళ్ల శవాలు ఏమైనట్టు? ఇంటిల్లిపాదీ చెప్పే విషయం మాత్రం గాలిబంగ్లాలో వున్న దయ్యాలే తన తల్లిదండ్రులను మాయం చేసాయని..! కాని తనకు దెయ్యాల మీద నమ్మకం లేదు... పోని దెయ్యాలు వున్నాయని అనుకుందామన్నా, దెయ్యాలు ఎక్కడైనా మనుషుల్ని మాయం చేస్తాయా...? తన తల్లిదండ్రులు ఏమైపోయారో తెలిసేవరకూ ఈ ఆలోచనలు తనను ఇలాగే బాధిస్తాయేమో...! క్షణ క్షణం మొహంలో మారుతున్న రకరకాల భావాలతో మానసికంగా బాధపడుతూ డ్రైవ్ చేస్తోంది లలిత.

ఆమె, తల్లి పద్మావతీదేవిని విడిచి క్షణం కూడా వుండలేదు. అలాంటిది తల్లిదండ్రులు మాయం అయిన దగ్గర నుంచి ఇప్పటివరకు నెల రోజులుగా నిలద్రొక్కుకుని వుండగలిగిందంటే చాలా ఆశ్చర్యకరమైన విషయమే!

లలిత నెల రోజులుగా ఎక్కడికీ కదలకుండా ఇంట్లోనే వుండటంతో.. ఆమె బాధ మరీ ఎక్కువౌతుందని గ్రహించిన గిరిధర్ వారం పది రోజులుగా మరదలు జలజను ఆమెకు తోడుగా అలా తిరిగి రమ్మని పంపిస్తున్నాడు.

అలా షికారుకి పోతే మనసు కొంత రిలీఫ్‌గా వుంటుందని ఆశ. లలిత బాధను పోగొట్టడమే అతనికి కావలసిందల్లా.

ప్రతిరోజులాగే ఈరోజు సాయంత్రం అయిదు గంటలకు మెరీనా బీచ్‌కి వెళ్లారు లలిత, జలజ.

సముద్రం మీదుగా వస్తున్న చల్లని గాలుల్ని హాయిగా ఆస్వాదిస్తూ, ఉవ్వెత్తున లేస్తున్న సముద్ర కెరటాలను, అంచెలంచెలుగా కదులుతున్న అలలను వీక్షిస్తూ

కూర్చున్నారు.

జలజ రెండు ఐస్‌క్రీమ్స్ తీసుకుంది. ఇద్దరూ తిన్నారు. మరో అరగంటకు లలిత బోర్ ఫీలయింది.

“ఇంటికి పోదాం” అంది లలిత.

“ఇక్కడ నచ్చలేదా” ప్రశ్నించింది జలజ.

“కాదు... ఇక ఉండబుద్ధి కావడం లేదు”

“పోనీ సినిమాకు వెళ్దామా?”

“ఏ సినిమా?”

“నీ యిష్టం”

“థియేటర్ క్రిస్టల్‌లో ఏం ఆడుతోంది?”

“గోల్డెన్ ఈగిల్-డార్క్ జంగిల్”

“అయితే దానికే వెళ్దాం”

జలజ చాలా యింట్రస్టింగ్‌గా చూసింది సినిమా. లలిత మాత్రం అన్యమనస్కంగానే చూసింది.

సినిమా ముగిసింది...

ఇంటికి వచ్చేస్తున్నా ఆలోచనలు ఆమెను వీడలేదు.

వెనుక తమను సాయంత్రం నుంచి ఒక బ్లాక్ అంబాసిడర్ వెంబడిస్తుందని వాళ్లకు తెలియదు.

ఒక నిర్మానుష్య ప్రదేశంలో అదృశ్య హస్తమేదో ఆపినట్టు టక్కున ఆగిపోయింది ఇంపాలా.

ఇగ్నీషన్ కీ ఎంత తిప్పినా బర్రుబర్రు.. మని శబ్దం వస్తుందే తప్ప స్టార్ట్ కావడం లేదు.

“ఏమైంది?” అడిగింది జలజ.

“ఇంజన్ హీటెక్కినట్టుంది. వాటర్ కావాలి”

“రోడ్డు దిగువన పల్లంలో నీరుంది. నేను తెస్తాను” ఆమె జవాబు కోసం ఎదురు చూడకుండా డిక్కీలో వున్న ఖాళీ డబ్బా తీసుకుని రోడ్డు దిగువకు వెళ్లసాగింది జలజ.

బ్లాక్ అంబాసిడర్ పని మరింత సులువైంది. అందులోని వ్యక్తులు ఓవర్‌టేక్ చేద్దామనుకున్నారు. కాని అదృష్టం మరోలా కలిసి వచ్చింది.

ఇంపాలా వెనుకే బ్లాక్ అంబాసిడర్ ఆగింది. డ్రైవింగ్ సీట్లోంచి ఒక వ్యక్తి, వెనుక

సీట్లోంచి యిద్దరు వ్యక్తులు కిందకు దిగారు.

వాళ్లలో ఒకడు డోర్ తెరిచి లలిత చెయ్యి పట్టుకుని బయటికి లాగాడు.

ఏదో ఆలోచనలో వున్న లలిత వాళ్లను గమనించలేదు. తుళ్లిపడి తేరుకుంది.

''చెయ్యి వదులు'' కోపంగా అంది లలిత.

''వదలడానికి కాదు నీ చెయ్యి పట్టుకుంది. ఒక గంట ఓపిక పట్టు. ఆపై నువ్వు పట్టుకోమన్నా పట్టుకోం నీ చెయ్యి''

చెయ్యి విదిలించుకుంది. కాని లాభం లేకపోయింది. చెయ్యి పట్టుకున్నవాడిది ఉడుంపట్టు.

నీటి గుంటలో డబ్బాతో నీళ్లు ముంచుతున్న జలజ భయంతో అలాగే కూర్చుండిపోయింది. నిలుచుని వాళ్ల కంటపడే ధైర్యం ఆమెకు లేదు.

పరిస్థితి గ్రహించింది లలిత. తను చాలా ప్రమాదకర స్థితిలో చిక్కుకుంది. వెంటనే అక్కడి నుంచి తప్పించుకోకపోతే ఆపై విచారించి ప్రయోజనం లేదు. ఈ దుర్మార్గులు తన శరీరంతో విచ్చలవిడిగా ఆడుకుంటారు. తన జీవితాన్ని నాశనం చేస్తారు.

అదే ఆలోచనతో ధైర్యం చేసింది లలిత. తన చెయ్యి పట్టుకున్న వ్యక్తి చెయ్యిని బలంగా కొరికింది.

వాడు కేకపెట్టి ఆమె చెయ్యి వదిలేసాడు.

అంతే...

మెరుపులా ముందుకు పరుగు తీయసాగింది.

క్షణంలో తేరుకున్నారు ముగ్గురు వ్యక్తులు... దుండగులు.. ఆమె వెనుకే పరుగు ప్రారంభించారు.

ఇదంతా చూస్తున్న జలజకు ఏం చెయ్యాలో తోచటం లేదు.

జిగ్‌జాగ్‌గా పరుగెడుతోంది లలిత. పట్టువదలని విక్రమార్కుల్లా వెంటాడుతున్నారు దుండగులు.

కొందరికి అందం వుంటే ఆకర్షణ వుండదు. మరికొందరికి ఆకర్షణ వుంటే అందం వుండదు. కాని లలిత విషయంలో అలా కాదు. అందం, ఆకర్షణలు రెండూ సమపాళ్లలో పుణికిపుచ్చుకున్న అందగత్తె ఆమె.

ఐదు నిముషాలు ఏకబిగిన పరుగెత్తేసరికి ఆమెలో శక్తి సన్నగిల్లసాగింది. కాళ్లల్లో సత్తువ నశిస్తోంది. మరికొంతసేపు అలా పరుగు తీయలేనని ఆమెకు అర్థం అయిపోయింది.

కొందరికి అందం అదృష్టంగా భావిస్తారు. మరికొందరి విషయంలో అది శాపంలా పరిణమించే వీలుంది. ఆ పరిణామం లలిత విషయంలో జరిగే సూచనలు మెండుగా కనిపిస్తున్నాయి.

ఏదో తన్నేసుకుని ముందుకు పడబోయి అతి కష్టం మీద నిలద్రొక్కుకుంది. క్షణాలు గడిచే కొద్దీ ఆమెలో శక్తి క్షీణదశకు చేరుకుంటోంది.

అదే సమయంలో ఆపద్బాంధవుడిలా ఎదురయ్యాడు- మోటారు సైకిల్‌పై వస్తున్న ఒక వ్యక్తి.

చేయెత్తి సైగ చేసింది ఆపమన్నట్టుగా. మోటారు సైకిల్- రాజ్‌దూత్ ఆపాడా వ్యక్తి.

‘‘మిస్టర్..’’ అంది ఆయాసంతో

‘‘అంజన్’’ తన పేరు చెప్పాడు.

‘‘ఆ దుర్మార్గులు నా వెంటపడి బలవంతం చెయ్యాలని చూస్తున్నారు. ప్లీజ్ హెల్ప్‌మీ...’ వొగురుస్తూ చెప్పింది.

అప్పుడే దగ్గరకు వచ్చేసారు వాళ్లు...

లలిత వల్ల చేతికి గాయం అయిన దుండగుడు ఆమె చెయ్యి పట్టుకోవడానికి సంశయించాడు- మరో చెయ్యి కరుస్తుదేమోనని.

రెండో దుండగుడు నిర్భయంగా ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

‘‘ఆమె చెయ్యి వదులు’’ రాజ్‌దూత్ దిగకుండా హుందాగా చెప్పాడు అంజన్.

‘‘ఇది నీకు అనవసరమైన విషయం. ఇందులో జోక్యం కలిగించుకోకు’’ అన్నాడు చెయ్యి పట్టుకున్న దుండగుడు.

ముగ్గురూ నరరూప రాక్షసుల్లా దృఢమైన శరీరాలతో స్ట్రీట్ రౌడీల్లా వున్నారు.

‘‘నాకు అవసరం కాదని నీకెలా తెలుసు?’’ ప్రశ్నించాడు అంజన్.

‘‘ఇది నా భార్య కనుక’’ పచ్చి అబద్ధం ఆడేసాడు వాడు.

‘‘అబద్ధం. వీడి మాటలు నమ్మకండి. నేను, మా జలజ సినిమా చూసి వస్తుంటే వీళ్లు నన్ను అడ్డుకున్నారు’’

‘‘సో... ఆమెను విడిచిపెట్టండి’’ ఆజ్ఞాపించాడు అంజన్.

స్ట్రీట్ లైటు కాంతి వల్ల అక్కడ పట్టపగల్లా వుంది.

‘‘వీడు మాటలతో లొంగే రకం కాదురా! వీడి పని చూడండి’’ మిగిలిన యిద్దరికి ఆజ్ఞాపించాడు.

రాజ్‌దూత్‌ని పక్కకు పారేసి వాళ్లతో కలియబడ్డాడు అంజన్.

ఆరడుగుల నిండు విగ్రహం అంజన్‌ది. అతని దేహ సౌష్టవం, మొహంలో తేజస్సు చూస్తే ఆడపిల్లల్ని కలవరపెట్టే అందగాడని యిట్టే చెప్పవచ్చు.

అందినవాడిని అందినట్లుగా కాళ్లతోను, చేతులతోను తంతూ తన సత్తా చూపించసాగాడు.

ఇహ లాభం లేదనుకుని మూడో వాడు కూడా కలుగజేసుకున్నాడు.

తన్నులు తినడానికి నువ్వే సిద్ధపడుతుంటే నేనెందుకు కాదంటాను... అని మనసులో అనుకుని ముగ్గురు దుండగులను విరగబాది వదిలేసాడు.

అంజన్ సామాన్యమైన వ్యక్తికాదని గ్రహించిన ముగ్గురు దుండగులు సైగలు చేసుకుని తమ కారు వున్న రూట్‌లో రన్నింగ్ ప్రారంభించారు.

రాజ్‌దూత్‌ను ఆమె పక్కనే నడిపిస్తూ ''ఎవరు మీరు'' ప్రశ్నించాడు అంజన్.

''జమిందార్ రంగనాథవర్మ గారి అమ్మాయిని, నా పేరు లలిత'' చెప్పింది.

ఇద్దరూ మాట్లాడుకుంటూ ఇంపాలా వద్దకు వచ్చారు.

దిక్కుతోచక నీళ్ల డబ్బాతో రోడ్డు మీద నిలుచున్న జలజ మొహం లలితను చూడగానే విప్పారింది.

ఇద్దరూ అతనికి కృతజ్ఞతలు చెప్పారు.

''ఈరోజు నుంచీ మనం ఫ్రెండ్స్. మీరు రేపు మా ఇంటికి తప్పక రావాలి'' అడ్రస్ చెప్పింది లలిత.

''ఓ.. తప్పక వస్తాను'' కారు కదిలేవరకు అక్కడే వుండి రాజ్‌దూత్‌ను ముందుకు దూకించాడు అంజన్.

అతని మీద ఒక ప్రత్యేకమైన అభిప్రాయం యిద్దరికీ ఏర్పడింది.

* * *

అంజన్ ఇంటికి చేరుకునేసరికి పోర్టికోలో ఎదురయ్యారు- దుండగుల్లా నటించిన ముగ్గురు వ్యక్తులు.

రాజ్‌దూత్ స్టాండ్ వేసి వాళ్ల దగ్గరకి వచ్చాడు.

''వెరీగుడ్... చాలా బాగా నటించారు'' మెచ్చుకున్నాడు.

''థాంక్యూ... ఆమె స్నేహం లభించిందా మీకు'' అడిగాడో వ్యక్తి.

''నిక్షేపంగా...'

"అయితే మేం వెళ్లొస్తాం"

"ఓకే.. ముఖ్యమైన విషయాలుంటే రహస్యంగా కలుస్తానని బాస్‌తో చెప్పండి"

తలలూపి ముగ్గురూ వెళ్లిపోయారు.

* * *

మర్నాడు లలిత ఇంటికి వెళ్లాడు అంజన్.

చాలా పెద్ద భవంతి అది. ఇంటి ముందు చక్కని లాన్, ఇంటి వెనుక మామిడితోపు వుంది.

ఇంటిల్లిపాదినీ అతనికి పరిచయం చేసిందామె.

తన అన్న శంకర్, వదిన ప్రీతి, మామయ్య గిరిధర్, అతని భార్య మీనాక్షీ, ప్రీతి తండ్రి కోటిలింగం- ఒక్కొక్కర్ని పరిచయం చేసింది.

ఆరోజు డిన్నర్ అక్కడే చేసాడు అంజన్. అతనికి వద్దన్నా అధికంగా వడ్డిస్తూ సంతోషంతో ఉక్కిరిబిక్కిరి చేశారు- శంకర్, గిరిధర్, లలిత.

వాళ్ల అనురాగ, ఆప్యాయతలను తట్టుకోలేకపోయాడు అంజన్.

అప్పుడే మేడ దిగి వచ్చిన మీనాక్షి చెల్లెళ్లు పేరమాంబ, జలజలు కూడా అతన్ని పలకరించారు.

మీనాక్షి తల్లిదండ్రులు చనిపోయిన తరువాత గిరిధర్ ప్రేమతో పేరమాంబ, జలజలను కూడా తమ వద్దనే వుంచుకుని, వాళ్ల పెళ్లిళ్ల భారాన్ని తన నెత్తిమీద వేసుకున్నాడు. గిరిధర్ ఉన్నత ఆదర్శాలు గల మంచి వ్యక్తి. అంతేకాక భార్య మీనాక్షి అంటే అతనికి అమితమైన ప్రేమ.

చిన్నతనంలో అతను ప్రేమించింది కేవలం అతని తండ్రి విశ్వేశ్వరవర్మను, తల్లి జానకీదేవిని మాత్రమే. వాళ్లను ప్రేమించినంతగా మరెవర్నీ ప్రేమించలేదనే చెప్పాలి. తల్లిదండ్రులంటే అతనికి ప్రాణంతో సమానం. కాని దురదృష్టం అతన్ని వెంటాడి, విధి అతనితో ఆడుకుంటుంటే అతనేం చెయ్యగలడు. గిరిధర్ ప్రాణాన్ని క్షోభపెట్టి తమ ప్రాణాలను విడిచారా పుణ్య దంపతులు. ఇది గిరిధర్ పసిప్రాయంలో... ఆరేళ్ల వయసులో వుండగా జరిగిన విషయం.

తల్లిదండ్రులు చనిపోవడం, తన మామయ్య రంగనాథవర్మ తనను పెంచడం అతనికి తెలుసు.

ఆ రోజుల్లో రావుబహద్దూర్ విశ్వేశ్వరవర్మ జమిందార్‌గారు అంటే తెలియని వ్యక్తి వుండటం అరుదనే చెప్పాలి.

గిరిధర్ చిన్నవాడు కావడం వల్ల ఆయన అనంతరం విశ్వేశ్వరవర్మ గారి వేలు విడిచిన మేనమామ కొడుకు... అంటే ఆయనకు వరుసకు మేనల్లుడు అయిన రంగనాథవర్మ ఆ జమిందారీ బరువు బాధ్యతలను తను స్వీకరించాడు.

తల్లిదండ్రులు ప్రేమించినంతగా కాకపోయినా గిరిధర్‌కి భార్య మీనాక్షిపై వున్న ప్రేమ అధికమనే చెప్పాలి.

రంగనాథవర్మ గిరిధర్ పెళ్లితో పాటు కొడుకు శంకర్ పెళ్లి కూడా చేశాడు. అతని భార్య ప్రీతి ఉత్తమురాలే... ఆమెకు తల్లి లేదు. తండ్రి డి.యస్.పి.గా నాలుగేళ్లు చేసి ప్రమోషన్ లేకుండానే రిటైర్ అయిపోయాడు. అందువల్ల కోటిలింగం ఒక్కడూ, ఎక్కడో ఒంటరిగా ఉండటమెందుకని తన వద్దనే వుండిపొమ్మని శంకర్ చెప్పినందు వల్ల, కొడుకులెవరూ లేని కోటిలింగం వాళ్లతో పాటు వుంటున్నాడు.

వాళ్లతో సాయంత్రం వరకు గడిపి అందరి వద్ద సెలవు తీసుకుని ఇంటికి వచ్చేసాడు అంజన్.

ప్రతిరోజు ఏదో సమయంలో అతన్ని కలుసుకుంటోంది లలిత.

ఒకరోజు అతన్ని ప్రేమిస్తున్న విషయం ఎలాగైతే చెప్పేసింది. అంజన్ కూడా తన యిష్టాన్ని వ్యక్తం చేసాడు. అలా నెలరోజులకల్లా వాళ్ల స్నేహం పటిష్టమైన ప్రేమగా మారి-వారిరువురి ప్రేమకు పునాదిగా మారింది.

# 3

ఒకరోజు..

డ్రెస్సప్ అయి ఎక్కడికో వెళ్లడానికి రెడీ అయ్యాడ్ అంజన్.

బూటు లేసులు బిగించుకుంటుండగా గణగణ మోగింది టెలిఫోన్.

రిసీవర్ ఎత్తి చెవికి ఆనించుకున్నాడు.

''అంజన్ హియర్''

''లల్లీ హియర్'' వినిపించింది లలిత గొంతు.

''హల్లో బుల్లీ''

''ఏయ్.. ఏమిటా పిలుపు''

''మరెలా పిలవమంటావ్?''

''రోజూ ఎలా పిలిచేవాడివో అలా''

''ఓకే లల్లీ డియర్...ఏమిటి విశేషాలు...?''

''చాలా వున్నాయి''

''అయితే ఆలస్యమెందుకు? చెప్పు..''

''ఇక్కడ... ఇలా ఫోన్లో కాదు''

''మరెక్కడ? ఎలా?''

''చెప్తాను. నువ్వు ఇంటి దగ్గరే వుంటావు కదా!''

''తప్పుతుందా మరి. దేవిగారి ఆజ్ఞ కదూ!''

''జోక్‌గా గాదు, సీరియస్‌గా చెప్పు''

''సీరియస్‌గానే చెప్తున్నాను. కానీ అంత సీరియస్ విషయం ఏమిటో?''

''చెప్తాను. ఆ తొందరెందుకు. మరో పావుగంటలో మీ ఇంటికొస్తాను''

''ఉంటాను మరి'' ఫోన్‌లో ముద్దు యిచ్చి రిసీవర్ రెస్టు మీద వుంచాడు అంజన్.

క్షణం ఏదో నిశ్చయించుకుని సాలోచనగా తల పంకించాడు.

* * *

హారన్ మోగించింది లలిత.

బయటికి వచ్చి ఇంటికి తాళం వేసి వచ్చి ఆమె పక్కనే కూర్చున్నాడు అంజన్.

ఇంపాలా ముందుకు దూకింది. మలుపు తిరిగి వేగం అందుకుంది.

చాలా నేర్పుగా డ్రైవ్ చేస్తూంది లలిత.

''మీ అమ్మగారు ఇక్కడ లేరా అంజూ..''

అతన్ని 'అంజూ' అని పిలుస్తుందామె ముద్దుగా.

''లేరు. హైద్రాబాద్‌లో మా మామయ్య దగ్గర వున్నారు.''

''మరి యిక్కడ వుండి నువ్వు చేసే ఉద్యోగమేంటి?''

''నిన్ను ప్రేమిస్తూ, ఆరాధిస్తూ గడిపెయ్యడమే నా ప్రస్తుత ఉద్యోగం'' ఆమె వంక ఆప్యాయంగా చూస్తూ చెప్పాడు.

''ప్లీజ్ అంజూ...''

''నువ్వు నా మీద డిటెక్టివ్ పని ప్రారంభించావా ఏమిటి?'' ఆశ్చర్యంగా అడిగాడు.

''నాకు కావలసింది జవాబు. ప్రశ్నకు ప్రశ్న జవాబు కాదు'' కొంచెం సీరియస్‌గా చెప్పింది.

''నేను సీరియస్‌గానే చెప్తున్నాను. నాకు తరగని ఆస్తి వుంది. ఉద్యోగాలు చేసి ఎవరిని

ఏలాలి అంటుంటారు మా అమ్మగారు. అందువల్ల తాతలు, తండ్రులు సంపాదించిన ఆస్తిని నేనొక్కడినే జల్సాగా ఖర్చు పెడుతున్నాను. ప్రస్తుతం నేను ఖాళీ కనుక నా ఉద్యోగం నిన్ను ప్రేమించడం మాత్రమే''

''అయితే నువ్వెప్పుడూ ఖాళీయే''

''మన పెళ్లయిన తర్వాత మాత్రం కాదు''

''యూ నాటీ...''

''ఇంతకీ నాతో ఏదో చెప్పాలన్నావు?''

జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్ చూసి కారు ఆపేసింది లలిత.

''చెప్తాను. ఇలా వెళ్తూనే మాట్లాడుకోవచ్చు. మన మాటలు ఎవరూ వినే వీలుండదు'' గ్రీన్ సిగ్నల్ చూసి కారును కదిలించింది.

''మా తల్లిదండ్రుల గురించి నీకేమీ చెప్పలేదు కదా!''

''లేదు.''

జరిగినదంతా పూసగుచ్చినట్టు వివరించి చెప్పింది అంజన్‌కి.

''మరి వెంటనే పోలీసు రిపోర్టు యివ్వలేదా?!'' ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

''ఇచ్చాం. కానీ పోలీసు డిపార్టుమెంట్ ఏమి చెయ్యలేకపోయింది. సో...పోలీసు డిపార్ట్‌మెంట్ మీద నాకు నమ్మకం లేదు. ఏదైనా చేస్తే మనమే చెయ్యాలి''

''అంటే నీ ఉద్దేశ్యం?''

''ఆరోజు నువ్వు ముగ్గురు దుండగులను తన్ని, నన్ను రక్షించడమే నేను యిప్పటికీ మర్చిపోలేదు. నీ సాహస పరాక్రమాలు అమోఘం. ఏదైనా సరే చెయ్యగల సమర్థుడవని నాకు అనిపించింది. నా తల్లిదండ్రుల ఆచూకీ తియ్యగల సమర్థత నీకే వుందని ఎందుకో నాకు అనిపిస్తూంది. అందుకే నిన్ను సంప్రదించాలని వచ్చాను.''

''ఆ అభిప్రాయంతో నీకు సహాయపడతానని నన్ను ప్రేమించావా? లేక నిజంగానే ప్రేమించావా?''

అతని మాటలు ఆమె గుండెల్లో చురుగ్గా, వాడిగల బాణాల్లా తగిలాయి.

కనుకొలకుల్లోంచి క్షణాల్లో కన్నీళ్లు ఉబికి బుగ్గల మీదుగా జాలువారాయి.

''లల్లీ..'' అన్నాడు కంగారుగా.

''ఇంత దారుణంగా అపార్థం చేసుకుంటావని నేను అనుకోలేదు. నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమించాను. నా తల్లిదండ్రుల గురించి చెప్పి మొన్ననే నీ సహాయం

ఆర్థించాలన్న ఆలోచన నాకు వచ్చింది. కాని అప్పుడు చెప్పలేక కాలయాపన చేసి చివరికి ఈ రోజు చెప్పాను''

''రియల్లీ సారీ లల్లీ... నీ రియాక్షన్ ఎలా వుంటుందో చూద్దామనిపించి కాజువల్‌గా అడిగాను. తప్పితే నిన్ను అపార్థం చేసుకుని మాత్రం కాదు. అది ఈ జన్మలో జరగదు కూడా...'' స్థిరంగా చెప్పాడు అంజన్.

అతని వైపు ఆరాధనాపూర్వకంగా చూసింది లలిత.

కొన్ని క్షణాలు ఆలోచిస్తూ మౌనంగా వుండిపోయాడు అంజన్. ఆ తర్వాత అన్నాడు ''నువ్వు చెప్పిందంతా చూస్తుంటే ఇదేదో మిస్టరీలా వుంది. నాకు ఎడ్వెంచర్స్ అన్నా, మిస్టరీలను ఛేదించడమన్నా చాలా యిష్టం. సో...నేను కొన్ని ప్రశ్నలు అడుగుతాను. వాటికి ఆలోచించి జవాబులు చెప్పు. ఏ విషయాన్నీ వదలకుండా జవాబు చెప్పాలి''

తల వూపింది లలిత.

''ఇప్పుడీ జమిందారీకి వారసులెవరు?''

''నేను, మా అన్నయ్య శంకర్, మామయ్య గిరిధర్... మేం ముగ్గురమే వారసులం'' చెప్పింది లలిత.

''అసలు... ఆస్తికంతటికీ అసలు వారసుడు మీ గిరిధర్ మామయ్య అని విన్నాను.''

''అవును. అసలు ఈ ఆస్తి, మాకున్న ఎస్టేట్స్ అన్నింటికీ వారసుడు గిరిధర్ మామయ్యే. కాని అతను స్వార్థపరుడు కాదు. చాలా మంచివాడు. నిజం చెప్పాలంటే మా కుటుంబం మొత్తానికి మామయ్య మణిపూస లాంటివాడు. గిరిధర్ అంత మంచి మనసున్న మనిషి మరెక్కడైనా వున్నాడంటే నేను నమ్మను''

గిరిధర్ తండ్రిగారు... అంటే మా తాతగారు శ్రీ రావుబహద్దూర్ విశ్వేశ్వరవర్మగారు చనిపోయిన తరువాత ఎస్టేట్స్, ఆస్తిపాస్తుల వ్యవహారాలు మా నాన్నగారే పర్యవేక్షిస్తూ, వాటిని అభివృద్ధి చేస్తూ ఆరేళ్ల వయస్సు వున్న మా మామయ్య గిరిధర్‌ను సొంత బిడ్డలా సాకి పెంచి పెద్ద చేశారు.

ఆ విశ్వాసం గిరిధర్‌కి వుంది. కనుకనే తన ఆస్తి మొత్తాన్ని నాలుగు సమ భాగాలుగా రాసాడు. గిరిధర్, శంకర్, నేనూ- మా ముగ్గురికీ మూడు సమభాగాలు, మరో భాగం మా తల్లిదండ్రులకు రాశాడు. అంతేకాక మిగిలిన బంధువులందరి బాధ్యత తనే తీసుకుంటున్నానని, వాళ్లని తనే ఆదరిస్తానని వీలునామాలో తెలియజేశాడు.

మరో ముఖ్య విషయం... గిరిధర్ మామయ్యకి 27 సంవత్సరాల వయస్సు వుంది. అంటే నాకంటే ఏడు సంవత్సరాలు మాత్రమే పెద్దవాడు. అతనికి పెళ్లి అయి మూడు

సంవత్సరాలు అయింది. కాని పిల్లలు ఇంతవరకూ పుట్టలేదు. ఇక ముందు తనకు పిల్లలు పుట్టనట్లయితే తన తదనంతరం తన వాటాకి వచ్చే భాగం కూడా నాకు చెందేటట్టు వీలునామాలో స్పష్టంగా రాశాడు.

ఒక్క మాటలో చెప్పాలంటే మామయ్యకి ఆస్తిపాస్తుల మీద కోరిక లేదు. జీవితం సాఫీగా సాగిపోతే చాలనుకుంటాడు'' వివరించి చెప్పింది లలిత.

''మీ నాన్నగారికి శత్రువులెవరైనా వున్నారా?'' సాలోచనగా ప్రశ్నించాడు.

''ఉండే అవకాశం ఎంతమాత్రం లేదు. మా నాన్నగారు అడిగినవారికి లేదనకుండా ఎంతో ధనసహాయం, మాట సహాయం చేసారు. చీమకు కూడా అపకారం చేసి ఎరుగరు. ఆయనకు శుత్రువులెలా వుంటారు?''

''మీ కుటుంబంలో మరెవరికైనా శత్రువులుండే అవకాశం వుందా?''

''నాకు తెలిసినంతలో మా కుటుంబానికి మిత్రులే కాని శత్రువులుండే వీలు ఇసుమంత కూడా లేదు''

''మీ నాన్నగారి అభిరుచులు తెలుసా?''

''సంగీతమన్నా, నాట్యమన్నా, చిత్రలేఖనమన్నా, పురాతన కాలం నాటి అపురూప వస్తువులన్నా ఎంతో మక్కువ''

''వీటిలో ఏమైనా మీ నాన్నగారి వద్ద వున్నాయా?''

''ఆ... 18వ శతాబ్ద కాలం నాటి కొన్ని రాతి, పాలరాతి విగ్రహాలు ఆయన గదిలో ఇప్పటికీ వున్నాయి. ఏం...వాటివల్ల ప్రయోజనం వుంటుందా?'' అర్థం కాక అడిగింది.

''లేదు యధాలాపంగా అడిగానంతే...''

''ఏమోలే... నీ ప్రశ్నల పరంపర చూస్తుంటే నువ్వు 'లా' చదివావేమోనని అనుమానం కలుగుతోంది''

''నేను 'లా' చదవలేదు కానీ నువ్వు డిటెక్టివ్‌లా మాత్రం నన్ను అనుమానించకు''

అతని మాటకు పకపకా నవ్వింది లలిత.

ఆమె నవ్వు గలగలా గోదావరిలా, సెలయేటి ఉరవడిలా పరవళ్లు త్రొక్కుతూ, జీవనదిలా శ్రావ్యంగా వుంది.

''ఇంతకీ మీ తల్లితండ్రులు మాయమైన భవంతి ఇక్కడికి ఎంత దూరంలో వుంది?''

''సుమారుగా నూట ఇరవై అయిదు కిలోమీటర్లు వుంటుంది''

''మీ తల్లిదండ్రులు మాయం కావడానికి కారణం గాని, చిన్న ఆధారం గాని లేదు.

ఎలా మాయం అయ్యారో ఎవరికీ తెలియదు. కనుక మనం అక్కడి నుంచే నరుక్కు రావాలి. అంటే అక్కడినుంచే మన కార్యక్రమం ప్రారంభించాలి''

''అయితే రేపే వెళ్లి వద్దాం''

''వెళ్లిరావడానికి కాదు. అలా చేస్తే ప్రయోజనం వుండదు. మన కోరిక ఫలించదు. అక్కడ కొన్ని రోజులు వుండి, ఎవరికీ తెలియకుండా పరిశోధన ప్రారంభించాలి. ఏదోరోజు ఏదో ఒక 'క్లూ' అయినా దొరక్కపోదు. అప్పుడు మరింత సులభవుతుంది నా పని'' చెప్పాడు అంజన్.

''అయితే సరే... మా నాన్నగారి 'గెస్టుహౌస్' గురించి మా బంధువులెవరికీ సరిగ్గా తెలియదు. నాకు, గిరిధర్, శంకర్‌లకు మాత్రమే తెలుసు. నేను కూడా రెండు మూడుసార్లు మాత్రమే అక్కడికి వెళ్లాను.

ఇంట్లో బంధువులంతా, మా తల్లిదండ్రులు మసలిన ఇక్కడి బిల్డింగ్‌లో తిరగలేకపోతున్నారు. ఇక్కడ వుంటే మాతోపాటుగా వాళ్లకి కూడా దిగులే. ప్రదేశం మారితే మా అందరికీ మానసికంగా మార్పు రావచ్చు. కొంత రిలీఫ్‌గా వుంటుంది. పిక్నిక్‌కి వెళ్లినట్టూ వుంటుంది.

పిక్నిక్ అనే వంకతో వాళ్ల మనసులు డైవర్టు చెయ్యడానికి ప్రయత్నిస్తాను. అప్పుడు మన పని సులభమవుతుంది. నువ్వు కూడా నాతో వస్తే వాళ్లకు మరో నాలుగు మాటలు చెబుదువుగాని'' కారుని స్లో చేసి రైట్ టర్న్ తిప్పింది లలిత.

''వస్తాగానీ ఒక విషయం మాత్రం గుర్తుంచుకో... మన ప్లాన్ మీ బంధువులెవ్వరికీ తెలియకూడదు సుమా!''

మౌనంగా తల వూపింది ఆమె.

వాళ్ల ఆలోచనలు ఎంత భయంకరమైనవో, వాటి పరిణామాలు, పర్యవసానాలు ఎంత ఘోరమైనవో వాళ్లకా క్షణంలో తెలియదు...!!!

* * *

పొడవుగా, విశాలంగా వున్న డైనింగ్ టేబుల్ చుట్టూ కూర్చుని భోజనం చేస్తున్నారు- శంకర్, ప్రీతి, గిరిధర్, మీనాక్షి, పేరమాంబ, జలజ, కోటిలింగం.

టేబుల్‌పై చక్కగా సర్ది వున్న ఆహార పదార్థాలను ఎవరికి కావల్సినవి వాళ్లు వడ్డించుకుంటున్నారు.

''రాత్రి నా మీద గాలి సోకింది'' అంది ప్రీతి.

''ఏం చేసింది అమ్మాయి?''ప్రశ్నించాడు ప్రీతి తండ్రి కోటిలింగం.

యాభై సంవత్సరాల వయసున్న కోటిలింగం, పోలీస్ ఆఫీసర్‌గా వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నా, మనిషి చాలా హుందాగా, బలంగా వుంటాడు.

రాత్రి జరిగిన సంఘటన తలచుకుని చెప్పసాగింది ప్రీతి. ''నేను వెల్లకిలా పడుకున్నాను. అర్థరాత్రి సమయంలో నా గుండెల మీద ఎక్కి కూచుంది దెయ్యం. నేనెంత పక్కకు తిరుగుదామన్నా తిరగలేకపోతున్నాను. నా పీక నొక్కేస్తోంది... పశుబలంతో నొక్కేస్తోంది. నేను ఆశక్తురాల్ని అయిపోతున్న తరుణంలో- నా బలమంతా ప్రయోగించి అతి కష్టం మీద పక్కకు తిరిగాను. అప్పుడు వదలేసింది దెయ్యం''

అక్కడున్న వాళ్లంతా చిన్నగా నవ్వుకున్నారు. పగలబడి నవ్వింది మాత్రం ప్రీతి భర్త శంకర్ మాత్రమే.

''ఎందుకలా నవ్వుతారు వెకిలిగా... అక్కడికి నేనేదో కల్పించి కథ చెప్పినట్టు'' అక్కసునంతా మాటల్లో వెళ్లగ్రక్కింది ప్రీతి.

బలవంతంగా నవ్వాపుకున్నాడు శంకర్. ''కల్పితం కాదు. అది నీ భ్రమ. రాత్రి నువ్వు కిటికీ దగ్గర మంచం వేసుకుని పడుకున్నావు. నువ్వు దెయ్యం అని చెబుతున్నదానికి నేను సైంటిఫిక్ రీజన్ చెబుతాను విను. రాత్రి సమయాల్లో చెట్లు కార్బన్-డై-ఆక్సైడ్ (బొగ్గుపులుసు వాయువు)ని విడుస్తాయి. బొగ్గుపులుసు వాయువు పీలిస్తే ఊపిరి సలపదు. ఎగశ్వాస వచ్చి గుండెల మీద బరువుగా వుంటుంది. మన తోటలోని చెట్ల గాలి నువ్వు పీల్చినందు వల్ల.. అంటే చెట్లు విడిచిన బొగ్గుపులుసు వాయువు పీల్చినందువల్ల నీకు ఊపిరి ఆడక, ఎగశ్వాస వల్ల గుండెల మీద ఎవరో ఎక్కి కూర్చున్నట్టూ, పీక నొక్కేస్తున్నట్టూ భ్రాంతి కలుగుతుంది. మంచి నిద్రలో వున్న నువ్వు కూడా అటువంటి భ్రాంతికే గురయ్యావు'' విడమర్చి చెప్పాడు.

''సర్లెండి. మీరెప్పుడు నా మాట ఖాతరు చేసారు గనక'' నిష్టూరంగా అంది.

''నాన్‌సెన్స్.. దెయ్యాలు లేవు, భూతాలు లేవు, అదంతా వట్టి భ్రమ... అభూతకల్పన.. ఒకవేళ దెయ్యాలు వున్నాయని నీ మాటను ఖాతరు చేసినా, దానికి మరో రీజనింగ్ చెప్తాను. నువ్వు రాత్రిపూట పర్..పర్.. మని సన్నికాలు మీద గరమ్ మషాలా నూరినట్టు పళ్లు నూరుతావు కదా! నీ పళ్లు నూరే విధానం చూసిన ఏ దెయ్యం కూడా నీకు భయపడి నీ పక్కకు కూడా చేరదు'' అన్నాడు శంకర్.

ఈసారి అంతా పగలబడి నవ్వారు.

''నాకున్న అలవాటును ఎత్తి చూపి నన్ను అవహేళన చేయడం మాత్రం మీకు బాగా తెలుసు''

“అన్నయ్యా ఏదో సరదాకి అంటే నువ్వలా మూతి ముడుచుకుంటావెందుకు?” సర్దిచెప్పింది పేరమాంబ

“అంతా ఒక్క క్షణం ఆగండి. అమ్మాయి దెయ్యం అంటే జ్ఞాపకం వచ్చింది. రాత్రి నేనొక భయంకరమైన పీడకల కన్నాను. అది మీకందరికీ చెబుతాను” ఒక్క క్షణం చెప్పటం ఆపి కంచంలో చెయ్యి కడుక్కుని మంచినీళ్లు గటగటా తాగేశాడు కోటిలింగం.

అతను ఏం చెబుతాడా అని ఆతృతతో అందరూ అతను చెప్పబోయే విషయం మీద ఉత్సుకతతో మనసులు లగ్నం చేశారు.

ఒకసారి తేన్చి, నాప్‌కిన్‌తో చేతులు తుడుచుకుని చెప్పసాగాడు కోటిలింగం.

“నేను నా స్నేహితుడి కూతురు పెళ్లికి కృష్ణాపురం వెళుతున్నాను. బస్సులో నన్ను మరో ముగ్గురు మిత్రులు కలిశారు. వాళ్లు కూడా ఆ పెళ్లికే వస్తున్నారు. బస్సు డ్రైవర్ మమ్మల్ని ఒకచోట దింపేసి, దారి చూపించి నడిచి పొమ్మన్నాడు. నేను అలా వీల్లేదన్నాను. బస్సు ఆ రూట్‌లో వెళ్లదని, దూరం ఎంతో వుండదు. మహా అయితే ఆరు మైళ్లు వుంటుందని, హాయిగా నడుచుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ పోతే దూరమే తెలియదని చెప్పి వెనుదిరిగి చూడకుండా బస్సును పోనిచ్చాడు. మాకు అసలు విషయం తెలియదు. ఆ రూట్‌లో...” చెప్పడం ఆపి అరగ్లాసుడు మంచి నీళ్లు తాగాడు.

అంతా థ్రిల్లింగ్‌గా వింటున్నారు. కథ మాంచి రసపట్టులో వుండేసరికి అందర్నీ టెన్షన్‌లో పెట్టేసి సస్పెన్స్ విడగొట్టకపోయేసరికి ఎవరికి వారే బాధగా ఫీలయ్యారు.

ఉండబట్టలేకపోయాడు గిరిధర్. “ఆ రూట్‌లో...’ అందించాడు.

“ఆగు ఆగు.. వస్తున్నా.. కంగారుపడితే లాభం లేదు” వాళ్లను మరింతగా యిబ్బందికి గురిచేసాడు.

“అంకుల్.. చెప్తే సరిగ్గా చెప్పండి. లేకపోతే మానేయండి . అంతేకాని, సస్పెన్స్‌తో మమ్మల్ని చంపకండి” అంది జలజ.

“ఆ రూట్‌లో...” కోటిలింగం మాట విని తిరిగి అంతా ఎలర్ట్ అయ్యారు.

“ఆ రూట్‌లో దెయ్యాల బెడద చాలా విపరీతంగా వుంటుందని వినికిడి. కానీ మాకు ఆ విషయం తెలియదు. నలుగురం నిర్భయంగా నడుస్తున్నాం. మూడు మైళ్లు ఏకధాటిగా నడిచాం. మా కాళ్లల్లో నిస్సత్తువ ఏర్పడింది. వెన్నెల వెలుగులో, ఇరుప్రక్కలా పొలాలను పెట్టుకుని, నక్కల అరుపులు వింటూ పోవాలంటే మాకు భయంగానే వుంది. అయినా ఒకరికొకరం ధైర్యం చెప్పుకుంటూ ముందుకు సాగిపోయాం.

అలా మరో రెండు ఫర్లాంగుల దూరం నడిచిన మాకు కనుచూపు దూరంలో

పట్టపగల్లా విద్యుత్ దీపాల కాంతి కనిపిస్తూ మా కళ్లను చెదరగొట్టేసింది. అదేమిటో చూసి వెళ్దామని ఆ కాంతి దగ్గరకు వెళ్లాం. అక్కడ...'' ఆగి మంచినీళ్లు తాగాడు.

''అంకుల్..'' మారాం చేసింది పేరమాంబ

''ఉండమ్మాయి... చెబుతున్నాను'' అంటూ తిరిగి అందుకున్నాడు.

''అక్కడ ఒక పెద్ద పందిరి వేసి వుంది. అంత పెద్ద పందిరిని నేను ఏ పెళ్లిలోనూ చూడలేదు. పందిట్లో ఒక పక్కగా పెళ్లి మంటపం వేసి వుంది. వధూవరులకు పెళ్లి తంతు చాలా ఘనంగా సాగుతోంది. మరో పక్కగా వంద టేబుల్స్, రెండు వందల కుర్చీలు అమర్చి వున్నాయి. వాటిమీద అరిటాకులు చూసేసరికి భోజన సదుపాయాలు చేస్తున్నారని అర్థం చేసుకున్నాను. భోజన సదుపాయాలు చేసిన వడ్డనకారులు పది మంది- ఒక పంక్తికి భోజనం వడ్డించారు.

మమ్మల్ని నలుగుర్ని చూసిన ఇద్దరు వడ్డనకారులు బలవంతంగా తీసుకువెళ్లి రెండోపంక్తిలో కూర్చోబెట్టారు. అప్పటికే ఆకలితో నకనకలాడుతున్నాయి మా కడుపులు. అందువల్ల అభ్యంతరం చెప్పకుండా భోజనాలకు ఉపక్రమించాం.

భోజనం అదోరకంగా అనిపించసాగింది. కాయగూరల వంటకాలు కూడా పెద్ద బాగోలేవు. స్వీట్స్ తింటుంటే అదోరకంగా కొంచెం వెగటుగా అనిపించసాగింది. అయినా సరే బాగోదని తినేస్తున్నాం. అక్కడ పదిమంది చాలా హడావిడిగా వడ్డిస్తున్నారు.

వాళ్లలో ఒక వ్యక్తి 'శవా' స్పెషల్... 'శవా' స్పెషల్... అని అరుస్తూ ముందుకు కదుల్తున్నాడు. ప్రతి ఒక్కరూ ఎంతో ఇష్టంగా అతన్ని వడ్డించమంటున్నారు. అతను ఒక్కొక్కళ్లకీ వడ్డిస్తున్నాడు.

అదేదో కొత్తరకం వంటకమనుకుని మేము కూడా వడ్డించమన్నాం. అది మాంసం కూర. ఏ అనుమానం లేకుండా తినేసాం.'' భోజనం ముగించిన మమ్మల్ని తీసుకువెళ్లి మంటపం ఎదురుగా వున్న కుర్చీల్లో కూర్చోబెట్టారు.

మేం వెళ్లాలనుకున్నది పెళ్లికే కదా, ఏ పెళ్లి అయితేనేం.. ఈ పెళ్లి చూసేద్దాం అని నిశ్చయించుకుని పెళ్లితంతును చాలా ఉత్సాహంగా చూస్తున్నాం. పురోహితుడు చిన్న చిన్న ఎముకలతో కూర్చిన దండను అందరి కళ్లకూ అద్దుతున్నాడు. అదే తాళిబొట్టు అనీ, అది వాళ్ల ఆచారమనీ అనుకున్నాం.

పెళ్లికూతురు, పెళ్లికొడుకు మెళ్లో ఆ దండను మూడు ముళ్లు వేసింది. అది కూడా వాళ్ల ఆచారమేనని సరిపెట్టుకున్నాం. కానీ తాళికట్టే సమయంలో పెళ్లికూతురు కాళ్లవంక మామూలుగా చూశాం. ఆమె కాళ్లు వెనక్కి తిరిగివున్నాయి. ఆశ్చర్యంగా పెళ్లికొడుకు

కాళ్లు చూసాం. అవి కూడా వెనక్కి తిరిగి వున్నాయి. పందిట్లో వున్న అందరి కాళ్లూ, భోజనాలు చేసే వారి కాళ్లూ, వడ్డనలు చేసే పదిమంది కాళ్లూ చూసిన మాకు వెన్నులో వణుకు పుట్టింది. మా నలుగురి కాళ్లూ తప్ప అందరి కాళ్లూ వెనక్కి తిరిగి వున్నాయి. మరో విషయం... వాళ్లందరూ తెల్లవస్త్రాలు ధరించారు.

భయంతో సైగలు చేసుకుని ఒక పక్కకు పోయాం. అక్కడ వంటలు వండుతున్నాయి పది దెయ్యాలు... ఆడ దెయ్యాలు. పెద్దగా ఏదో అరుస్తున్నాయి. నాలుగు దెయ్యాలు ఒక శవాన్ని మోసుకొచ్చి మా కళ్లముందే దాన్ని ముక్కలుగా తరిగి పెద్ద డేగిశాలో వేసి ఉడికిస్తున్నాయి.

అప్పుడే 'శవా' స్పెషల్ తయారయిందా'' అని వచ్చాయి రెండు 'వడ్డన' దెయ్యాలు. తయారవుతోందని చెప్పాయక్కడి దెయ్యాలు.

వేం నలుగురం తిన్నది శవం మాంసమని అర్థమయ్యేసరికి మా కడుపుల్లో దేవినట్లయింది. అక్కడే వాంతులు చేసుకుని, కళ్లు తిరిగి అలాగే పడిపోయాము.

తెల్లారి చూస్తే మేం ఒక స్మశానంలో ఒక పెద్ద సమాధిపై పడుకుని వున్నాం. ఇదెక్కడి దెయ్యాల గోలరా భగవంతుడా అనుకుని మరొక్క అరక్షణం కూడా అక్కడ వుండకుండా వెనుతిరిగి మా ఊరు వచ్చేసాం'' చెప్పటం ముగించాడు.

అంతా బిగబట్టిన ఊపిరిని తృప్తిగా విడిచారు. అందరి మొహాలపై చిరుచెమటలు అలుముకున్నాయి.

''ఇదంతా కలని మీరంతా అనుకుంటున్నారుకదూ! కాని కాదు..పదేళ్ల క్రితం నిజంగా జరిగిన వాస్తవ సంఘటన'' అన్నాడు కోటిలింగం.

''నువ్వు చెప్పిన కల అంతా బాగానే వుంది. కాని 'వాస్తవం' అనే మాట మాత్రం బాగోలేదు మామయ్యా..'' శంకర్ అన్నాడు.

''అంటే దెయ్యాలు లేవని నీ ఉద్దేశ్యమా?''

''ముమ్మాటికీ...''

''నీ ఉద్దేశ్యం ఏమిటి గిరిధర్?''

''ఏదైనా ఒక విషయాన్ని చెప్పవలసివస్తే దాని గురించి పూర్తిగా తెలిసి వుండాలి. నాకు దెయ్యాల గురించి తెలిసినా, అవి వున్నాయో లేదో తెలియదు. తెలియని విషయం గురించి ఏమని చెప్పగలను'' అన్నాడు గిరిధర్.

కోటిలింగం ఆడవాళ్లను ప్రశ్నించాడు.

ప్రీతి, మీనాక్షి, పేరమాంబ తమకు దెయ్యాల మీద నమ్మకం వుందని చెప్పారు.

జరుగుతున్న సంభాషణంతా డైనింగ్ హాల్ బయటి నుంచి వింటూనే వున్నారు అంజన్, లలితలు.

‘‘అసలు మీలో కొందరు దెయ్యాల మీద నమ్మకం లేదంటున్నారు. మన గెస్ట్‌హౌస్‌ను ‘గాలిబంగ్లా’ అని ఎందుకు పిలుస్తారనుకుంటున్నారు. ‘గాలి’ అంటే దెయ్యం... ‘బంగ్లా’ అంటే భవనం. అందువల్ల గాలిబంగ్లా అంటే ‘దెయ్యాల భవనం.’ నా రీజనింగ్ బావుందా అల్లుడూ’’

గాలిబంగ్లా మాట వచ్చేసరికి అందరి ఒళ్లు అప్రయత్నంగా జలదరించింది.

అదే సమయంలో డైనింగ్ హాల్లోకి ఎంటరయ్యారు లలిత, అంజన్‌లు.

శంకర్ ఏదో చెప్పబోయేంతలో కోటిలింగం అడిగాడు, దెయ్యాలపై మీ అభిప్రాయం ఏమిటని.

లలిత తనకు నమ్మకం లేదని చెప్పింది.

‘‘ఏ విషయాన్నయినా ఇతమిద్ధంగా తెలుసుకుంటేగాని నేనేదీ నిశ్చయించుకోను’ అని అంజన్ సమాధానం.

‘‘మీరంతా తలోరకంగా మాట్లాడుతున్నారు. అయితే గాలిబంగ్లాలో రంగనాథవర్మ, పద్మావతీదేవి మాయం కావడానికి కారణం ఏమై వుంటుందని మీ ఊహ’’ సడెన్‌గా ప్రశ్నించాడు.

ఆ మాటలతో అందరి శరీరాలు సన్నగా కనిపించాయి. కాని ఎవరూ మాట్లాడలేదు. ఆ విషయంలో మాట్లాడే ధైర్యం ఎవరికీ లేదని అర్థం చేసుకున్నాడు కోటిలింగం.

‘‘సరే... నేనొక ప్రపోజల్ చేస్తాను. దానికి మీరంతా అంగీకరిస్తారా?’’

‘‘ఏమిటది?’’ గిరిధర్ ప్రశ్న

‘‘మనమంతా కలిసి గాలిబంగ్లాలో ఒక పదిరోజులు గడుపుదాం... ఈ పదిరోజుల లోపులో మీకందరికీ దెయ్యాలున్నాయని రుజువు కావచ్చు. కాకపోయినా యిబ్బంది లేదు. పది రోజుల పాటు కొత్త వాతావరణంలో చెట్ల గాలి పీలుస్తూ హాయిగా గడిపేద్దాం. అక్కడి వాతావరణం చాలా బావుంటుంది’’

‘‘ఒకవేళ దెయ్యాలున్నాయని రుజువైతే?’’ అడ్డుప్రశ్న వేసాడు అంజన్.

‘‘మీ యిష్టం, మనం అక్కడి నుంచి ఎప్పుడు వచ్చేద్దామంటే అప్పుడే వచ్చేద్దాం’’

పది నిమిషాలు అంతా నిశ్శబ్దంగా వుండిపోయారు. ఆ నిశ్శబ్దాన్ని మరో రకంగా అర్థం చేసుకున్నాడు కోటిలింగం. ‘‘అంటే దెయ్యాలున్నాయని మీకెవరికీ నమ్మకం లేదుగానీ గాలిబంగ్లాకి వెళ్లాలంటే మాత్రం చాలా భయంగా వుందన్నమాట’’

అతని మాటలు శంకర్ మీద చురుగ్గా పనిచేసాయి.

''భయం... అదంతా మనం కల్పించుకున్న అభూత కల్పన. మన నీడను చూసి మనమే భయపడతాం. అదేమిటి? మనం కల్పించుకుని భయపడే భ్రాంతి. నాకే భయం లేదు. నేను సిద్ధమే'' అన్నాడు శంకర్.

''బ్రదర్... మీ ప్రపోజల్ బావుంది. ఇక్కడి వాతావరణంలో మీరెవరూ సంతోషంగా వుండలేకపోతున్నారని గ్రహించాను. అందుచేత పది రోజుల పాటు హాయిగా తిరిగి వచ్చినట్టు వుంటుంది. మీకెవరికీ అభ్యంతరం లేకపోతే కోటిలింగం గారి ప్రపోజల్‌కి నాకు కూడా అభ్యంతరం లేదు'' చెప్పాడు గిరిధర్.

అసలు ఫస్ట్ ఆ ప్రపోజల్ తీసుకువద్దాం అనుకున్నది లలిత, అంజన్‌లు. కాని వీళ్లకంటే ముందుగానే దాన్ని కోటిలింగం తీసుకువచ్చాడు. కాగల కార్యం గంధర్వులే తీర్చారనే సామెత ప్రకారం అంజన్, లలితల ప్రమేయం లేకుండానే అంతా తమ ఆమోదముద్రను తెలియజేశారు.

శంకర్ అన్నాడు ''నా ఫ్రెండ్స్ కిశోర్, రవిలను పిలుస్తాను. ప్రస్తుతం వాళ్లు ఖాళీగా వున్నారు''

''మీకెవరికీ అభ్యంతరం లేకపోతే నా తమ్ముడు మదన్‌ని తీసుకువస్తాను'' అన్నాడు అంజన్

''మీ తమ్ముడు గురించి మాకెవరికీ చెప్పలేదే?'' అంతా ఒకేసారి అడిగారు.

''అవకాశం రాక చెప్పటం మరిచాను''

''నువ్వు ఎంతమందిని తీసుకువచ్చినా యిక్కడ ఎవరికీ అభ్యంతరం వుండదు'' గిరిధర్ చెప్పాడు.

మనం వెళ్లేది కేవలం పిక్నిక్‌కే అన్న భావంతో వుండండి. అంతేగాని అనవసర భయాలతో మనసుల్ని కలవరపరచుకోకండి. మరో విషయం, మనకి అక్కడ తిండికి ఏ లోటూ వుండదు. నెల రోజులకు సరిపడే ఆహార పదార్థాలు ఎప్పుడూ స్టాక్ వుంటాయి. తోటమాలి రామదాసు, వంటవాడు సోములు వుంటారు. మనకో పనిమనిషి అవసరం వుంటుంది. నాకు తెలిసిన పనిమనిషి మంగతాయారును సాయంత్రం కుదురుస్తాను. మన ప్రయాణం రేపే. కనుక ఎవరికి కాలసినవి వాళ్లు సిద్ధం చేసుకుని రేపు ఉదయం తొమ్మిది గంటలకల్లా రెడీగా వుండండి''

అంతా మౌనంగా తలలు ఆడించారు.

తామంతా వెళ్లబోయేది సామాన్యమైన ప్రదేశానికి కాదని, అతి భయంకర

పరిస్థితులకు గురిచేసే భీకర వాతావరణ ప్రాంతానికని వాళ్లకు తెలిసినట్లయితే కథ మరో కొత్త మలుపు తిరిగేది...!!!

# 4

సరిగ్గా ఉదయం తొమ్మిది గంటలకి అంతా రెడీ అయ్యారు.

పోర్టికోలో మూడు కార్లు- కాడిలాక్, రోల్స్ రాయిస్, ఇంపాలా సిద్ధంగా ఉన్నాయి.

సూట్‌కేసులు, ఎయిర్‌బ్యాగ్స్, లెదర్ బ్యాగ్స్ మొదలైన సరంజామా మోసుకొచ్చి మూడు కారుల డిక్కీలలో సర్దేశారు.

రోల్స్‌రాయిస్‌ను డ్రైవర్ డ్రైవ్ చేస్తున్నాడు. అతని పేరు చంద్రం. అతని పక్కన రవి, కిశోర్ కూర్చున్నారు. వెనక సీట్లో కోటిలింగం, జలజ, పేరమాంబ వున్నారు. ఇంపాలాను అంజన్ డ్రైవ్ చేస్తున్నాడు. అతని పక్కన మదన్, శంకర్ కూర్చున్నారు. వెనక సీట్లో ప్రీతి, పనిమనిషి మంగతాయారు వున్నారు. మూడో కారు కాడిలాక్‌ను మీనాక్షి డ్రైవ్ చేస్తోంది. ఆమె పక్కన గిరిధర్ కూర్చున్నాడు. ఆ పక్కన లలిత...

కార్లు మూడూ వరుస తప్పని సైనికుల్లా ఒకదాని వెంట మరొకటి లైన్‌గా-గేటు దాటి... మలుపు తిరిగి వేగాన్ని పుంజుకున్నాయి.

మరికొంత సేపటికి మద్రాసు నగర శివార్లను దాటాయి మూడు కార్లూ..

''బోర్‌గా వుంది ఏమైనా విషయాలు చెప్పండి బాబాయిగారూ...'' రవి సలహా ఇచ్చాడు.

''ఏం చెప్పను'' సాలోచనగా అడిగాడు కోటిలింగం.

''మీరు పోలీసు ఆఫీసరుగా వున్న రోజుల్లో మీరు చేసిన ఏదో ఒక సాహసం చెప్పండి'' సజెస్టు చేసాడు కిశోర్.

''అయితే సరే.. అంతా జాగ్రత్తగా వినండి. గుండెలు అరచేతుల్లో పెట్టుకుని మరీ వినండి''

''ముందు మీరు పెట్టుకుని చూపించండి. ఆ తర్వాత మేం ఆచరిస్తాం'' జలజ అంది.

ఆమె వంక ఖంగు తిన్నట్టు చూసాడు కోటిలింగం. మిగిలిన వాళ్లు నవ్వేసారు.

మాట మారుస్తూ ''సరే..సరే.. చెప్తున్నాను వినండి. ఒక రోజు ఒక గజదొంగను పట్టుకున్నాను. పట్టుకున్న పది నిముషాలకే నాకు మస్కా కొట్టి పారిపోయాడు వాడు. ఎలాగైతే రెండు రోజుల తర్వాత ఒకచోట మారువేషంలో వున్న ఆ గజదొంగను చూసి

పట్టుకోబోయాను. నన్ను చూసి భయంతో పరుగులు తీసాడు. నాకు కోపం ఆగలేదు. ఆగమని హెచ్చరించినా ఆగలేదు. రివాల్వర్‌తో వాడి కాలుమీద షూట్ చేసాను. వెంటనే పడిపోయాడు. రక్తం చాలా విపరీతంగా కారిపోతోంది. భయంతో వాడు షివరింగ్ అయిపోతున్నాడు. వెంటనే అంబులెన్స్‌ను రప్పించి హాస్పిటల్‌లో జాయిన్ చేద్దామని నేను కూడా ఎక్కాను.

అంబులెన్స్ కదిలాక నా మనసు కుదుట పడింది. మరో పది నిముషాల్లో వాణ్ణి హాస్పిటల్‌లో జాయిన్ చేయవచ్చు కదా అనుకున్నాను. కానీ నేను కూడా హాస్పిటల్ బెడ్ మీదకే చేరబోతున్నానని ఆ క్షణంలో నాకు తెలియదు'' చెప్పటం ఆపాడు.

''ఆ తర్వాత ఏమైంది?'' ఆతృత నిలుపుకోలేక అడిగింది పేరమాంబ.

తిరిగి చెప్పసాగాడు. ''అంబులెన్స్ అంటే అంతా అనుకునేది అపాయకరమైన స్థితిలో వున్న రోగులను చేరవేసే వాహనం అని. దానికో ప్రత్యేకత వుంది. కానీ అదే అంబులెన్స్ రోగుల్ని పైకి కూడా పంపేయగలదని నాకు తెలిసి వచ్చింది. అంటే, ఒకచోట అంబులెన్స్‌కు యాక్సిడెంట్ అయింది. గజదొంగ చచ్చిపోయాడు. ముక్కూమొహం ఏకమైపోయిన నేను- గజదొంగకు ఏర్పాటు చేసిన బెడ్‌మీదకి, డ్రైవర్ మరో బెడ్‌మీదకి చేరుకున్నాం''

అంతా విని నవ్వుల్లో మునిగిపోయారు వాళ్లు.

మరో పది నిముషాలకు ఒక పక్కగా మట్టిరోడ్డు మీదకు మళ్లాయి కార్లు.

రోడ్డుకిరుప్రక్కలా పొలాలు వున్నాయి. వ్యవసాయదారులు, శ్రామికులు పొలాల్లో పనిపాటలు చేసుకుంటూ- జానపద గేయాలు పాడుకుంటున్నారు. మరో గంటకు మలుపు తిరిగాయి కార్లు.

అక్కడంతా చిన్నచిన్న మెట్టలు, కొండలు; అక్కడక్కడ గుబురు పొదలు, చెట్లు వున్నాయి. అదో రకమైన ప్రత్యేకమైన వాతావరణం అది.

మెట్టల పక్కగా వున్న దారిలోంచి సాఫీగా సాగిపోతున్నాయి కార్లు.

అక్కడి వాతావరణం చాలా ఆహ్లాదకరంగా వుంది.

అంతా అదోరకమైన థ్రిల్‌కి గురయ్యారు.

మరో రెండు గంటల ప్రయాణం అనంతరం 'గాలిబంగ్లా' ఎంట్రన్స్ గేటును చేరుకున్నాయి కార్లు

తోటమాలి రామదాసు హడావుడిగా గేటు తెరిచాడు.

గేటు అవతల చెట్ల తోపు మధ్యలో ఏదో భవన ప్రాకారం కనిపిస్తోంది.

పాతిక ఎకరాల ఆవరణ అంతా అల్లిబిల్లిగా పెరిగిన వృక్ష సంపదతోనే నిండిపోయి

వుంది. గేటు వద్ద నుంచి చెట్లమధ్యగా తారురోడ్డు వేసి వుంది. ఆ రోడ్డు అష్టవంకర్లు తిరిగి ఎటో పోతోంది.

తారురోడ్డు మీదుగా ముందుకు సాగిపోయాయి కార్లు.

అక్కడక్కడ కొన్ని రకాల పూపొదలు, పిచ్చిమొక్కలు విచ్చలవిడిగా పెరిగిపోయి వున్నాయి.

రకరకాల వృక్షాలు, పూపొదలు, పిచ్చిమొక్కలతో ఆ వాతావరణం... అదో భీతికరంగా వుంది.

బిల్డింగ్ వెనుక కనుచూపు దూరంలో పెద్దపెద్ద కొండబండలు, రాతి దిబ్బలు అర్ధచంద్రాకారంలో వుండి గాలిబంగ్లాకు ఒకవైపు.. వెనుకవైపు కవచంగా వున్నాయి. మిగిలిన భాగమంతా పన్నెండు అడుగుల ఎత్తున వున్న ప్రహరీగోడ అర్ధ చంద్రాకారంలో కవర్ చేసింది. మొత్తానికి గాలిబంగ్లాను చుట్టి కవచంలా వుందా కట్టడం..

బంగ్లా పోర్టికోలోకి చేరుకున్నాయి కార్లు. ఒక్కొక్కరుగా అంతా కారుల్లోంచి కిందకు దిగారు.

''ఓహో.. అంతా వచ్చేసారా! రండి.. రండి'' అని అందర్నీ ఆహ్వానిస్తున్నట్టు అన్నాడు సోములు.

''అయ్యలు లోనికి పోతారుగానీ నువ్వు రారా అబ్బీ, సామాను లోనికి జేరెయ్యాల'' అన్నాడు డిక్కీ తెరుస్తూ రామదాసు.

రామదాసు కొడుకే సోములు. వాళ్లు వంశపారంపర్యంగా ఈ జమిందారీ వంశాన్నే అంటిపెట్టుకుని ఎంతో నమ్మకంగా, నమ్మిన బంటుల్లా వుంటూ వచ్చారు.

సోములు, రామదాసు కలిసి డిక్కీలోని సామాను లోపలికి చేరవెయ్యసాగారు.

డిక్కీలు ఖాళీ అయ్యాక డ్రైవర్ మూడు కారుల్ని గేరేజ్‌లో పెట్టి తాళం వేశాడు.

బయటి నుంచి భవనం చాలా అందంగా, విశాలంగా కనిపిస్తోంది. పురాతన జమిందారీ వైభవాన్ని చాటి చెబుతున్నట్టుగా, అలనాటి శిల్పుల చాతుర్యానికి గుర్తుగా ఆ భవనం చాలా అందంగా వుంది. చాలా పెద్ద భవంతి అని బయటి నుంచి చూసిన ఎవరైనా చెప్పవచ్చు. కాక పోతే అక్కడక్కడ రంగులు పోయి పెచ్చులు వూడిపోయాయి.

సింహద్వారం కూడా దానికి తగ్గట్టుగా వుంది.

అంతా హాలులోకిప్రవేశించారు. చాలా పెద్ద హాలు అది. ఇరువైపులా గదులు వున్నాయి. హాలు మధ్య సోఫాలు, కుషన్ చైర్స్ పొందికగా వేసి వున్నాయి. ఒక పక్కగా రెండు రౌండ్ టేబుల్స్, వాటి చుట్టూ చైర్స్ వున్నాయి.

అందమైన ఆ హాలుకి మరింత అందాన్ని చేకూర్చిన షాండ్లియార్స్ సీలింగ్ నుంచి వ్రేలాడుతున్నాయి.

హాలు ఎదురుగ్గా రెండు వైపులా దండీలతో..వంపులు తిరిగిన దండీలతో విశాలమైన మేడమెట్లు...

మేడపైన పెద్ద వరండా అర్థచంద్రకారంలో వుంది. వరండా వెనుక విశాలమైన గదులు వున్నాయి.

ఎవరికి వారే రూములు నిర్ణయించుకున్నారు. మేడమీద ఒక రూములో అంజన్, మదన్, మరో రూములో కోటిలింగం, ఆ పక్క రూంలో లలిత; ఆ పక్కన పేరమాంబ, జలజ వుండటానికి నిర్ణయించుకున్నారు.

మేడ కింద రూముల్లో- ఒక రూంలో కిశోర్, రవి; మరో దాంట్లో గిరిధర్, మీనాక్షి, ఆ పక్కన శంకర్, ప్రీతి, వేరే రూంలో పనిమనిషి మంగతాయారు వుంటామన్నారు.

ఇంకా కొన్ని రూములు ఖాళీగానే మిగిలిపోయాయి.

ఎవరి రూముల్లో వారు పెట్టేబేడా వుంచుకున్నారు.

సరిగ్గా అప్పుడు సమయం మధ్యాహ్నం ఒంటిగంట...

వంటవాడు సోములు ఈ లోపులో అందరికీ భోజనాలు సిద్ధం చేశాడు. అంతా భోజనాలు ముగించి, ప్రయాణ బడలిక వల్ల నిద్రకు ఉపక్రమించారు.

* * *

సోముల్ని విడిగా బయట కలుసుకున్నాడు అంజన్. మాటల సందర్భంలో యధాలాపంగా అడిగినట్టు అడిగాడు, లలిత తల్లిదండ్రుల అదృశ్యం గురించి.

సోములు చెప్పసాగాడు. ''అమ్మగారు, అయ్యగారు ఇక్కడ నాలుగు రోజుల పాటు విశ్రాంతి తీసుకోడానికి వచ్చారయ్యా.. ఒకరోజు రాత్రి అకస్మాత్తుగా మాయం అయినారు. మర్నాడు ఉదయం, నేను అయ్యగారి గదికి వెళ్లి చూస్తిని గదా! ఆ గది ఖాళీగా వుందాయె... నాకేం బోధపడక ఈ విషయం మా అయ్యతో సెప్పినాను, వెంటనే అయ్య నన్ను మదరాసు పంపినాడు. అక్కడ గిరిధర్ అయ్యగారికి, శంకర్ బాబు గారికి, అందరికీ సెప్పినాను. నాకు తెలిసింది అంతే బాబూ...''

''అసలు మద్రాసుకు ఇంత దూరంలో, నిర్మానుష్యమైన ఈ ప్రాంతంలో ఈ గాలి బంగ్లా ఎందుకు నిర్మించారు?'' ప్రశ్నించాడు అంజన్.

''దానికి చాలా పెద్ద చరిత్ర వుంది బాబూ...''

''చరిత్రలు వినడమంటే నాకు చాలా ఇష్టం, చెప్పు..''

“దాని గురించి నాకు పెద్దగా తెలియదయ్యా.. మా అయ్యను పట్టుకుంటే మీకు ఇవరంగా చెప్తాడు”

అక్కడి నుంచి కదలబోయాడు అంజన్

“బాబూ..ఒక్క మాట.. మా అయ్యకు మాంచి సీమసరుకు కొట్టించారంటే మీకు పూర్తి ఇవరాలు చెప్పేత్తాడు” సలహా ఇచ్చాడు సోములు.

తల వూపి ముందుకు కదిలాడు అంజన్.

కోటిలింగం, శంకర్, కిశోర్‌లు మత్తుపానీయాలు సేవిస్తారని అతనికి తెలుసు.

కోటిలింగాన్ని రిక్వెస్టు చేసి అతి కష్టం మీద స్కాచ్ విస్కీ బాటిల్ ఒకటి సంపాదించ గలిగాడు అంజన్.

* * *

హాల్లో ఒక రౌండ్ టేబుల్ చుట్టూ కూర్చున్నారు కోటిలింగం, శంకర్, కిశోర్, రవి, మదన్‌లు.

పేకముక్కలు.. రెండు సెట్లు హుషారుగా కలుపుతున్నాడు కోటిలింగం.

సోఫాలో కూర్చుని ఏదో మేగజైన్ తిరగేస్తున్నాడు గిరిధర్.

ఆడవాళ్లు ఇంకా నిద్ర లేచినట్లు లేదు.

సమయం సాయంత్రం 4 గంటలు అయింది.

తోపులోని చెట్ల గాలులు సింహద్వారం గుండా చల్లగా వీస్తున్నాయి.

కోటిలింగం కత్తిరి వేస్తూ అన్నాడు. “రావోయి గిరి.. రారా.. జోరుగా, హుషారుగా; పేకాట ఆడుకుందాం.”

ఇబ్బందిగానే పైకి లేచి తను కూడా మరో సీటును ఆక్రమించాడు గిరిధర్.

పేకముక్కల్ని బాగా కలిపి గిరిధర్ వైపు చెయ్యి చాపాడు. సగం ముక్కలు తీసి పక్కన పెట్టాడతను. మిగిలిన సగం ముక్కలను అందరికీ పంచాడు. చాలక పక్కనున్న ముక్కల్లో మరికొన్ని పంచాడు.

“సీక్వెన్సా” అడిగాడు శంకర్.

“అవును” కోటిలింగం జవాబు.

ఆరుగురూ పదమూడు ముక్కల చొప్పున పైకి ఎత్తుకున్నారు.

ఎవరికి వారే వాళ్ల తెలివిని ఉపయోగిస్తూ ముక్కలను ఎత్తుకుంటూ, అనవసరమైన ముక్కలను పారేస్తూ; సీక్వెన్స్‌లు, ఢంకాలు అమర్చసాగారు.

''రవీ.. నీ దగ్గర కళావర్ రెండు, ఆటీన్ ఏడు, డైమన్ తొమ్మిది వున్నాయి కదూ!''

''ఇదుగో బాబాయ్... నీ ఎత్తులు నాకు తెలియవనుకున్నావా! నా దగ్గర ఏ ముక్కలుంటే నీ కెందుకు.. నువ్వు మాట్లాడకుండా ఆడు'' అన్నాడు రవి.

''సర్లే... మాట్లాడనుగాని, నేను చెప్పిన ముక్కల్లో ఏదో ఒకటి పారేయ్''

నిజంగానే రవి దగ్గర ఆటిన్ ఏడు, డైమన్ తొమ్మిది వున్నాయి. కళావర్ రెండు లేదు. కోటిలింగంకి అవసరమైన ఆ రెండు ముక్కలు తొక్కిపెట్టేద్దామన్న ఉద్దేశంతో వాటిని కింద పారేయకుండా; వేరే ముక్కులు లేక, తనకు అవసరమైన కళావర్ అయిదును కింద పారేసాడు రవి.

వెంటనే దాన్ని ఎత్తుకున్నాడు కోటిలింగం.

అతనికి కావలసింది కూడా అదే. తెలివిగా రవి నుంచి రాబట్టాడు దాన్ని. చిన్నచిన్న సర్దుబాట్లు చేసి ''షో..''సంతోషంగా అరిచాడు.

''నేనొప్పుకోను.. ఒప్పుకోను... మీరన్నీ మాయచేసి ఆడేస్తున్నారు'' అన్నాడు.

''తర్వాత ఒప్పుకోవద్దులే.. ముందు నీ పోకులు కౌంట్ చెయ్యి'' నవ్వుతూ చెప్పాడు కోటిలింగం.

ఒక్క షోకి అందరి దగ్గరి నుంచీ రెండు వందల యాభై రూపాయలు లాక్కున్నాడు అతను. ఆ హుషారులో పనిమనిషి మంగతాయారును కేక వేసాడు.

''ఏంటి బాబూ...'' అడిగింది పాతికేళ్ల మంగతాయారు. మంచి యవ్వన దశలో పిటపిటలాడుతూ వుందామె. ఆమె అవయవ సౌష్టవాన్ని చూసిన ముసలివాడికైనా కోరిక కలగక మానదు.

ఆమెను అదోరకంగా చూసి తమాయించుకున్నాడు కోటిలింగం. ''మా అందరికీ డబుల్ స్ట్రాంగ్ టీ తీసుకురా..' చెప్పాడు.

మంగతాయారు వంట గదిలోకి వెళ్లిపోయింది.

నెక్స్ట్ రెండు షోలు రవి, శంకర్ కొట్టేసారు.

''ఆగండోయ్... కుర్రకుంకలు.. కంగారు పడకండి. టీ తాగి నా సత్తా ఏమిటో చూపిస్తాను'' అంటున్నాడు కోటిలింగం.

మంగతాయారు టీలు ట్రేతో తెచ్చింది. ఆరుగురూ కప్పులు అందుకుని టీ సిప్ చెయ్యసాగారు.

ట్రేతో ఆమె వెళ్లిపోతుంటే పొడవైన ఆమె జడ పిరుదులపై వయ్యారంగా

కదులుతూ, రవి, కిశోర్, కోటిలింగాల గుండెల్లో గుబులును పుట్టించసాగింది. వాళ్లు అతి కష్టం మీద చూపులు మరల్చుకున్నారు.

టీలు త్రాగడం పూర్తి చేసి సిగరెట్లు ముట్టించారు రవి, కిశోర్, శంకర్, మదన్‌లు.

మరో రెండు షోలు గిరిధర్, ఒక షో కోటిలింగం కొట్టారు.

మరో రెండు టీలు తెప్పించుకుని తాగి చీకటిపడే వరకూ ఆడుకుంటూనే వున్నారు.

# 5

గాలిబంగ్లా వెనుకనున్న చిన్న గుడిసెలో కల్లుకుండ దగ్గర పెట్టుకుని ఒక్కో గ్లాసు ముంచుకుని తాగేస్తున్నాడు రామదాసు.

పాకలో అడుగుపెట్టాడు అంజన్.

నిషా తలకెక్కినట్లుంది- కనురెప్పలు బలవంతంగా తెరుస్తూ గమ్మంలోకి చూశాడు. అంజన్‌ను చూసి అతని మాటలు తడబడ్డాయి.

''అయ్యో.. బాబూ మీ..రా.. కబురంపితే నే..నే వద్దు..ను కదా!''

''నీకోసం సీమ సరుకు తెచ్చాను'' స్కాచ్ విస్కీ బాటిల్‌ని అతనికి అందించాడు.

''సానా.. సంతోషం బాబు.. ఇది తాగి..సానా..కానం..అయిపోయినాది'' మూత విప్పబోయాడు.

''ఆగు.. ముందు నా ప్రశ్నలకి జవాబులు చెప్పి, అప్పుడు అది తాగు'' అంటూ మజ్జిగ కుండ అందించాడు.

''ఇదెందుకు..బాబూ..''

''మత్తు దిగడానికి..''

''మత్తు దిగిపోతే.. ఎలాగ?''

''దిగకపోతే నా ప్రశ్నలకు జవాబులు చెప్పలేవు. చెప్పకపోతే ఇది నీకివ్వను'' అతని చేతిలోంచి విస్కీ బాటిల్ లాగేసుకున్నాడు.

''అంత.. కోపం అయితే.. ఎలా? క్షణం.. ఆగు.. జవాబు చెప్తా'' అంటూ మజ్జిగ గటగటా తాగేశాడు రామదాసు.

పది నిముషాల తర్వాత అతని మత్తు పూర్తిగా దిగిపోయింది. విస్కీబాటిల్ వంక ఆశగా చూస్తూ ''ఇప్పుడు నీకు కావలసిన యిషయాలు అడుగు బాబూ..జవాబిత్తాను''

సోముల్ని అడిగిన ప్రశ్నే రామదాసును అడిగాడు అంజన్.

"పట్టణానికి దూరమైనా, జనాలులేని పెదేశమైనా యిక్కడి గాలి, వాతావరణం బాగుంటాయి కదయ్యా... ఇక్కడున్న పెసాంతత పట్టణాల్లో ఎలా వత్తాదంట. అందుకే యిశ్రాంతి కోసమని ఈ బంగళా ఇక్కడ పెత్తేకంగా కట్టించారు మా పెద్ద అయ్యగోరు రావుబహుద్దూర్ విశ్వేశ్వరవర్మ పెభువులు..." చెప్పాడు రామదాసు.

"ఆయన పోయి ఎంతకాలమైంది?"

కొన్ని క్షణాలు గుణించుకున్నాడు "ఇరవై ఒక్క సంవత్సరం అయింది"

"ఆయన ఎలాంటివారు?"

"ధర్మ పెభువులు.. ఆయనగోరు చేసిన దానధర్మాలకు అంతులేదంటే నమ్మండి"

"నీ కొడుకుని అడిగితే ఈ బంగ్లాకి చాలా చరిత్ర వుందంటున్నాడు" ఆగాడు అంజన్.

"అదేం అడుగుతావులే బాబూ... ఆ బాధాకరమైన చరిత్ర నీకు తెలియకపోవడమే మంచిది"

"నాకు తెలుసుకోవాలని వుంది. నీకు అభ్యంతరం లేకపోతే చెప్పు"

"అది యిప్పటి మాట కాదు. రావుబహుద్దూర్ విశ్వేశ్వరవర్మ గారి తండ్రిగారైన రావుబహుద్దూర్ ధర్మదేవ వర్మగారి హయాం నాటి మాట.. ధర్మదేవ వర్మగారికి ఒక చెల్లెలు వుండేది. ఆమె పేరు అరుంధతి. ఆమె ఒక కులం తక్కువ యువకుణ్ణి ప్రేమించింది. చాలాకాలం పాటు ఈ విషయం ఎవ్వరికీ తెలియలేదు. చివరికి ధర్మదేవ వర్మగారి కంటపడిందా జంట ఒకానొక రోజు.

ఆయన చెల్లెల్ని నిలదీసి అడిగారు. అతన్ని తను ప్రేమిస్తున్నానని చెప్పిందామె. కోపోద్రిక్తులైన ధర్మదేవవర్మ అది కుదరదన్నారు. స్వతాహాగా అన్నంటే అరుంధతికి భయం మెండు. ఒకానోక రోజున ధైర్యం చేసి అన్నకు చెప్పకుండా, ఎవరికీ తెలియకుండా ఆ యువకుడితో లేచిపోయింది. అది తెలిసిన ధర్మదేవవర్మ అగ్గిమీద గుగ్గిలం అయ్యారు.

ఎక్కడున్నా ఆ యువకుణ్ణి చంపి, చెల్లెల్ని తీసుకురమ్మని కొంతమంది వ్యక్తుల్ని నియోగించారు. ఆ ప్రకారమే ఎలాగైతే ఆ వ్యక్తులు ఆ యువకుణ్ణి చంపి, అరుంధతిని ఆయన వద్దకు తీసుకువచ్చారు.

ఆమె అన్నను దుర్భాషలాడి ఆయన ఎదురుగానే కత్తితో పొడుచుకుని ఆత్మత్యాగం చేసింది. కొడుకు, కోడలి చావులు కళ్లారా చూసిన పండు ముదుసలి అప్పుడు అక్కడే వుంది. ధర్మదేవ వర్మగారిని, ఆయన వంశాన్ని శపించింది. కోపం పట్టలేని ఆయన ఖడ్గంతో ఆ ముదుసలి కంఠం తెగనరికారు.

అప్పుడు విశ్వేశ్వరవర్మగారి వయస్సు పది సంవత్సరాలు.. మరో ఐదు

సంవత్సరాలకు ధర్మదేవ వర్మగారు చనిపోయారు. తల్లి పెంపకంలో మరో పది సంవత్సరాలు పెరిగి పెద్దవారు అయ్యారు విశ్వేశ్వరవర్మ గారు. తల్లి కూడా చనిపోయింది.

మరో మూడేళ్లకు ఆయన పెళ్లి చేసుకున్నారు. సంవత్సరం తిరక్కముందే విశ్వేశ్వరవర్మ గారి దంపతులకు గిరధర్‌బాబుగారు జన్మించారు. మరో సంవత్సరం ఏ బాధా లేకుండా గడిచిపోయింది.

ధర్మదేవ వర్మగారి చేతుల్లో చనిపోయిన ముదుసలి శాప ఫలమో లేక విధి ఆడిస్తున్న నాటకమో తెలియదు గాని విశ్వేశ్వర వర్మగారికి 30 ఏళ్ల వయస్సులో భయంకరమైన వ్యాధి సోకింది. అదే..కుష్టు వ్యాధి.

నిజంగా అది నరకప్రాయం.. అటువంటి వ్యాధి పగవారికి కూడా రాకూడదు.

విశ్వేశ్వరవర్మ గారు పాతికేళ్ల ప్రాయంలో నిర్మించిన ఈ గాలిబంగ్లా ఆయనకే పనికివచ్చింది. చాలా ఉదారస్వభావులు, ధర్మదేవతలు అయిన ఆ మహానుభావులు తన జబ్బు ఎవరికీ అంటకూడదనే సదుద్దేశంతో ఈ గాలిబంగ్లా తన నివాసంగా ఏర్పరు చుకుని ఇక్కడే వుండేవారు. ఆయన ఒక సంవత్సరం పాటు తోటలో స్వేచ్ఛగా తిరిగేవారు. ఆ తర్వాత ఆయన స్వేచ్ఛ నశించిపోయింది.

వ్యాధి మరికాస్త పెరిగినందు వల్ల, బయట తిరగకూడదని డాక్టర్లు శాసించడం వల్ల ఆ ధర్మమూర్తికి ఈ గాలిబంగ్లాయే చెరశాల అయింది. యుద్ధ ఖైదీని బంధించినట్టు ఆయన్ని లోపల పెట్టి తాళాలు వేసేవారు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేని ఖైదీ బ్రతుకు బ్రతకవలసి వచ్చింది.

భోజన సమయం వచ్చినప్పుడు ఖైదీలను బయటికి విడుస్తారు. ఆయనకు ఆ వీలు కూడా లేదు.భోజనం, మంచినీళ్లు, కిటికీలోంచి లోపలికి అందించేవాళ్లం. అటువంటి నికృష్ట బ్రతుకు బ్రతికారా ప్రేమమూర్తి'' రాందాసు కళ్లవెంట ధారాపాతంగా కన్నీళ్లు కారిపోతున్నాయి. అతని గొంతు పూడుకుపోయింది.

కొన్ని క్షణాలు మౌనంగా వుండి తిరిగి చెప్పసాగాడు ''వంటినిండా కురుపులతో, చీమూ నెత్తురు కారుతూ పాకుడుపట్టి ఎండిపోయి, చూడటానికి చాలా అసహ్యంగా తయారయింది ఆయన దేహం. వంటిమీద బట్టలు కూడా కట్టుకోకుండా గోచీ మాత్రమే ధరించేవారు. గజ్జి కురుపులు, రసిలు కారుతూ భయంకరంగా రాకాసి పుళ్లులా తయారయ్యాయి. దురద పుట్టినా గోక్కునే వీలు లేక నేలమీద పడి ఏడ్చేవారు. దొర్లే వీలు కూడా లేదు. ఒక్కో సమయంలో కేకలు, పెడబొబ్బలు పెట్టేసేవారు.

కొంచెం సేపు నవ్వేవారు. మరికొంత సేపు ఏడ్చేవారు. కొంతసేపు ఏదో తనలో తనే

గొణుక్కునేవారు. పిచ్చిచూపులు చూసేవారు. ఆయన స్థితి చూసిన నాకు అన్నం సహించేది కాదు. ఆయన బాధను తీర్చమని భగవంతుడ్ని ప్రార్థించేవాణ్ణి.

ఒక్కో సమయంలో తనను తానే నిందించుకోవడం చూసి నాకు ఏడుపు వచ్చేది. కాని అశక్తుణ్ణి. ఆయన బాధను ఏమని అర్థం చేసుకోగలను. ఎలా తీర్చగలను. తైల సంస్కారం లేని జుట్టుతో, పొట్టులా రాలిపోతూ చెదపురుగులు తినేసినట్టు అట్టల్లా కట్టేసి, చిదికిపోయిన పుళ్లతో ఆయనను చూసేసరికి నేనే గుర్తుపట్టలేకపోయాను. అంత హీనస్థితికి జారిపోయారు.

గుడ్డిలో మెల్ల అన్నట్టు నాకో ఆలోచన వచ్చింది. ఆ ప్రకారమే హాలులో బండెడు బూడిదను పోయించాను. దురద పెడుతున్న రసి కురుపులను చేతులతో గోక్కోలేని ఆయనకు ఆ 'బూడిద' ఎంతో విలువైనదిగా తోచింది.

దురద పెడుతున్న సమయంలో ఆయన బూడిదలో దొర్లేవారు. మెత్తటి బూడిదపై దొర్లడం వల్ల దురద కొంతవరకు తగ్గి ఆయనకు ఉపశమనం కలిగించేది. కాని, బాధ మాత్రం పూర్తిగా తగ్గేది కాదు.

అది నిజంగా నరకం. భయానకం.. ఎంత ఘోరమంటే.. ఒకరోజు నన్ను కిటికీ అవతలి నుంచి బ్రతిమలాడుతూ తనకో సహాయం చెయ్యమన్నారు. అర్థించవద్దు. ఆజ్ఞాపించమన్నాను. దయవుంచి ఏ ఆయుధంతోనైనా తనను చంపమన్నారు. నేను నిశ్చేష్టుడ్ని అయిపోయాను. ఆయన వద్దనే బాధతీరేలా ఏడ్చాను. అటువంటి కోరిక ఎన్నడూ కోరవద్దని బ్రతిమలాడాను. లేకపోతే నేనే ఆత్మహత్య చేసకుంటానని బెదిరించాను. ఆ రోజంతా ఒకరిని చూసి మరొకరం ఏడుస్తూనే వున్నాం'' చెప్పటం ఆపి వెక్కి, వెక్కి ఏడ్వసాగాడు రామదాసు.

గత చరిత్ర వింటుంటే అంజన్ మనసు కూడా వికలమైంది. రామదాసుకి విశ్వేశ్వరవర్మగారి పైన వున్న స్వామి భక్తికి కూడా ఆశ్చర్యపోకుండా వుండలేకపోయాడు. ఆయన గురించి ప్రాణాలు అర్పించడానికి కూడా వెనుకాడని రామదాసు అతని కంటికి మేరుపర్వతంలా కనిపించాడు.

కళ్లు తుడుచుకుని చెప్పసాగాడు రామదాసు ''విశ్వేశ్వరవర్మ గారికి కుష్టువ్యాధి రాకముందు గిరిధర్ బాబు ఆయన చేతుల్లోనే సంవత్సరం పాటు పెరిగాడు. చిన్న బాబుగారికి పన్నెండు నెలలు నిండేవరకు ఆ దంపతులు ఎంతో ఇష్టంగా కిందకు కూడా దింపకుండా ఎత్తుకుని పెంచారు.

ఊహ తెలియని వయస్సులోనే గిరిధర్‌బాబు తండ్రి దగ్గర అలవాటు పడ్డారు.

ఆయనకి కుష్టు వ్యాధి సోకిన దగ్గర నుంచి తల్లే చిన్నబాబు బరువు బాధ్యతలు తీసుకుంది. ప్రతినెలా చిన్నబాబుని ఇక్కడికి తీసుకువచ్చి ఆ తల్లి ఆయన్ను చూసి ఏడ్చేది. గిరిధర్‌బాబుకి ఊహ తెలిసిన దగ్గర నుండి తండ్రి దగ్గరకు తీసుకువెళ్లమని మారాం చేసేవాడు. ఆ తల్లి జానకీదేవి ప్రతినెలా చిన్నబాబుకి తండ్రిని చూపించేది. మూడేళ్ల వయస్సు నుంచే చిన్నబాబు చాలా తెలివైనవాడుగా ఎదిగాడు.

తండ్రి దుస్థితిని, ఆయన అనుభవిస్తున్న బాధను మూడేళ్లూ కళ్లారా చూశాడు.

తల్లిదండ్రుల మీద అపారమైన ప్రేమను పెంచుకున్నాడు.

ముప్పై అయిదు సంవత్సరాలు నిండేసరికి విశ్వేశ్వరవర్మగారు ఒకరోజు హఠాత్తుగా మరణించారు. తండ్రి శవాన్ని చితిపై చూసిన గిరిధర్ బాబు హృదయ విదారకంగా ఏడిచాడు. కాని ప్రయోజనం ఏముంది? తండ్రి పోయిన బాధతో నెలరోజులు జ్వరంతో మంచం దిగలేదు ఆ బాబు. ఆ తర్వాత తేరుకున్నాడు. అతనికి తల్లే సర్వస్వం అయింది. కాని దురదృష్టం అతన్ని వీడలేదు. మరో అర్థ సంవత్సరం తిరక్కుండానే భర్త పోయిన బెంగతో ఆమె చనిపోయింది.

ఆ తర్వాత రంగనాథవర్మగారి చేతుల్లో పెరిగాడా బాబు... ఇన్ని బాధలూ చవిచూసిన గిరిధర్ బాబుకి జీవితమంటే తెలుసు. విశ్వేశ్వరవర్మగారి ఉదారత్వము, ఎంతో ప్రేమ, ఆప్యాయతలు కలబోసుకున్న ఆ బాబు సాక్షాత్తూ విశ్వేశ్వరవర్మగారి రూపాన్ని పుణికి పుచ్చుకున్నాడు. దయాగుణం, జాలి, కనికరం పెంచుకున్నాడు.

''ఈ బాధలన్నీ చూసిన నేను విశ్వేశ్వరవర్మగారు పోయిన తర్వాత తాగుడికి బానిసనయ్యాను. గిరిధర్‌బాబులో మా పెద్దయ్యగార్ని చూసుకుని కట్టెలా ఇలా బ్రతుకుతున్నాను. ఈ గాలిబంగ్లా చరిత్ర శాశ్వతంగా ఇక్కడే మరుగున పడిపోయింది బాబూ...'' కళ్లు తుడుచుకుంటూ చెప్పడం ముగించాడు.

''విశ్వేశ్వర వర్మగారికి కుష్టువ్యాధి సోకిన దగ్గర నుంచి ఎస్టేట్ వ్యవహారాలు ఎవరు చూసుకునేవారు?'' ప్రశ్నించాడు అంజన్.

''అప్పటినుంచి రంగనాథవర్మగారే ఆ వ్యవహారాలన్నీ చూస్తూ చక్కదిద్దేవారు'' చెప్పాడు రామదాసు.

''చాలా సంతోషం. నువ్వు చెప్పిందంతా బాగానే వుంది. కాని నువ్వు చేసే పనే బాగోలేదు''

''ఏంటి బాబూ అది?''

''మత్తు పదార్థాలు విపరీతంగా తాగడం''

"ఏం చెయ్యమంటారు బాబూ.. పగలంతా తోటపనితో తీరిక లేకుండా వుండటం వల్ల ఏ బాధా తెలియటం లేదు. రాత్రి అయ్యేసరికి గత స్మృతులు జ్ఞాపకం వచ్చి నన్ను వేధించుకుని తినేస్తున్నాయి. అందువల్ల ఈ తాగుడు నాకు తప్పటం లేదు బాబూ.

ఈ తోపులోనే తాటి, ఈత చెట్లకు కుండలు ఏర్పాటు చేసి- ఆ కల్లు తాగుతున్నాను. సీమ సరుకైతే తక్కువ తాగినా మాంచి మత్తులోకి జారిపోవచ్చు. అందుకే సీమ సరుకంటే నాకు ఇష్టం బాబూ..." అంటూ అతని జవాబు కోసమైనా ఎదురుచూడకుండా అంజన్ చేతిలోని బాటిల్ లాక్కుని ఓపెన్ చేసి, దాన్ని అలాగే ఎత్తిపట్టుకుని గటగటా తాగేయసాగాడు రామదాసు.

చిన్నగా నిట్టూర్చి బయటికి నడిచాడు అంజన్.

* * *

వేడినీళ్లతో వున్న బకెట్‌ను గట్టుమీద పెట్టి, వేసుకునే బట్టలు దండెం మీద వేసింది పేరమాంబ. బట్టలు విప్పుకోబోతూ ఆగిపోయింది. తన మతిమరుపుకు తనను తానే నిందించుకుంది. సబ్బు లేకుండా స్నానం ఎలా చేస్తుంది మరి...! బకెట్ మీద చెక్క మూత పెట్టింది నీళ్లు చల్లారిపోకుండా.

గొళ్లెం తీసి మేడమీద తన గదిలోకి వెళ్లి సబ్బు తెచ్చుకుని బాత్రూం గొళ్లెం పెట్టుకుంది.

బట్టలు విప్పి దండెం మీద వేసి నగ్నంగా నిలుచుంది. తన నగ్నదేహం ఒకమారు చూసుకుని తనలో తానే మురిసిపోయింది. ఆమె పెద్ద అందగత్తె కాదు. అలాగని అనాకారి మాత్రం కాదు. ప్రేమించడానికి, ప్రేమించబడటానికి అర్హత వున్న అందం ఆమెది.

చిన్న ముక్కాలిపీటపై నగ్నంగా కూర్చుంది.

ఆ భవనం పట్టణానికి చాలా దూరంలో వుండటం వల్ల, చుట్టుపక్కల ఎటువంటి నివాసాలు లేనందు వల్ల పైపుద్వారా మంచినీరు వచ్చే వీలు లేదు. బోరింగ్ నీరు, నూతినీరే అక్కడ దొరుకుతుంది.

అలాగే విద్యుత్ సౌకర్యం కూడా లేదు. అందువల్ల డీసెల్ ఆయిల్‌తో పనిచేసే జనరేటర్ ద్వారా ఆ గాలిబంగ్లాలో విద్యుత్ బల్బులు పనిచేస్తాయి.

తన చేతికందే ఎత్తులో వున్న బకెట్ మీది చెక్కమూతను పక్కన పెట్టేసింది. ఏదో ఆలోచనలో వున్న పేరమాంబ ఏదీ గుర్తించే స్థితిలో లేదు.

జుట్టును వెనక్కి వేసుకుని మగ్గును బకెట్‌లో ముంచి ఆ నీరు నెత్తిమీద దిమ్మరించుకుంది. అలాగే ఆగకుండా ఐదారు చెంబుల వరకు నెత్తిమీద బోర్లించుకుంది.

ఆమె నోటికి నీరు ఉప్పగా తగిలింది. అయినా ఏమీ గమనించే స్థితిలో లేదు.

మరో నాలుగు మగ్గుల నీరు దిమ్మరించుకుని కళ్లు తెరచి చూసింది.

పేరమాంబ ఒళ్లు ఒక్కసారిగా జలదరించింది. ఆమె పూర్తిగా రక్తంతో తడిసి ముద్దయిపోయింది. వంటి నిండా రక్తం... తలనిండా రక్తం... చిక్కటి రక్తాభిషేకం జరిగిన ఆమె నరరూప రాక్షసిలా, ఆదిమ మానవజాతి స్త్రీలా భయం గొలిపేలా వుంది. ఆమె వంటి నిండా రక్తం దట్టంగా పట్టుకుంది.

క్షణంలో తేరుకుని బకెట్‌లో చూసింది. ఆ బకెట్‌లో సగానికి పైగా రక్తం వుంది. అంతే! నోటి దగ్గర చెయ్యి పెట్టుకుని కెవ్వున అరిచింది. అలా అరుస్తూనే వుంది పేరమాంబ.

* * *

హాల్లో ఉన్న సోఫాల్లో కూర్చున్నారంతా. పేరమాంబ ఒక్కతే అక్కడ లేదు.

''సోమూ...' గట్టిగా పిలిచాడు గిరిధర్.

వెంటనే అక్కడికి వచ్చాడు సోములు ''ఏంటి చినబాబూ...''అంటూ.

''భోజనాలు సిద్ధమేనా?''

''నాపని పూర్తి చేసాను. ఆఖరి దశలో వుంది బాబూ... మిగిలిన పని క్షణంలో పూర్తి చేస్తుంది మంగతాయారు''

''త్వరగా కానిమ్మను. మాకు ఆకలి దంచేస్తోంది'' అన్నాడు మదన్.

సోములు వెళ్లబోయాడు.

''మంగతాయారు చేస్తుందిగాని నువ్విలా కూర్చో. నిన్నో విషయం అడగాలి'' అన్నాడు కోటిలింగం.

''ఏంటి బాబూ అది'' ఆగాడు సోములు.

''ఇక్కడ రాత్రప్పుడు ఏదో దెయ్యం తిరుగుతూందని విన్నాను. అది నిజమేనా?''

''నిజమే బాబూ... మీరు వింటానంటే చెబుతాను''

''క్లుప్తంగా చెప్పు విందాం''

''మా అయ్యకు తోడబుట్టిన చెల్లెలికి ఒక కూతురు వుంది బాబూ, దాని పేరు రత్తాలు. దాన్ని నాకిచ్చి పెళ్లి చెయ్యాలని మా అయ్యకు కోరికగా వుండేది. కాని అది పట్టనంలో ఎవడిచేతో మోసగింపబడి, వాడు దుర్మార్గుడని తెలుసుకుని మా పంచకు చేరింది. అయినా నేను దాన్ని పెళ్లి చేసుకుందామనుకున్నాను''

''ఒక రోజు ఆ దుర్మార్గుడు వచ్చి రత్తిని తనతో వచ్చేయమని బలవంతం చేసాడు. కాని తాను రానంది. మా రత్తి సానా అందగత్తె. తనతో నీచమైన వ్యాపారం చేయించడానికే

వాడు రమ్మంటున్నాడని గ్రహించింది. రాను పొమ్మంది. ఆ నీచుడు కోపం పట్టలేక రత్తిని పీక నొక్కి చంపేసాడు''

''అప్పుడే అక్కడకొచ్చిన మా అయ్య సూరులో కత్తి తీసుకుని ఆవేశంతో ఆ నీచుణ్ని పొడిచేసాడు. వాడు గిలగిలా కొట్టుకుని చచ్చాడు. రత్తిని దహనం చేసేసాం. వాణ్ణి ఇక్కడే.. ఈ తోటలోనే.. మన బంగ్లా పక్కనే ఒకచోట పాతిపెట్టేసాం. ఇది నాలుగు సంవత్సరాల క్రితం నాటి మాట.

అప్పటి నుంచి శారీరకంగా చనిపోయి, ఆత్మలా... దెయ్యంలా మిగిలిపోయిన రత్తి నవ్వుతూ, ఏడుస్తూ ఈ బంగ్లాలోనూ, తోటలోనూ తిరుగుతుంది. ముఖ్యంగా ఆ నీచుణ్ణి పాతిపెట్టిన చోట నడుస్తున్నప్పుడు విరగబడి నవ్వుతుంది. ఇదే బాబూ దాని కథ'' తువాలుతో కళ్లు ఒత్తుకున్నాడు సోములు.

''సోము... నీకు చాలాసార్లు చెప్పాను రత్తి కథ చెప్పినప్పుడల్లా ఎందుకలా ఏడుస్తావ్? ఊరుకో... ఇక ఆ విషయం వదిలేసి వెళ్లి పనిచేసుకో'' అన్నాడు గిరిధర్ ఆదరంగా.

అక్కడి నుంచి లేచి వెళ్లిపోయాడు సోములు.

మదన్ ఏదో అడగబోయాడు.

అదే క్షణంలో కెవ్వుమని కేక విన్పించింది. అది పేరమాంబ కేక. మరుక్షణం అదే పనిగా ఆమె అరుపులు వినిపిస్తూనే ఉన్నాయి. అంతా ఒకేసారి అదిరిపోయారు. వెంటనే బాత్రూం వైపు పరుగుతీశారు.

గిరిధర్ దబదబమని తలుపుబాదాడు.

''పేరమాంబా... తలుపు తెరు'' రెండుసార్లు గట్టిగా అరిచాడు.

అప్పుడే తేరుకున్న పేరమాంబ గబగబా వంటికి మాసిన చీర చుట్టబెట్టుకుంది వణుకుతున్న చేతులతో.

ఆ వెంటనే గొళ్లెం తీసింది.

అంతా ఒకేసారి బాత్రూంలోకి ప్రవేశించారు.

కంగారుగా ప్రశ్నించాడు గిరిధర్ ''ఏమైంది? ఒళ్లంతా ఈ రక్తమేంటి?''

''స్నానం చేద్దామని వేడి నీళ్లు పెట్టుకున్నాను. తలమీద పోసుకునేసరికి నీళ్లు రక్తంగా మారిపోయాయి.''

ఆ మాట విని అంతా తృళ్లిపడ్డారు.

''నీరు రక్తంగా మారడమేంటి?'' విచిత్రంగా అడిగాడు కిశోర్.

‘‘కళ్లెదురుగా కనిపించడం లేదూ! ఏమిటా పిచ్చిప్రశ్న’’ అడ్డుకున్నాడు రవి.

వాళ్లందర్నీ చూసేసరికి ఆమె కంగారు తగ్గింది.

గిరిధర్ బకెట్‌లోకి చూశాడు. దానిలో సగానికి పైగా రక్తం వుంది.

‘‘మీరు చూస్తుండగానే నీరు రక్తంగా మారిపోయిందా?’’ రక్తాన్ని చేత్తో తడిమి పరీక్షిస్తూ ప్రశ్నించాడు అంజన్.

‘‘లేదు.. నేను నీళ్లు తలమీద గుమ్మరించుకునేసరికి రక్తంగా మారింది’’

‘‘నీళ్లు ముంచుకునేటప్పుడు వేడిగానే వున్నాయా?’’

‘‘నేను గమనించలేదు.’’

జరిగినదంతా చెప్పమన్నాడు అంజన్. సవివరంగా చెప్పింది.

మదన్‌కి సైగ చేశాడతను. మదన్ ఏదో పనివున్నట్టు మెల్లగా బయటికి జారుకున్నాడు.

‘‘అనుమానం లేదు. ఇదెవరో కావాలని చేసిన పని’’ అన్నాడు అంజన్.

‘‘ఇటువంటి పిచ్చి పనులు మనుషులెవరూ చెయ్యరు. దెయ్యాలు చేశాయేమో!’’ దెయ్యాలమీద పూర్తిగా విశ్వాసమున్న రవి అన్నాడు.

‘‘ఎలా చేసుంటారు?’’ గిరిధర్ ప్రశ్నించాడు.

‘‘పేరమాంబ నీళ్ల బకెట్ యిక్కడ వుంచి సబ్బు కోసం బయటకు వెళ్లింది. ఆ సమయంలోనే ఎవరో ఆ పని చేశారు’’ చెప్పాడు.

‘‘ఎవరు చేస్తారు? ఇటువంటి పని చెయ్యడం వల్ల వాళ్లకు ప్రయోజనం ఏముంది?’’ అడిగాడు కోటిలింగం.

‘‘ఏమో ఆ విషయం నాకెలా తెలుస్తుంది’’ నొసలు విరిచాడు అంజన్.

గిరిధర్ అన్నాడు ‘‘సరే..సరే.. మీ వాదనలు చాలించండి. లలితా! పేరమాంబను మేడమీది బాత్రూంకి తీసుకెళ్లు. నువ్వు దగ్గరుండు, లేకపోతే భయపడుతుంది’’

పేరమాంబను మేడమీద బాత్రూంలోకి తీసుకెళ్లింది లలిత.

అంతా హాల్లోకి వచ్చి కూర్చున్నారు.

బయటికి వెళ్లిన మదన్ వచ్చి, ఎవరూ గమనించకుండా అంజన్ చెవిలో ఏదో చెప్పాడు.

‘‘భోజనాలు యింకా పూర్తి కాలేదా?’’ గట్టిగా అడిగాడు శంకర్.

వంటగదిలోంచి మంగతాయారు కేక వేసింది.

“మరో పది నిముషాలు ఓపిక పట్టండి బాబూ... పూర్తి కావచ్చింది”

సడెన్‌గా మెరుపులు, ఉరుములు లేకుండానే ప్రారంభమైంది జడివాన. కుండ పోతగా కురవసాగింది. మరికొన్ని క్షణాల తర్వాత మేఘాలు ఘర్జించసాగాయి.

చలిగాలులు రివ్వురివ్వుమని వీస్తున్నాయి హాల్లోని కర్టెన్‌లు గాలికి రెపరెప లాడుతున్నాయి. కిటికీలు దబదబమని కొట్టుకోసాగాయి.

మదన్, కిశోర్, రవి కిటికీలన్నీ మూసివేశారు. చలిగా వున్నందువల్ల అంతా దగ్గర దగ్గరగా కూర్చున్నారు.

“బాబాయ్... ఆకలిని మర్చిపోవడానికి పది నిముషాలు ఏవైనా ఊసులు చెప్పండి” కిశోర్ రిక్వెస్ట్ చేసాడు.

గొంతు సవరించుకున్నాడు కోటిలింగం. “ఏం చెప్పను?”

“ఏదో ఒకటి...”

“ఒకటి కాకపోతే రెండు చెబుతాను. ముందు ఆలోచించుకోనివ్వు” క్షణమాలోచించి “ఆ రోజు జరిగిన సంఘటన చెబుతాను” అన్నాడు.

అంతా థ్రిల్లింగ్‌గా అతనివైపు చూశారు. కోటిలింగంకి ఒక ప్రత్యేకత వుంది. తను చెప్పే ఏ విషయమైనా ఎదుటివాడిలో ఆలోచనలు రేకెత్తించే విధంగా చెప్పడం అతని స్పెషాలిటీ. అంది అందరికీ అలవడదు.

కోటిలింగం చెప్పసాగాడు.

ఎక్కడో పిడుగు పడింది.

“ఇది తాతగారు చెప్పిన కథ. ఒకరోజు మా తాత లక్ష్మీపతి ఇంటి వెనుక వాకిట్లో పడుకున్నాడు. వెన్నెల నిండుగానే వుంది. ఆరోజు ఎందుకో ఆయనకు అంత త్వరగా నిద్ర రాలేదంట. ఎంతోసేపు ఏవో ఆలోచనలతో మేలుకునే వున్నారు. అర్ధరాత్రి సమయంలో మగతగా నిద్ర పట్టిందట.

మా ఇంటికి రెండు వందల గజాల దూరంలోనే వుంది స్మశానం. ఎందుకో తెలియదు గాని వులిక్కిపడి మేలుకున్నాడు. తను పీడకల కన్నానని, అది చెదిరిపోయిందని గ్రహించారాయన. ఆంజనేయ దండకం చదువుతూ కళ్లు తెరిచి చూశారు. అప్పుడు కనిపించింది ఆయన కళ్లకు...” ఆపేసి మంచినీళ్లు తాగాడు.

“ఏమిటి?” టెన్షన్‌తో అడిగాడు మదన్.

తిరిగి చెప్పసాగాడు “స్మశానంలోంచి తన వైపుగా వస్తున్న నాలుగు కొరివి దయ్యాల గుంపు...”

మధ్యలో అడ్డుకున్నాడు శంకర్ "నాన్‌సెన్స్... కాలీకాలని ఎముకలు, నక్కలు శవాల్ని తవ్వితీసి మాంసాన్ని వదిలివేసిన ఎముకల్లో భాస్వరం వుంటుంది. గాలికి మండే స్వభావం భాస్వరంకి వుంది. అందువల్ల ఆ మంటే చీకట్లో చిరుదివ్వెలా వుంటుంది. దాన్ని చూసిన గుడ్డి ప్రజలు ఎవరికి వారే ఏదో కల్పించుకుని ఆ మంటకు కొరివిదెయ్యం అనే నామ కరణం చేసి మరీ భయపడుతుంటారు"

"మావయ్య ఏదో సరదాగా చెప్తున్నాడు. అడ్డుగా వాదించక చెప్పనివ్వు అన్నయ్యా" అంది లలిత.

"సరే చెప్పు మావయ్యా! నీ కాకమ్మ కథలు వీళ్లకి సరదాగా వున్నట్టున్నాయి" అయిష్టం నటిస్తూ తర్వాత ఏమౌతుందో అన్నట్టు చూశాడు శంకర్.

"ఇంకెవరూ మాట్లాడకండి.." అని కంటిన్యూ చేశాడు కోటిలింగం. "ఆ నాలుగు కొరివి దెయ్యాలు మా తాత వైపుగా వస్తున్నాయి. ఆయనకు స్వతాహాగా ధైర్యం ఎక్కువ. అయినా కొద్దిగా భయపడి సర్దుకున్నారు. మంచం చుట్టూ చేరాయి కొరివి దెయ్యాలు నాలుగు.

మంచం నాలుగు కోళ్లని నాలుగు దెయ్యాలూ భుజాలమీదకు ఎత్తుకుని ఆకాశం మీదకు ఎగిరాయి. కాదు..గాలిలోకి ఎగిరాయి. మా తాత కదలకుండా, మెదలకుండా ఒంటికన్నుతో వారగా వాటిని చూస్తున్నాడు. కదిలితే కిందపడేస్తాయని ఆయనకు తెలుసు.

అదే సమయంలో ఏదో పురుగు ఆయన పక్కలో కుట్టసాగింది. ఎంత ఓర్చుకుందామన్నా కుదరలేదు. విధి లేక కదిలారు..అంతే..అంత ఎత్తునుంచి ఆయన్ను కిందకు పడేశాయా దెయ్యాలు.

ఆయన తలకు ఏదో తగిలి మూర్ఛపోయారు. తెల్లారి చూస్తే తను మట్టితో చేసిన సమాధిపై పడివున్నట్టు గుర్తించారు. మంచం ఆ పక్కనే వున్న గోతిలో పడి వుందట. ఆ మంచాన్ని చంకన యిరికించుకుని చక్కావచ్చేశాడు. ఆ రాత్రి మట్టిదిబ్బ తలకు తగలడం వల్ల ఏర్పడిన దెబ్బ చాలా రోజులకిగాని తగ్గలేదు"

కిశోర్ అందుకున్నాడు "దెయ్యాల కథలు నేను కూడా చాలా విన్నాను. ఆడ దెయ్యాలు తెల్లచీర, తెల్ల జాకెట్టు కట్టుకుని, తల విరబోసుకుని వెళ్తాయంట. మా బామ్మ చెప్పింది. ఆమెకు రాత్రిపూట వేపచెట్టు మీద ఒక దెయ్యం ప్రతిరోజు కనిపించేదట. అంతేకాదు.. కనకదుర్గమ్మ, మరిడమ్మ... ఇత్యాది దేవతలు కూడా అలాగే కనిపిస్తారట. ఆ సమయంలో వాళ్లకు ఎవరైనా ఎదురుపడితే రక్తం కక్కుకుని చస్తారట"యింకా ఏదో చెప్పబోయాడు.

అదే సమయంలో మేడమీద వరండాలో ఏదో తెల్లని ఆకారం కదిలిపోతూ కనిపించింది.

ఈదురుగాలులు, మెరుపులు ఎక్కువ అయ్యాయి.

''అమ్మో... దెయ్యం...'' ఆ ఆకారాన్ని చూసి అరిచాడు రవి.

వాళ్లందరిలో కొంచెం ఎక్కువపాళ్లు పిరికివాడు అతనే.

గాలికి కురులు ఎగురుతుండగా వెనుతిరిగిన ఆ ఆకారం రవి వంక చాలా కోపంగా, తీక్షణంగా చూసింది. ''ఏం..ఒళ్లు ఎలా వుందేమిటి? పిచ్చిపిచ్చిగా వాగావంటే పళ్లు పీకేసి చేతుల్లో పెట్టేస్తాను'' అరిచిందా ఆకారం...పేరమాంబ.

మేడ దిగుతున్న లలిత పకపకా నవ్వింది. విషయం అర్థం చేసుకున్న అంతా పగలబడి నవ్వుకున్నారు.

''చినబాబూ... భోజనాలు సిద్ధంగా వున్నాయి'' పనిమనిషి మంగతాయారు గొంతు వినేసరికి అంతా డైనింగ్ హాలు వైపు కదిలారు.

పేరమాంబ పక్కన వుంటే, అన్నట్టుగా పళ్లు రాలగొట్టి చేతులో పెడుతుందని భయపడ్డ రవి అందరికంటే ముందుగా డైనింగ్ హాల్లో ప్రవేశించాడు.

# 6

హాలులోని పురాతన గోడ గడియారం భేరీనాదంలో టంగ్...టంగ్...మని పన్నెండు గంటలు కొట్టింది.

అర్థరాత్రి 12 గంటలు..

అంతా ఆదమరచి నిద్రపోతున్నారు. రెండు గంటల క్రితమే వర్షం వెలిసిపోయింది.

ఆఖరి గంట కొడుతున్న చివరి క్షణంలో ప్రారంభమయ్యాయి అరుపులు, కేకలు, ఆర్తనాదాలు, పెడబొబ్బలు...చాలా భయంకరంగా వున్నాయా కేకలు. గుండెల్లో గుబులు పుట్టేలా.. చెవులు చిల్లులు పడేలా... పక్కనే పిడుగులు కురుస్తున్నట్టుగా, హృదయ విదారకంగా వినిపిస్తున్నాయా ఆర్తనాదాలు...!!!

గదుల్లో ఆదమరచి నిద్రపోతున్న అందరూ అదిరిపాటుగా లేచారు. తలుపులు తెరిచి బయటకు వచ్చేసరికి ఆగిపోయాయా కేకలు. తలుపులు తెరిచి వున్న సింహద్వారం గుండా బయటికి పోతూ కనిపించింది తెల్లటి ఆకారం.

ఎవరికి వాళ్లే భయపడ్డారు.

అంతా తెల్లమొహాలు వేశారు. ఆర్తనాదాలు ఎవరు చేశారో అర్థం కాక, హాల్లో

గుమిగూడారు.

"నాకు జ్ఞాపకం. ఆ గావుకేకలు పెట్టింది మా నాన్నగారి గొంతు. నా చిన్నతనంలో ఆయన కుష్టువ్యాధితో బాధపడే రోజుల్లో అరిచిన అరుపులు నేను ఎప్పటికీ మర్చిపోలేను. ఆ గొంతు నిస్సందేహంగా మా నాన్నగారిదే" ఆశ్చర్యంతో చెప్పాడు గిరిధర్.

"ఈజిట్...!" అన్నాడు మదన్.

"యస్..."

"ఏమిటి మామయ్యా... మరీ చాదస్తంగా ఇరవై ఒక్క సంవత్సరాల క్రితం పోయిన తాతయ్య గొంతు యిప్పుడెలా వినిపిస్తుంది?" అంది లలిత.

"అదే నాకు ఆశ్చర్యంగా వుంది. కానీ నేను విన్న గొంతు మాత్రం మా నాన్నగారిదే"

"విచిత్రంగా వుంది" ప్రీతి జవాబు.

మీనాక్షి, పేరమాంబ, రవిల కళ్లల్లో భయం మరికాస్త ఎక్కువగా గోచరిస్తోంది.

"సరే... కేకల గొడవ వదిలేద్దాం. మరి ఆ ఆకారం గొడవేమిటి?" అడిగాడు అంజన్.

"సోములు చెప్పాడు కదా! రత్తి ఆత్మ అయివుంటుంది" ఆ మాట కోటిలింగం అనగానే అందరి ఒళ్లు కంపించింది.

హాల్లో మెట్ల పక్కన మూలగా ముసుగుతన్ని నిద్రపోతున్న సోములుకి యిదేం తెలిసినట్టు లేదు. బహుశాః వాడు కుంభకర్ణుడి వంశానికి చెందిన వాడై వుంటాడు.

వాళ్లంతా చర్చించుకుంటున్న సమయంలో ఆకస్మాత్తుగా మొదలయిన సన్నని ఏడుపు, దాంతో పాటు గజ్జెల శబ్దం లీలగా వినిపిస్తోంది. కీచుగా భీతి గొలిపేలా వుందా ఏడుపు.

ఎక్కడో నక్కల అరుపులు ఉండుండి ఆ ఏడుపుతో పాటుగా వినిపిస్తున్నాయి.

"అక్కా నాకు భయంగా వుంది" మీనాక్షిని గట్టిగా పట్టుకుని అంది పేరమాంబ.

రవి వణుకుతున్నాడు.

"ఓ మైగాడ్... ఇంత దారుణమైన ఏడుపు నేనింతవరకూ వినలేదు" కామెంట్ చేసింది జలజ.

మరుక్షణం ఏడుపు ఆగిపోయింది. నవ్వు మొదలయింది. ఆ నవ్వు కూడా మామూలుగా లేదు. భయానికి నిర్వచనం చెప్పేలా వుంది. ప్రతి ఒక్కరి గుండెల దడ అధికమైంది.

ఎవరి గుండెల చప్పుడు వాళ్లకే దడదడమని వినిపిస్తూంది.

నవ్వు..విపరీతమైన నవ్వు.. పగలబడి నవ్వుతున్న నవ్వు,

“నవ్వుతున్న ఆకారం వరండాలోంచి కనబడుతుంది” మేడపైకి చూపించి అన్నాడు కోటిలింగం.

అంతా మేడమీద వరండాలోకి నడిచి పిట్టగోడ మీంచి తోటలోకి చూశారు.

ఆ చివర, ఈ చివర పిట్టగోడలు విశాలంగా వున్నాయి. రెండు వైపులా తోటలో కొంత భాగం కనిపిస్తుంది.

నూట యాభై గజాల దూరంలో గాలిలో తేలుతున్నట్టుగా పోతున్న ఆకారం కనిపించింది వారికి. ఒకచోట ఆ ఆకారం ఆగి, పకపకా విరగబడి నవ్వసాగింది.

భయం...భీతి...

క్షణం తర్వాత ముందుకు పోయి మాయమై పోయిందా ఆకారం.

వెన్నెల వెలుగు ఆ ప్రాంతాన్ని పట్టపగలుగా మార్చివేసింది.

సడెన్‌గా ఆ ప్రాంతంలో వీళ్లు చూస్తుండగానే భూమిని చీల్చుకుంటూ బురద పట్టేసి, బిగుసుకుపోయి, అసహ్యంగా వున్న రెండు చేతులు మెల్లమెల్లగా పొడుచుకుని వచ్చాయి.

ఆ దృశ్యం చూస్తున్న వారంతా సన్నగా వణకడం ప్రారంభించారు.

చేతులు, తర్వాత బురదతో నిండిన తల మెల్లగా పైకి వస్తోంది.

గాలులు వేగంగా వీస్తున్నాయి. చెట్ల ఆకులు గలగల చప్పుళ్లు చేస్తున్నాయి.

క్షణం తర్వాత నిశ్శబ్దం...అంతటా నిశ్శబ్దం.

భయంకర నిశ్శబ్దం.

ఆ నిశ్శబ్దంలో పాతిపెట్టబడిన శవం భూమిని చీల్చుకుని పైకి లేస్తోంది.

మెల్లమెల్లగా భీకరంగా భయం గొలుపుతూ పైకి లేస్తోంది.

శవం తలమీద వెంట్రుకలు బురదలో బిర్ర బిగుసుకుపోయి నిక్కబొడుచుకుని వున్నాయి.

తల పీక వరకూ బయటపడింది. ఇంకా లేస్తోంది.

మర్రి చెట్టు మీద గుడ్లగూబ కీచుమని అరిచింది.

లేస్తున్న శవాన్ని చూస్తున్న ఆడవాళ్లు భయంతో నిలువెల్లా వణికిపోతున్నారు.

మగవాళ్ల పరిస్థితి కూడా యించుమించు అలాగే వుంది.

చాలా భీకరంగా వుంది శవం. ఇంకా యింకా లేస్తూ నడుం వరకూ లేచాక, యిక

లేవకుండా అలాగే ఆగిపోయింది. భూమిలో దిగేసిన రాటలా చలనరహితంగా అలాగే వుండిపోయింది.

ఆ దృశ్యం చాలా భీకరంగా వుంది

భయానకం...

దూరం నుంచి ఆ శవం ఎవరిదో పోల్చి చెప్పడం కష్టం.

''ఆ శవం ఎవరిదో వెళ్లి చూస్తాను'' అన్నాడు అంజన్.

''ఫూలిష్.. పిచ్చిపని'' దెయ్యాల మీద ఇసుమంత కూడా నమ్మకం లేని శంకర్ కామెంట్ అది.

మదన్ వెళతానంటే గిరిధర్ ఖండించాడు. ఎవరూ బయటికి వెళ్లడానికి సాహసించ లేని భయానక సంఘటన అది.

ఏదో ఊహించుకుని కెవ్వున కేక వేసింది పేరమాంబ.

''అంతా కిందకి పదండి'' ఆజ్ఞాపించాడు గిరిధర్.

అంతా సోఫాలో కూర్చున్నారు.

ఎవరికి వాళ్లే పావుగంటసేపు ఏమీ మాట్లాడలేకపోయారు.

టిక్... టిక్... మనే గోడగడియారం చప్పుడు తప్ప అంతటా నిశ్శబ్దం. నిశ్శబ్దంలో ఆ టిక్...టిక్..శబ్దం భీతి గొలిపేలా వుంది.

''ఈ కేకలేమిటి? ఆ ఆకారమేంటి? ఆ శవమేంటి?...ఇదంతా చూస్తుంటే భయంతో ప్రాణం పోయేలా వుంది'' అన్నాడు రవి.

''నాకంతా అయోమయంగా వుంది'' అన్నాడు గిరిధర్- ఆలోచనలతో బుర్ర బద్ధలు కొట్టుకుంటూ.

''దెయ్యాలున్నాయని మేమంతా నమ్ముతున్నాం'' ఆడవాళ్లంతా ఏకగ్రీవంగా చెప్పారు.

కోటిలింగం, రవిల సంగతి వేరే చెప్పక్కర్లేదు.

గిరిధర్, అంజన్, శంకర్, మదన్, కిశోర్‌లు మాత్రం సందిగ్ధావస్థలో వుండిపోయారు.

''రేపు మీలో ఎవరు వచ్చినా రాకపోయినా దెయ్యాలమీద నమ్మకం వున్న మమ్మల్ని సిటీకి పంపేయండి. ఇక మరొక్క క్షణం కూడా యిక్కడ వుండలేము'' చెప్పింది జలజ.

''నా కోరికా అదే'' అంది మీనాక్షి.

''మీరంతా వెళ్లిపోతే యిక్కడ మేమెందుకు? మేం కూడా వచ్చేస్తాం'' అన్నాడు కిశోర్.

"ఇక్కడ జరగకూడని సంఘటనలు జరిగి మనందర్నీ భయభ్రాంతుల్ని చేస్తున్నాయి. అందువల్ల ఉదయం అందరం మద్రాసు వెళ్లిపోదాం. ఇక అంతా పడుకోండి" అన్నాడు గిరిధర్.

అందరూ ఏకగ్రీవంగా వెళ్లిపోవడానికి నిశ్చయించుకుని ఎవరి గదుల్లోకి వారు పోయి తలుపులు బిడాయించుకుని పడుకున్నారు.

* * *

అంతా పెట్టేబేడా సర్దుకుని ఒక్కొక్కరుగా హాలులోకి వచ్చి కూర్చున్నారు.

గిరిధర్ పిలుపు విని అంతా డైనింగ్ హాల్లోకి ప్రవేశించి టేబుల్ మీద టిఫిన్ ప్లేట్లను చూసి వరుసగా ఆశీనులయ్యారు.

పెసరట్టు, ఉప్మా మీద దాడి చేశారు. కాఫీలు ఇంకా రాలేదు. కావలిసినవారికి వడ్డిస్తూ నిలబడ్డాడు సోములు.

"ఒరేయ్ సోములూ.. రాత్రి కేకలు అవీ వినిపించాయి. ఎవరివా కేకలు?" అడిగాడు కోటిలింగం.

"గిరిధర్ బాబుగారి తండ్రిగారివండి" చెప్పాడు సోములు.

"ఆ కేకలు రోజూ వినపడుతుంటాయా?" రవి ప్రశ్న.

"అవునండి. అర్థరాత్రి సమయంలో వినబడుతుంటాయి"

"మరి నువ్వు ఆ కేకలు వింటూ హాల్లో ఎలా పడుకోగలుగుతున్నావు?"

"నాకు అలవాటు అయిపోనాదండి, మరో యిషయం.. నేను నిద్రపోయానంటే పరిసరాలన్నీ మర్చిపోయి మొద్దులా నిద్రపోతానండి"

"నిన్న రాత్రి మాకు రత్తి కనిపించింది" అన్నాడు మదన్.

"అందులో విశేషమేముందండి. నాకు రోజూ కనిపిస్తుంది"

"వేం హాల్లోకి వచ్చేసరికి కేకలు ఆగిపోయాయి. తిరిగి లోపలికి వెళ్లగానే ప్రారంభమయ్యాయి. ఎందుకిలా జరిగిందో తెలుసా?" శంకర్ ప్రశ్నించాడు.

"నాకెలా తెలుస్తుంది బాబూ.. ఒక్కటి మాత్రం చెప్పగలను. కొన్ని సంవత్సరాల పాటు మనిషన్నవాడు అనుభవించలేని భయంకర బాధలు అనుభవించారు విశ్వేశ్వరవర్మ గారు. వారికి గుర్తుగా మిగిలిపోయింది గాలిబంగ్లా. ఆయన ఆత్మ ఏదో ఒక సమయంలో ఈ బంగ్లాలో ఘోషిస్తుంది బాబూ" బాధగా అన్నాడు సోములు.

"గతాన్ని గుర్తు చేయక సోము. వెళ్లి డ్రైవర్ చంద్రాన్ని పిలుచుకురా" అన్నాడు

గిరిధర్.

సోములు వెళ్లిపోయాడు.

ఆ బంగ్లా నుంచి వెళ్లిపోతున్నందుకు అందరికీ ఆనందంగా వుంది.

మంగతాయారు పొగలు కక్కే వేడి కాఫీగ్లాసులు తెచ్చి టేబుల్‌పై వుంచింది.

తలా ఓ గ్లాసు అందుకుని కాఫీ తాగుతున్నారంతా.

''ఏమే మంగా! నీకు రాత్రి కేకలు వినిపించాయా?'' అడిగింది మీనాక్షి.

''వినిపించాయి అమ్మగోరు.. నాకు చాలా భయమేసింది. తలుపు గడిలు గట్టిగా బిగించి చెవుల్లో దూది కూరుకుని తలనిండా ముసుగు కప్పుకుని పడుకున్నాను'' అంది రాత్రి సంఘటనను తలుచుకుంటూ మంగతాయారు.

సోములు వచ్చి డ్రైవర్ హాల్లో వున్నాడని చెప్పాడు.

కోటిలింగం అన్నాడు ''ఆ... సోము... ఒక్క విషయం అడగడం మరిచాను. రాత్రి వరండాలోంచి చూస్తున్న మాకు తోటలో భూమిని చీల్చుకుని బయటపడిన శవం కనపడింది. ఎవరిదా శవం?''

ఫకాలున నవ్వాడు సోములు. ''ఊరుకోండి బాబూ. ఎటకారం ఆడేస్తున్నారు. నాలుగేళ్ళ క్రితం నా మరదల్ని చంపిన నీచుణ్ణి అక్కడే పాతిపెట్టాం. వాడి అస్థిపంజరం కూడా మిగిలివుండదు. భూమిలో కలిసిపోయి వుంటుంది. అలాంటిది శవాన్ని చూశామంటారేటి?'' ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

''నిజంగానే చూశాం సోము'' గిరిధర్ చెప్పాడు.

అంతా తలలూపారు.

''ఆశ్చర్యంగా వుంది బాబూ... కొన్నేళ్ళ క్రితం పాతిన శవం యింకా ఎక్కడుంటుంది! భూమిని చీల్చుకుని రావడమేటి? నాతో రండి, విషయమేంటో చూద్దాం'' అంటూ బయటికి కదిలాడు.

అతని వెనుకే అంతా కదిలారు. డ్రైవర్ చంద్రం కూడా విషయం తెలిసి వెళ్ళాడు.

''ఆ నీచుణ్ణి పాతేసింది యిక్కడే బాబూ. మీరూ చూసింది యిక్కడేనా?'' సోములు ప్రశ్న.

''అవును ఇక్కడే. చాలా ఆశ్చర్యంగా వుంది. పైకి లేచిన శవం లేదు. గొయ్యి లేదు. ఇక్కడ ఏమీ జరిగిన సూచనలు కూడా లేకుండా యింత ప్రశాంతంగా ఎలా ఉంది?'' అన్నాడు అంజన్.

''నేను చెప్పాను కదబాబూ! అదంతా వట్టి భ్రమ'' కొట్టిపారేశాడు సోములు.

''భ్రమ కాదు... మేం కళ్ళారా చూశాం'' అంది ప్రీతి.

''సరే.. సరే.. వాదనలు వద్దు. మనం ఎలాగూ ఇక్కడ నుంచి వెళ్ళిపోబోతున్నాం'' అని చంద్రం వైపు తిరిగి ''డ్రైవర్.. కార్లు రెడీగా వుంచు. మరో పావుగంటలో మనం బయలుదేరాలి'' చెప్పాడు గిరిధర్.

అలాగేనని చంద్రం వెళ్ళిపోయాడు.

అంతా బంగ్లాలోకి వచ్చేశారు.

మరో పది నిముషాల్లో చంద్రం హాల్లోకి వచ్చి చెప్పాడు.

''సార్... కారుల్లో పెట్రోలు పూర్తిగా ఖాళీ అయిపోయింది.''

''వ్హాట్!'' అదిరిపడ్డాడు గిరిధర్. ''నీకేమన్నా మతిపోయిందా! మూడు కార్ల టాంకుల నిండుగా పెట్రోలు పోయించాం కదా!? ఎలా మాయమవుతుంది?!''

''అదే నాకూ అర్థం కాకుండా వుంది సార్. ఒక్కచుక్క పెట్రోలు కూడా లేదు. అంతా పీల్చివేయబడింది.''

''కారుల్లో పెట్రోలంతా దెయ్యాలు తాగేసి వుంటాయి'' అన్నాడు శంకర్.

''అదే జరిగి వుంటుంది'' రవి వత్తాసు పలికాడు.

శంకర్‌ని అనుమానంగా చూశాడు అంజన్. దెయ్యాలమీద అసలు నమ్మకంలేని వ్యక్తేనా ఈ మాటలు మాట్లాడుతోంది? లేక పెట్రోల్ ఇతనే మాయంచేసి నాటకమాడుతున్నాడా?...

ఛ... తన అనుమానానికి ఆధారం లేదు. పెట్రోలు మాయం చేయడం వల్ల అతనికి ఒరిగే ప్రయోజనమేముంది? సాలోచనగా గెడ్డంమీద చేత్తో రాసుకున్నాడు అంజన్.

''స్పేర్ పెట్రోల్ టిన్స్ వుండాలి కదా!'' అడిగాడు గిరిధర్.

''అవి కూడా కనిపించటం లేదు సార్... డిక్కీలో వుంచాను. ఇప్పుడు చూస్తే లేవు'' తల వంచుకున్నాడు చంద్రం.

''రాత్రి నువ్వెక్కడ పడుకున్నావ్?''

''పోర్టికోలో...''

అయోమయంగా బుర్ర గోక్కున్నాడు గిరిధర్.

''ఇప్పుడెలా?'' అంది లలిత.

''అదే ఆలోచిస్తున్నాను. ఏ మార్గం కనబడటం లేదు'' అరచేతిలో కొట్టుకున్నాడు

గిరిధర్.

''సిటీకి ఫోన్ చేస్తే'' పేరమాంబ చెప్పింది.

''ఫోన్ సౌకర్యం మనకెక్కడిది? కరెంటు లేనందుకే జనరేటర్ ఏర్పాటుచేశారు. మన బంగ్లాకి ఫోను సౌకర్యం ఎలా ఉంటుందనుకున్నావు?''

''అయితే మనం ఈ బంగ్లాలోంచి బయటపడే మార్గం లేదా?'' భయంగా అడిగింది ప్రీతి.

''ప్రస్తుతం లేనట్టే'' అన్నాడు గిరిధర్ మరోమాట చెప్పలేక.

మదన్‌కి కనుసైగ చేశాడు అంజన్. ఆ సైగను అర్థం చేసుకుని బయటికి వెళ్ళాడతను. అంజన్‌కి డ్రైవర్ చంద్రం మీద కూడా అనుమానంగానే వుంది. కాని అతని అనుమానానికి సరైన ఆధారం దొరకటం లేదు.

గిరిధర్ సైగనందుకుని చంద్రం వెళ్ళిపోయాడు.

''మనం ఈరోజు కూడా ఇక్కడ వుండిపోక తప్పదు. ఈ రోజంతా ఆలోచించి రేపు ఏదో ఒకటి చేద్దాం'' అన్నాడు గిరిధర్.

అప్పుడే అక్కడకు వచ్చాడు సోములు. ''చినబాబూ... మన తోపులో వుండవలసిన పన్నెండు గొర్రిపోతుల్లో ఒక పోతు తల నరకబడి బంగ్లా వెనుక చచ్చిపడివుంది బాబూ!''

అది విన్న అంతా నిశ్చేష్టులైపోయారు.

మారణకాండకు ప్రారంభ సూచకంగా బలిపశువు వధించబడింది.

మృత్యువు తవు చుట్టూ వల పన్ని తన కోరల్లో ఇరికించుకుని ఆహారంగా స్వీకరించడానికి సిద్ధంగా వుందని వాళ్ళకు తెలియదు.

# 7

మంచం మీద పడుకుని తల కింద చేతులుంచుకుని సీలింగ్ చూస్తూ, తీవ్రంగా ఏదో ఆలోచిస్తున్నాడు అంజన్. సమయం పదకొండు గంటలయింది.

అదే సమయంలో తలుపు తెరచుకుని అతని గదలోకి వచ్చింది జలజ.

ఆమెను చూసి ఆలోచనలను పక్కకు నెట్టి లేచి కూర్చున్నాడు అంజన్. ''మీరా! ఏమిటిలా వచ్చారు?'' అడిగాడు.

''బోర్‌గా వుంది. ఏమీ తోచడం లేదు అంజూ...'' అంటూ చనువుగా అతని పక్కన కూర్చుంది ఆమె.

జలజ అతి చనువు అతనికి చిరాకును కలిగిస్తోంది. జవాబు చెప్పకుండా వూరుకున్నాడు.

''అంజూ... నీతో ఒక విషయం ఎన్నాళ్ళుగానో చెప్పాలనుకుంటున్నాను.. చెప్పలేక పోతున్నాను.''

''ఏమిటది?'' అడిగాడు.

''నేను నిన్ను ప్రేమిస్తున్నాను''

''నేను నిన్ను ప్రేమించడం లేదు''

''ఇప్పుడు ప్రేమించు'' అంది అతని వైపు ప్రేమగా చూస్తూ.

''నాకు తీరిక లేదు. మరెవరినైనా చూసుకో''

''నిన్ను తప్ప యింకెవర్నీ ప్రేమించను''

ఇది మామూలుగా వదిలే రకం కాదని అంజన్‌కి అర్థమైంది. తామిద్దర్నీ ఆ సమయంలో లలితగాని చూసిందంటే వెంటనే అపార్థం చేసుకుంటుంది. తన ప్రేమ బెడిసి కొడుతుంది. ఆమెను అక్కడినుంచి ఎంత త్వరగా బయటకు పంపితే అంత మంచిదని నిశ్చయించుకున్నాడు.

పైకి లేచి ''సాయంత్రం నాలుగు గంటలకి భవనం పక్క తోపు దగ్గర వుండు'' అన్నాడు అంజన్.

సంతోషంతో జలజ మొహం వికసించింది.

''తప్పకుండా వస్తావా!'' అంది.

''వస్తాను''

''ప్రామిస్...!''

''ప్రామిస్...''

''అయితే మూడున్నరకే అక్కడ కూర్చుంటాను''

''వద్దు. అంత శ్రమ దేనికి. సరిగ్గా నాలుగు గంటలకి వస్తేచాలు'' ముందు ఇక్కడినుంచి త్వరగా కదిలవే తల్లీ అనుకుంటూ అన్నాడు.

హుషారుగా బయటికి వెళ్ళిపోయింది జలజ. నీరసంగా పక్కమీద వాలాడు అంజన్.

* * *

మగవాళ్ళంతా గదుల్లో నిద్రపోతున్నారు. సమయం మధ్యాహ్నం మూడు గంటలయింది.

ఆడవాళ్ళు మాత్రం తమ భయాలను మరిచిపోవడానికి హాల్లో టేబుల్ చుట్టూ కూర్చుని పేకాట ప్రారంభించారు.

నిద్ర పట్టని కిశోర్, రవి కూడా వాళ్ళతో చేరారు. స్వీక్వెన్స్ ఆడుతున్నారు.

''అక్కా! ఆటీన్ ఎయిట్ పారేయవే'' అంది ప్రాధేయపడుతున్నట్టుగా జలజ.

''ఏయ్... నా ముక్కలు ఎవరు చూడమన్నారే నిన్ను'' కసిరింది మీనాక్షి.

''చూసినందుకన్నా పారేయవే..''

''అదేం కుదరదు. నేనొప్పుకోను. అక్కాచెల్లెళ్ళు లాలూచీ పడితే మేమంతా లాలూచీ పడాల్సివస్తుంది'' హెచ్చరించాడు రవి.

అతన్ని వెక్కిరించింది జలజ కోపంగా.

ఒక షో ప్రీతి గెలిచింది. మరో రెండు షోలు కిశోర్ గెలిచాడు. ప్రీతి 200 రూపాయలు, కిశోర్ 260 రూపాయలు సంపాదించారు.

అప్పుడే అంజన్ స్నానం చేసి డ్రెస్సెప్ అయి మేడమెట్లు దిగుతున్నాడు.

లలిత అతని వైపు చూసింది. సైగ చేశాడు.

ఆమె ఏదో పని వున్నట్టు అక్కడినుంచి లేచి బయటకు వెళ్ళింది. ఆమె వెనుక అర నిముషం తర్వాత వెళ్ళాడు అంజన్.

''తల నొప్పిగా వుంది. నేను మానేస్తున్నాను'' అక్కడి నుంచి పిల్లిలా జారుకుంది జలజ.

బంగ్లా పక్కన తోపులో ఒక నీటిగుంట పక్కనున్న నిద్రగన్నేరు చెట్టుకింద కూర్చున్నారు అంజన్, లలిత.

చెట్టుమీద పక్షులు కిలకిలమని శబ్దాలు చేస్తున్నాయి.

''లల్లీ... ఈరోజు నేనేం చేసినా నువ్వు అడ్డు పెట్టకూడదు'' అమె చేతిని సుతారంగా ముద్దు పెట్టుకుంటూ అన్నాడు.

లలిత ఒళ్ళు పులకరించింది. ఒంటినిండా అదోరకమైన మైకం ఆవరించింది.

''ఇవాళ వింతగా ప్రవర్తిస్తున్నావేమిటి?''

''ముందే చెప్పాను. ప్లీజ్... అడ్డు చెప్పకు. నన్నో జలగ వెంట తరుముతోంది. దాన్ని వదిలించుకోవాలనే నా తాపత్రయం'' అన్నాడు.

''జలగేమిటి? వెంట తరమడమేమిటి?!'' ఆశ్చర్యంగా అడిగింది.

''నన్నేమీ ప్రశ్నించకు'' అంటూ చెట్టుకు జారబడి ఆమెనను గుండెలకు

హత్తుకున్నాడు.

"ఎవరైనా చూస్తే బాగుండదు" సిగ్గుతో భయంగా అంది.

"ఎవరూ చూడరు. కనుక బావుంటుంది" ఆమెను మరింతగా అదుముకున్నాడు.

లలిత వక్షస్థలం అతని బాహువుల మధ్య ఒత్తిడికి ఆమె శరీరం సన్నగా కంపించ సాగింది. మనసు తీయని అనుభూతికి లోనవుతోంది. మనసు అదుపు తప్పుతోంది. కానీ ఆమెకు గుండె దడగానే వుంది.

వాళ్లిద్దరినీ ఆ స్థితిలో ఒక చెట్టు పక్కనుంచి చూసింది జలజ. ఆమె చూడాలనే అంజన్ అలా ప్రవర్తించాడు.

జలజ మొహంలో క్షణం క్షణం రంగులు మారసాగాయి. కోపంతో ఆమె అధరాలు కంపిస్తున్నాయి. ఈర్ష్య, అసూయలతో బుసలు కొట్టసాగింది కోడెత్రాచులా.

కదలకుండా, మెదలకుండా చెట్టుచాటు నుంచి వాళ్ళిద్దర్నీ అలాగే చూస్తోంది.

"ఏదో మాట్లాడు" అన్నాడు అంజన్ మెల్లగా.

"ఏం మాట్లాడను?" అంది లలిత.

"అబ్బా.. ఏదో ఒకటి మాట్లాడు"

"ఏం మాట్లాడాలో తెలియడం లేదు. నువ్వే మాట్లాడు"

"నాకు చేతకాక నీకు చెప్పాను. సరే.. నేనే మాట్లాడతాను" అంటూ మెల్లగా లలితకు మాత్రమే విన్పించేంత మెల్లగా నోటికొచ్చింది దీర్ఘం తీస్తూ మాట్లాడసాగాడు అంజన్. "పలకా... బలపం... గాజు పలకా... మట్టి బలపం... గాలిబుడగ... నీటి వరద... చిలక ప్లస్ పలుకు- ఈజ్ ఈక్వల్ టు చిలక పలుకు. ఇది కరక్టో కాదో.. సమాసం ఏదో తెలయనే తెలియదు. తెలుగు పాస్ మార్కులతో పాసయ్యాను. రాణి... యువరాణి... రాజు... యువరాజు... రాజు రాణి... యువరాణి... నువ్వు నేను... నేను నువ్వు... జంట పక్షులం... ప్రేమ పక్షులం" రాగయుక్తంగా వస్తున్న అతని మాటల ప్రవాహం వింటూ పకపకా నవ్వసాగింది లలిత. వీణ మీటినట్లు సెలయేటి గలగలలా నవ్వసాగింది- ఎంతో మృదువుగా.

వాళ్ళ నవ్వులు, కేరింతలు చూసిన జలజ కోపంతో రగులుకుపోతోంది. కాని అక్కడనుంచి కదల్లేదు.

మరో పది నిముషాలు అలాగే కబుర్లు చెప్పుకుని నవ్వుకున్నారు వాళ్లిద్దరూ!

"లల్లీ... నువ్వు ముందు వెళ్ళు... రెండు నిముషాలు గేప్ ఇచ్చి నేను వస్తాను" అన్నాడు అంజన్.

తలూపి వెళ్ళిపోయింది లలిత.

ముందుకు కదిలాడు అంజన్.

చెట్టు పక్కనుంచి వచ్చి అతన్ని నిలదీసింది జలజ. ''నన్ను రమ్మని చెప్పి లలితతో ప్రేమకలాపాలు సాగిస్తున్నావా?'' కోపంగా అడిగింది.

''ఇంకా నీకు అర్థం కాలేదా?'' అన్నాడు అంజన్.

''ఏమిటది?''

''నేను లలితను ప్రేమిస్తున్నానని చెప్పినా నువ్వు నమ్మే స్థితిలో లేవు. మమ్మల్ని చూసైనా నమ్ముతావని ఇలా చేసాను''

ఏం చెప్పాలో తోచలేదు జలజకు. ''ప్లీజ్.. నిన్ను మనసారా ప్రేమించాను''

''నేనూ లలితా కూడా మనసారానే ప్రేమించుకున్నాం''

''నీ ప్రేమ ఫలించదు'' నవ్వుతూ చెప్పింది.

''ఎందువల్ల?''

''లలితను తన స్నేహితుడు కిశోర్‌కిచ్చి పెళ్లి చేద్దామనే దృఢసంకల్పంతో వున్నాడు శంకర్''

తలమీద పిడుగు పడ్డట్టు అదరిపడి వెంటనే తమాయించుకున్నాడు అంజన్. ''ఆ సంగతి నేను చూసుకుంటాను. ఇక నువ్వెళ్ళవచ్చు''

''లలితను మర్చిపో...నన్ను ప్రేమించు''

''అది జరగని పని. నన్ను జలగలా పీడించకు, వెళ్ళు'' చిరాకుగా అన్నాడు.

కోపంతో బుసలు కొడుతూ వెళ్ళిపోయింది జలజ.

నుదుటిపై రుద్దుకుంటూ సాలోచనగా మరోవైపు కదిలాడు అంజన్.

* * *

సాయంత్రం ఆరయింది.

జలజ స్నానాల గదిలోకి వెళ్లబోతూంటే అప్పుడే స్నానం ముగించి బయటకు వస్తున్న రవి ఆమెను ఆపాడు.

''జలా.. నా విన్నపం ఏం చేసావ్?''

''ఏయ్.. ఏమిటా వెధవ పిలుపూ నువ్వూ!''

''ఆహా... ఎంత అందంగా పలికావ్...!''

''పిచ్చివాగుడు కట్టిపెట్టు'' చిరాగ్గా అంది.

‘‘నా విన్నపం మరోసారి విను. నా ప్రేమవాహినిలో నువ్వు, నీ ప్రేమ వాహినిలో నేనూ.. ఇరువురం ఏకమై కొట్టుకుపోతూ మధురతీరాలకు ఏకమై పయనిద్దాం’’ ఊహాలోకాల్లో విహరిస్తున్నట్టుగా చెప్పాడు రవి.

‘‘ఏమిటా పైత్యం?’’

‘‘ఇది పైత్యం కాదు. ప్రేమ మైకంలో భావుకత్వం’’

‘‘ఇది మామూలు పైత్యం కూడా కాదు. ప్రేమ పైత్యం. వెంటనే డాక్టరుకి చూపించుకో...’’

‘‘అవును. ప్రేమ పైత్యమే. నీ ప్రేమలో పడి నా పైత్యం పెరిగింది. దీనికి వేరే ఏ డాక్టరూ పనికిరాడు. నీ ప్రేమను నాకు పంచేయ్.. నా పైత్యం పటాపంచలయిపోతుంది’’ ఆమె చేతిని తాకబోతూ అన్నాడు.

ఆ చేతిని టప్‌మని కొట్టింది. ‘‘జలగలా పీడించకు.. నన్ను పోనీయ్’’ అంజన్ మీద వున్న అక్కసునంతా రవి మీద చూపించింది జలజ.

‘‘జలగకున్న శక్తే నాకుంటే ఈ జలజ నిలా విడిచి పెడతానా? ఆ అదృష్టం నాకు లేదు’’ రవి అన్నమాటలు జలజపై మరో ప్రభావాన్ని తీసుకువచ్చాయి. వెంటనే ఆమెకో దివ్యమైన ఆలోచన స్ఫురించింది.

‘‘నిన్ను ప్రేమిస్తే ఏం చెయ్యమన్నా చేస్తావా?’’ అదోలా చూస్తూ అడిగింది.

‘‘నిస్సందేహంగా... నువ్వేం చెప్పినా చేస్తాను. చెప్పు... నా ప్రాణాలు ఇవ్వమంటావా? లేక ఎవడి ప్రాణాలైనా తీయమంటావా? నాకు చేతనైన పనులు ఏమైనా చేస్తాను. చెప్పు... ఏం చెయ్యమంటావ్?’’

‘‘సరే.. నిన్ను ప్రేమిస్తాను. నేను చెప్పినట్టు నడుచుకో.. ప్రస్తుతం నువ్వు చేయవలసిన మొట్టమొదటి పని’’ అంటూ అతని చెవిలో ఏదో చెప్పింది జలజ.

ఆమె ప్రేమిస్తాననేసరికి రవి చాలా పొంగిపోయాడు. ‘‘నువ్వు చెప్పిన పని అయిపోయినట్టే! నిశ్చింతగా వుండు’’ అని చకచకా వెళ్ళిపోయాడు.

క్రూరంగా నవ్వుకుని బాత్రూంలోకి వెళ్ళింది జలజ.

# 8

సమయం ఏడున్నర గంటలు...

కుర్చీలో కూర్చుని ఏదో హారర్ నవల చదువుతోంది లలిత.

రూమ్ తలుపులు తెరిచే వుంచి సీరియస్‌గా నవల చదవడంలో మునిగిపోయింది.

"సుమిత్ర బెడ్ మీద పడుకుంది. హంతకుడి మోటార్ బైక్ ఆగింది. పిల్లిలా లోపల జొరబడ్డాడు. నిద్రపోతున్న కుక్కను చూసి చప్పుడు చెయ్యకుండా ఆమె గదిలోకి ప్రవేశించాడు. బెడ్‌ని సమీపించాడు. మెడకున్న టై విప్పాడు"

చిన్న శబ్దం... నవలలో కాదు, బయట... అంటే లలిత గదిలో..!

ఆమె ఉలిక్కిపడి గది మూలవున్న పెద్ద బోషాణం పెట్టె వైపు చూసింది. కొద్దిగా పైకి లేచిన పెట్టిమూత, లలిత చూడగానే దబ్‌మని మూసుకుపోయింది.

కొద్దిగా భయపడినా గాలి ప్రభావమనుకుని సరిపెట్టుకుని నవల్లో దూరింది.

"మెడకున్న టై విప్పాడు హంతకుడు. దాన్ని తాడులా పేనాడు. అతని చేతులు కొద్దిగా కంపించాయి. ఆ తాడుని సుమిత్ర మెడకు బిగించాడు. అతని ప్రమేయం లేకుండానే ఆమె ప్రాణాలు గాలిలో కలసిపోయాయి" మరోసారి శబ్దం...!!

నవల ఆపి పెట్టెవైపు చూసింది. మరోసారి పెట్టిమూత దబ్‌మని పడింది.

అసలే హారర్ నవల చదువుతుందేమో, పెట్టె గొడవ ఆమెను భయకంపితురాల్ని చేసింది.

పెట్టెవైపు అలాగే చూసింది. నిముషం తర్వాత పైకి లేచి శబ్దం చేస్తూ పడింది.

ధైర్యం చేసి అదేమిటో చూద్దామని నిశ్చయించుకుంది. ఒకవైపు మనసు పీకుతున్నా దాని నోరు నొక్కేసి, మెల్లగా లేచి పెట్టెవైపు కదిలింది.

చిరుచెమటలు ఆమె ఒళ్ళంతా అలుముకున్నాయి.

నవలను మంచం మీద వుంచి వణుకుతున్న చేతుల్ని స్వాధీనంలోకి తెచ్చుకుని పెట్టెవద్దకు నడిచింది.

హేండిల్ పట్టుకుని మెల్లగా ఎత్తింది మూత. భోషాణం పెట్టెలోకి చూసిన ఆమె కళ్ళు గిర్రున తిరగసాగాయి.

పెట్టెలో ఎవరిదో శవం...భయంకరంగా బిర్ర బిగుసుకుపోయి బురదతో భీతావహంగా వుంది.

నిలద్రొక్కుకోలేక కెవ్వుమని అరచి బయటికి పరుగుతీసింది లలిత.

వేగంగా మెట్లు దిగి హాల్లో అందరికీ జరిగింది చెప్పింది.

వెంటనే అంజన్ మేడపైకి పరుగుతీసాడు. వెనకే అంతా వెళ్ళారు.

ఎత్తివున్న భోషాణం ఖాళీగా దర్శనమిచ్చింది అందరికీ...

"హారర్ నవల చదువుతూండటం వల్ల ఏదో భ్రాంతి కలిగి వుంటుంది" అంది జలజ.

“కాదు.. నేను కళ్ళారా చూశాను శవాన్ని”

“మరి.. ఉన్న శవం ఉన్నపళంగా ఎలా మాయమైంది?” పేరమాంబ అంది.

“నిన్న రాత్రి మనం తోటలో చూసిన శవంలా వుందా?” గిరిధర్ అడిగాడు.

“ఏమో! భయంలో వున్నందువల్ల పోల్చిచెప్పలేను”

“రాత్రి చూసిన శవం పొద్దున్నకి మాయం కాలేదూ! అలాగే ఇదీనూ” కోటిలింగం అన్నాడు.

“నిస్సందేహంగా ఇది దెయ్యాల పనే” చెల్లెలికి ధైర్యం చెబుతూ అన్నాడు శంకర్.

“ఇలా కబుర్లతో కాలక్షేపం చేస్తే లాభం లేదు. ఇక్కడినుంచి బయటపడే విధానం ఆలోచించండి” అంది ప్రీతి.

కిందకి దిగి వచ్చారంతా...

విషయం తెలిసిన డ్రైవర్ చంద్రం అప్పుడే హాల్లోకి వచ్చాడు...

“ఏమిటి చంద్రం” గిరిధర్ ప్రశ్నించాడు.

“నేను సిటీకి వెళ్దామనుకుంటున్నాను చినబాబూ...” అన్నాడు చంద్రం.

“ఎందుకు?”

“మరో కారులో పెట్రోలు తెస్తాను, కేన్స్ ద్వారా..”

“125 కిలోమీటర్ల దూరం ఎలా వెళ్తావ్?”

“బంగ్లా వెనుక తోటలో ఒక గుబురుపొదలో ఎవరిదో బుల్లెట్ నాకంట పడింది. దానిమీద వెళ్ళాలని నా ఆలోచన... ఇప్పుడు వెళ్తే మళ్ళీ రేపు మధ్యాహ్నంకి వచ్చేస్తాను చినబాబూ..”

అందరి మొహాలూ ఒక్కసారిగా వికసించాయి. చంద్రం ఆలోచన అందరికీ నచ్చింది.

“ఇంత రాత్రివేళ ఎందుకు... ఉదయం వెళ్దువుగాని. సాయంత్రం కల్లా వచ్చేయవచ్చు” సలహా ఇచ్చాడు గిరిధర్.

“మీ ఇష్టం...”

“రేపటివరకూ ఎందుకు? చంద్రం వెళ్తానంటున్నాడు కదా! వెళ్ళనిస్తే మంచిది” అన్నాడు శంకర్. రవి అతనికి వత్తాసు పలికాడు.

“నీకిప్పుడు వెళ్ళాలనే తలంపు వుంటే భోంచేసి వెళ్ళు... లేకపోతే ఉదయం వెళ్దువుగాని” అన్నాడు గిరిధర్.

చంద్రం ఇంకేమీ మాట్లాడకుండా తల ఆడించి వంటగదిలోకి వెళ్ళాడు. “మంగా...

త్వరగా భోజనం వడ్డించు... పట్నం వెళ్ళాలి'' అన్నాడు.

''ఓసోస్.. ఏమిటా కంగారు.. నిదానంగా చెప్పు. అయినా పట్నం ఎలా పోతావ్? ఏ బండీ కదలదు కదా!?''

''తోటలో మోటారుబండి కనిపించింది. దానిమీద పోతాను'' అన్నాడు అన్నంలో కూర కలుపుకుంటూ.

ఇంకేం మాట్లాడలేదు మంగతాయారు.

గాలిబంగ్లాలో జరుగుతున్న భయంకరమైన వింత సంఘటనల గురించి పూర్తిగా విన్నాడు చంద్రం. భయభ్రాంతులవుతున్న వాళ్ళందర్నీ రక్షించడం కోసం ఆలోచిస్తున్న తరుణంలో తోటలో గుబురుపొదలో వున్న బుల్లెట్... ఆగంతకుడి బుల్లెట్ అతడి కంట పడింది. వెంటనే యజమాని అనుమతి తీసుకుని వెళ్ళడానికి సిద్ధపడ్డాడా అభాగ్యుడు.

భోజనం కూడా సరిగా చెయ్యకుండా మధ్యలో లేచిపోయాడు.

ఆ రాత్రి సమయంలో పట్నం పోవాలనే కోరిక అతనికి కలగడం ఎంత ప్రమాదకరమో! దానివల్ల తన చావుకు తనే ముహూర్తం నిర్ణయించుకుని, మృత్యువు వాత పడబోతున్నానని అతనికి తెలిసివుంటే...!!!

* * *

తోటలో చకచకా నడుస్తున్నాడు చంద్రం.

టార్చి వెలుగు అతనికి దారి చూపిస్తోంది.

అతను ధరించిన ఆకుచెప్పుల కింద పడి ఎండుటాకులు ఫళక్.. ఫళక్.. మని శబ్దాలు చేస్తూ నలిగిపోతున్నాయి.

మరికొంత దూరం నడిచి ఒక గుబురుపొదలో టార్చికాంతి వేసి చూశాడు.

కాని అక్కడ బుల్లెట్ లేదు.

ఆశ్చర్యపోయాడు చంద్రం. పొదంతా గాలించాడు. ఫలితం శూన్యం.. ఏమైంది? తను చూసిన బుల్లెట్ యిక్కడే వుండాలి కదా! ఇంతలో ఎలా మాయమైంది? బుల్లెట్‌ను దొంగిలించడానికి ఇక్కడ దొంగలెవరున్నారు గనుక...?

ఆలోచనలు ఓ కొలిక్కి రాకముందే బంగ్లా ముందుకి వెళ్ళడానికి నడక ప్రారంభించాడు.

చెట్ల మధ్యగా నడుస్తున్నాడు.

నిద్రగన్నేరు చెట్టుకిందకి వస్తున్నాడు.

కీచురాళ్ళు అదేపనిగా గోల చేస్తున్నాయి.

సరిగ్గా చెట్టు కిందకి వచ్చేసరికి చంద్రం మీదకి చెట్టు పైనుంచి పెట్రోలు ధారాపాతంగా, జలపాతంలా వేగంగా పడింది.

అదిరిపడి పరుగెత్తబోయాడు. కానీ అప్పటికే ఆలస్యమైపోయింది.

చెట్టు పైనుంచి గాలిలో గిరికీలు కొడుతూ వచ్చిన నిప్పుముద్ద అతనిపై పడింది. అంతే...

భగ్గున లేచాయి మంటలు... నిలువెత్తు మంటలు... శరీరాన్ని పూర్తిగా ఆక్రమించుకున్న మంటలు తమ ప్రతాపాన్ని చూపిస్తూ అతన్ని ఆస్వాదించసాగాయి.

భయోత్పాతంతో నిండివున్న చంద్రం, పక్కనే వున్న నీటిగుంటను చూసే స్థితిలో లేడు. ఒకవేళ చూసివుంటే బ్రతికేవాడేమో...!

భయంతో పిచ్చిగా బంగ్లా ముందుకు పరుగుతీస్తున్నాడు కేకలు వేస్తూ.

గాలికి, అతను పరుగుతీస్తున్న వేగానికి మంటలు ఇంకా ఎక్కువగా విజృంభించ సాగాయి.

అతని పరిస్థితి పెనం మీద ఆవగింజలా వుంది.

శరీరం కాలి బొబ్బలెక్కిపోతోంది.

బట్టలు చాలావరకు కాలిపోయాయి.

చర్మం కాలిపోతున్నా లెక్కచేయకుండా అలా పరుగు తీస్తూనే వున్నాడు, పిచ్చి పట్టినట్టు చావుకేకలు వేస్తూ.

హృదయ విదారకమైన చావు కేకలు...

ఎలాగైతే బంగ్లా ముందుకు వచ్చేశాడు. అంతటితో అతని శక్తి క్షీణించిపోయింది.

చాపచుట్టలా చుట్టుకుపోయి నేలమీద ఎగిరెగిరి పడుతున్నాడు.

అతని కేకలు విని అప్పుడే బంగ్లా బయటకు వచ్చారంతా...

కళ్ళెదురుగా కనిపిస్తున్న భీకర దృశ్యాన్ని చూస్తూ చేష్టలుదక్కి నిలబడిపోయారు. వాళ్ల శరీరాలు గజగజ లాడిపోసాగాయి.

నిలువెత్తున లేస్తున్న మంటల్లో చంద్రం శరీరం కాలిపోతోంది.

అతని ప్రాణాలు ఎప్పుడైతే అతన్ని వీడాయో అప్పుడే కేకలు కూడా ఆగిపోయాయి.

దహన కాండ...

బ్రతికున్న మనిషి కాలడం...

సజీవ దహనం...

చర్మం కాలి కమురు కంపు కొడుతోంది.

పొగలు సుళ్ళు తిరుగుతూ పైకి లేస్తున్నాయి. కాలుతున్న ఎముకలు భీతావహంగా వున్నాయి.

ఎముకల్ని అంటుకున్న చర్మం ఉడిగిపోతోంది...

నాల్కలు చాస్తూ లేస్తున్న మంటలతోపాటు చంద్రం శవం పైకి లేస్తూ పడుతోంది...

కనుగుడ్లు రెండూ పేలిపోయాయి పెద్ద శబ్దం చేస్తూ...

వెంట్రుకలు రెపరెపలాడుతూ కాలిపోగా అసహ్యంగా వున్న గుండు చరచరమని అంటుకుంది.

తుంటి దగ్గర ఎముక అసహ్యంగా పొడుచుకు వచ్చింది.

చంద్రం శరీరంలోని క్రొవ్వు పదార్థాలు అదోరకమైన సవ్వడిని చేస్తున్నాయి...

హెల్...

ఆ దృశ్యం..

భీకరం...

బీభత్సం..

భయానకం...

ఆడవాళ్ళు భీతితో కెవ్వు కెవ్వున కేకలు వేయసాగారు.

వెంటనే మగవాళ్ళు వాళ్ళని లోపలికి తీసుకువెళ్ళి సోఫాల్లో కూర్చోబెట్టారు.

అందరి కళ్ళవెంట కన్నీళ్ళు జలజలా జారసాగాయి...

మనిషన్నవాడెవడూ ఆ భీకర దృశ్యాన్ని చూడలేడు.. చూసి భరించనూ లేడు.

అంతా అరగంటసేపు బాధాజగత్తులో లీనమైపోయారు.

బయట కాలుతున్న చంద్రం శవం చివరిదశలో వుంది.

ఎవరికి వారే మాటలు రాని బొమ్మల్లా కూర్చుండిపోయారు...

చివరిదశలో వున్న చంద్రం శవం తాలూకు కాలీకాలని కొన్ని అవయవాలను అవతలకి తరలించడానికి బయటికి వెళ్ళాడు సోములు.

మరో అరగంట వరకూ ఎవరూ కోలుకోలేకపోయారు.

మంగతాయారు ఇచ్చిన మంచినీళ్ళు వాళ్ళకు చేదుగా అనిపించాయి.

''ఎలా జరిగివుంటుందీ దారుణం'' చివరికి అనగలిగాడా మాట గిరిధర్.

‘‘ఏముంది. పెట్రోలు మాయం చేసిన దెయ్యాలే అదే పెట్రోలు పోసి చంద్రంని దహనం చేసి వుంటాయి’’

‘‘అంటే సిటీ నుంచి పెట్రోల్ తేవడం వాటికి ఇష్టం లేదన్నమాట’’ అన్నాడు కోటిలింగం.

‘‘ఏది ఎలా జరిగితేనేం... చంద్రం దారుణంగా చనిపోయాడు. అటువంటి చావు పగవారికి కూడా వద్దు’’ అన్నాడు అంజన్.

‘‘అంటే మనకు కావాలనా?’’ అర్థం కాక అడిగాడు రవి.

శంకర్ అన్నాడు ‘‘రవీ.. అశుభం మాటలు ఇకముందు పలకవద్దు’’

‘‘ఇంతకీ ఇక్కడినుంచి బయటపడే వీలు లేదా?’’ ప్రశ్నించింది పేరమాంబ.

‘‘ఆ వీలు కోసమే చంద్రాన్ని పంపిస్తే దెయ్యాలు చంపేశాయి.. ఇక సిటీకి ఎవరు పోతారు?’’ అన్నాడు కిశోర్.

ఎవరూ మాట్లాడలేదు.

‘‘ఇప్పటికే చాలా ఆలస్యమైంది. ఇక పడుకోండి. ఉదయం మాట్లాడుకుందాం’’ అన్నాడు గిరిధర్ పైకిలేచి.

‘‘నిద్ర రాదు’’ అంది మీనాక్షి.

‘‘నిద్ర రాదని జపం చేస్తూ కూర్చోలేం కదా! అంతా తలుపులు బిగించుకుని పడుకోండి’’ ముందుకి కదిలాడు గిరిధర్.

అయిష్టంగానే అంతా అక్కడినుంచి కదిలారు...

* * *

పర్..పర్..మని వికృత శబ్దాలు చేస్తూ యమ సీరియస్‌గా పళ్ళు నూరేస్తోంది ప్రీతి. నిద్దట్లో పళ్ళు నూరే అలవాటు ఆమె చిన్నతనం నుండీ వుంది.

అర్థగంట నుంచి ఆమె పళ్ళు చేస్తున్న వికృత శబ్దాలను విని భరించలేక, వినడం వల్ల నిద్ర పట్టి చావక అటు ఇటు మంచం మీద దొర్లుతూ యమ యాతన పడిపోతున్నాడు శంకర్.

మరో ఐదు నిముషాలు ఓపికపట్టి ఇక భరించలేకపోయాడు... పెళ్ళాన్ని తట్టిలేపాడు.

‘‘ఒసే ప్రీతీ.. మీ నాన్న నీకా పేరు ఎందుకు పెట్టాడో నాకు తెలియదుగాని, నాకు మాత్రం నరకంలా వుంది. ప్రతిరోజూ యిలా పళ్ళు నూరుతూ చంపకపోతే ఒకేసారి పీక నులిమి చంపేయరాదూ’’ అన్నాడు ఇబ్బంది పడిపోతూ.

అతనన్న ఆ మాటలే మరికొన్ని నిముషాల్లో నిజం కాబోతున్నాయని అతనికి తెలిసేదెలా...!!!

శంకర్ మాటలకు వెక్కి వెక్కి ఏడవసాగింది ప్రీతి.

"అమ్మా.. తల్లీ.. బుద్ధి తక్కువై ఏదో వాగాను. ఊరుకో... అబ్బ ఊరుకోమంటే... ఏదో సరదాకి అన్నాను. నిన్ను ఊరుకోబెట్టేసరికి నా ప్రాణం పోయేలా వుంది" అంటూ శంకర్ కామ్ అయిపోయాడు.

మరు నిముషంలో ప్రీతి ఏడుపు ఆపేసి అటు తిరిగి పడుకుంది.

"ఇక్కడ ఉక్కపోతగా వుంది. నేను బయట హాల్లో పడుకుంటాను. తలుపేసుకో" ఆమె జవాబుకై ఎదురుచూడకుండా చాప, దుప్పటి, దిండు తీసుకున్నాడు.

"ఏమండీ... పొద్దున్న చెబుదాంలే అని ఊరుకున్నాను. సాయంత్రం జలజ చెప్పిన విషయం చెప్పనా" అంది ప్రీతి.

"ఏమిటది?" ఆగి అడిగాడు శంకర్.

"మీరు లలితకు, కిశోర్‌కి పెళ్ళి చేద్దామనుకుంటున్నారు. కాని లలిత అంజన్‌ని ప్రేమించిందిట. ఈ విషయం జలజ చెప్పింది"

"అది జరగని పని. కిశోర్‌కి నేను మాట యిచ్చాను. నువ్వు నిర్భయంగా ఉండు. లలిత, కిశోర్‌ల పెళ్ళి జరిగి తీరుతుంది" అప్పుడే మేడ మెట్లు ఎక్కుతున్న అంజన్ చెవిలో పడ్డాయి ఆ మాటలు.

నవ్వుకుంటూ తన రూంలోకి వెళ్ళిపోయాడు.

# 9

టంగ్.. టంగ్.. మని గోడ గడియారం పదకొండు గంటలు కొట్టింది.

నిండా ముసుగుతో కళ్ళు, ముక్కురంధ్రాలు మాత్రమే కనిపిస్తున్న ముసుగు ఆకారం... ఆగంతకుడు రబ్బరుబూట్లు శబ్దం కాకుండా నడుస్తూ హాలులో హాయిగా నిద్రపోతున్న శంకర్ దగ్గిరకు వచ్చాడు.

చుట్టూ ఓమారు పరికించి చూసి, మెట్లకు ఓ పక్కగా మూల ముసుగుతన్ని నిద్రిస్తున్న సోముల్ని చూసి తల పంకించి, జేబులోంచి నైలాన్ తాడు తీశాడు.

టిక్.. టిక్... మనే సెకన్ల ముల్లు చేసే శబ్దం తప్ప అంతటా నిశ్శబ్దం...

బ్లాక్ గ్లోవ్స్ వున్న రెండు చేతులకు కొంత తాడు చుట్టుకుని, మిగిలిన భాగాన్ని శంకర్ మెడకు ఒక రౌండు తిప్పి, బలంగా చేతి పట్టును బిగించసాగాడు.

శంకర్ తృళ్ళిపడి కళ్ళు తెరచి ఆగంతకుడ్ని చూసి హడలిపోయాడు.

అతని చేతుల్ని తోసివేయడానికి ప్రయత్నించాడు. కాని అతని ప్రయత్నం ఫలించలేదు. ఆగంతకుడి బలం ముందు శంకర్ బలం పనిచెయ్యలేదు.

కాళ్ళు టపటపమని కొట్టుకోసాగాడు... ఊపిరి స్తంభించిపోతోంది...

అరిచే వీలులేదు...

కనుగుడ్లు వెళ్ళుకువచ్చేలా వున్నాయి...

ఆయాసం ఎగదన్నుకు వస్తున్నది...

నాలుక పళ్ళమధ్య యిరుక్కుంది...

యమయాతన అనుభవిస్తున్నాడు శంకర్...

నరకం...

చివరికి... తన అపజయాన్ని అంగీకరించకుండా చివరివరకూ ఆగంతకునితో పెనుగులాడుతూనే... మృత్యువు కౌగిట్లో... కాదు, మృత్యువుకు ప్రతిరూపమైన ఆగంతకుని ఒడిలో వాలిపోయాడు శంకర్.

అంతవరకూ అక్కడ జరిగిన భీకర హత్యా తాలూకు దృశ్యం అంతా, కొంతదూరంలో టేబుల్‌పై వుంచిన మినీ చార్జ్‌డ్ వీడియో కెమేరాలో ఎక్కిపోయింది.

నైలాన్ తాడుని ముద్దు పెట్టుకుని బాక్ పాకెట్‌లో దోపుకుని వీడియో కెమేరా బటన్ ఆఫ్ చేసాడు ఆగంతకుడు.

చేయవలసిన మరికొన్ని పనులను చకచక చెయ్యసాగాడు.

* * *

తెల తెల వారుతూండగా మేలుకున్నాడు సోములు.

కళ్ళు తెరవకుండా కూర్చుని వాడి ఇష్టదేవతను జపించుకుని పైకి లేచి పక్కబట్టలు చుట్టచుట్టి, మెట్ల కింది భాగంలోకి తోసి, వెనుతిరిగి శిలావిగ్రహంలా బిగుసుకుపోయాడు.

క్షణం తర్వాత తేరుకుని కెవ్వుమని అరిచాడు బిగ్గరగా....

అతని కేక విని యింకా నిద్రపోతున్న అందరూ నిద్ర మేల్కొని బయటకు వచ్చి చూసి అదిరిపోయారు.

అంత భీతావహంగా వుందా దృశ్యం...

భయానకం...

హాల్లో అందానికి అమర్చిన షాండ్లియర్స్‌కి వ్రేలాడుతోంది ఉరిత్రాడు. దానికి

బిగించబడి వ్రేలాడుతున్నాడు శంకర్.

అతని రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. నిర్జీవంగా, నిర్వికారంగా వుందా శవం...

అది చూసి తట్టుకోలేని ప్రీతి కట్టెలా విరుచుకుపడిపోయింది.

లలిత "అన్నయ్యా..." అంటూ హృదయ విదారకంగా ఏడుస్తోంది.

మిగిలిన ఆడవాళ్ల కళ్ళల్లోంచి కన్నీళ్ళు ధారాపాతంగా ప్రవహించసాగాయి.

మీనాక్షి, పేరమాంబ, ప్రీతికి స్పృహ తెప్పించే ఏర్పాట్లలో వున్నారు.

అంజన్ టేబుల్ జరుపుకుని పైకెక్కి చాకుతో ఉరితాడు కోసాడు.

శవాన్ని అందుకుని కిందకు దించారు గిరిధర్, మదన్, కిశోర్‌లు.

"ఇది ఆత్మహత్య కాదు" అన్నాడు కోటిలింగం.

"ఎలా చెప్పగలరు?" కిశోర్ ప్రశ్న.

"కింద ఆధారం లేకుండా తలకు ఉరి ఎలా బిగించుకుంటాడు. మరో విషయం.. శవం బాగా ఎత్తులో వుంది" చెప్పాడు కోటిలింగం.

"అవును, ఇది ఆత్మహత్య కాదు.. హత్య" అన్నాడు మదన్, పీక వద్ద తాడు విప్పి.

"యూ ఆర్ కరెక్ట్... శవాన్ని వ్రేలాడదీయడం కోసం మాత్రమే లూజుముడి వేసాడు హంతకుడు" అన్నాడు అంజన్.

"హంతకుడు కాదు. ఇది ఖచ్చితంగా దెయ్యం పనే అయివుంటుంది" అన్నాడు రవి భయంగా.

అప్పుడే స్పృహలోకి వచ్చిన ప్రీతి శవంపై పడి గొల్లుమని ఏడవసాగింది.

ఆమెను ఓదార్చడం ఎవరికీ చేతకాలేదు.

కోటిలింగం చేసైగ అందుకుని మీనాక్షి, పేరమాంబ, జలజ- ఆమెను మేడపైకి బలవంతంగా లాక్కుపోయారు.

లలితను కోటిలింగం తీసుకువెళ్ళాడు.

అల్లుడు పోయాడనే బాధ అతని మనసుని వేధించుకు తినేస్తుంది. అతన్ని ఎవరు ఓదారుస్తారు. లలిత ఆడది కనుక పైకి ఏడవగలుగుతోంది. కోటిలింగం పైకి ఏడవలేక మనసులోనే కుమిలిపోతున్నాడు.

ఏం చెయ్యాలో తోచక శవం పక్కనే చతికిలపడ్డారు గిరిధర్, అంజన్, కిశోర్, రవి, మదన్‌లు.

సోములు చెప్పడం వల్ల రామదాసు వచ్చి కొంచెంసేపు ఏడ్చి వెళ్ళిపోయాడు.

‘‘ఇప్పుడీ శవాన్ని ఏం చెయ్యాలి?’’ అయోమయంగా అడిగాడు గిరిధర్.

‘‘దహనం చెయ్యడం మంచిది’’ అన్నాడు కిశోర్.

‘‘కాదు. పాతిపెట్టడం మంచిది’’ అన్నాడు రవి.

‘‘మీరొక విషయం మర్చిపోతున్నారు. ఇది హత్య... మనమెవ్వరం ముట్టుకోకుండా పోలీసులకు అప్పజెప్పడం మంచిది’’ అన్నాడు మదన్.

‘‘మనం బయటపడే మార్గమే కనబడటంలేదు. ఇక ఈ శవాన్ని పోలీసులకు ఎలా అప్పగిస్తాం’’ అడిగాడు గిరిధర్.

‘‘మనం బయట పడినప్పుడే’’

‘‘అంతవరకూ శవాన్ని ఎలా వుంచుతాం. కుళ్ళిపోయి వాసన రాదూ!’’

‘‘వస్తుంది. ఇక్కడ వుంచడం కాదు. భవనం వెనుక ఒక పెంకుటిల్లు ఖాళీగా వుందికదా! ఆ ఇంట్లో వుంచితే సరి’’ అన్నాడు అంజన్.

మేడ దిగి వచ్చిన కోటిలింగంకి కూడా ఆ సలహా నచ్చింది.

‘‘సరే.. మీరంతా చెబుతుంటే నేను కాదనేదేముంది. అలాగే చెయ్యండి’’ అన్నాడు బాధను అణుచుకుంటూ.

శంకర్ మృతదేహాన్ని భుజం మీదకు ఎత్తుకున్నాడు అంజన్.

* * *

ఆరోజు సాయంత్రం అయిదు గంటలకి తోటలో కలుసుకున్నారు అంజన్, లలితలు.

‘‘అంజూ... ఈ మారణకాండకంతా మూలకారకురాల్ని నేనే. ఆరోజు నా ప్రేరేపణ వల్లే కదా మనమంతా బయలుదేరాం’’ అంది లలిత. నాలుగు లంకణాలు చేసినట్టు ఆమె కళ్ళు లోతుకుపోయాయి.

‘‘అసలు కారకురాలివి నువ్వు కానేకాదు. మనం వెళ్ళేసరికే మీ వాళ్ళంతా యిక్కడికి రావడానికి సన్నాహాలు చేస్తున్నారుకదా!’’ చెప్పాడు అంజన్.

‘‘అయినాసరే.. నా మనసు ఎందుకో అదే పనిగా పీడిస్తోంది’’

‘‘లల్లీ.. ప్లీజ్.. ఎటువంటి ఆలోచనలు పెట్టుకోవద్దు. గుండె దిటవు చేసుకో..’’

‘‘అంతకంటే చేయగలిగింది యింకేముందిలే... తల్లిదండ్రులతోపాటు అన్నను పోగొట్టుకున్నాను’’

‘‘అదుగో మళ్ళీ.. ఆ విషయం యిక యింతటితో మర్చిపో... యిప్పటికే

ఆలస్యమైంది. పదపోదాం''

ఇద్దరూ పైకి లేచి బంగ్లా వైపు సాగిపోయారు.

అదే సమయంలో చెట్టుచాటు నుంచి వచ్చిందో ఆకారం. ఆ ఆకారం జలజది.

క్రూరంగా నవ్వుకుని ముందుకు కదిలింది ఆమె..!

# 10

తెల్లబట్టల్లో ప్రీతిని ఆ స్థితిలో చూస్తే గుండె తరుక్కుపోతోంది.

మధ్యాహ్నం భోంచెయ్యని కారణంగా ఆమె మొహం పీక్కుపోయి వుంది. ఆమె వద్దంటున్నాసరే బలవంతంగా భోజనం తినిపించింది పేరమాంబ.

ఎనిమిది గంటల లోపులోనే అంతా భోజనాలు ముగించి పడుకున్నారు.

అంజన్, మదన్, వాళ్ళరూంలో రహస్యంగా మాట్లాడుకుంటున్నారు.

''బ్రదర్.. నిన్న రాత్రి ఎందుకో మెలుకువ వచ్చింది. లేచి మంచినీళ్ళు తాగి కిటికీలోంచి కాజువల్‌గా చూశాను. పూర్తిగా ముసుగు ధరించిన ఒక ఆకారం గారేజ్‌లోంచి ఇంపాలా తీసి డ్రైవ్ చేసుకుంటూ పోవడం నేను చూశాను. ప్రొద్దుటినుంచి చెబుదామనుకుంటున్నాను. వీలుపడలేదు'' చెప్పాడు మదన్.

''ఆ ఆకారం ఎవరిదో చెప్పలేవా?''

''చెప్పలేను''

''నువ్వు ఆకారాన్ని చూసేసరికి కేకలు, ఆర్తనాదాలు వినిపిస్తున్నాయా?''

''లేదు. అప్పటికి ఆగిపోయాయి''

''పోనీ దెయ్యం ఏడుపు, నవ్వు, గజ్జెల గలగలలు వినిపిస్తున్నాయా?''

''లేదు''

''వెరీగుడ్... టైమెంత అయింది''

''పదకొండు గంటల పది నిముషాలు''

అయితే వెంటనే వెళ్ళి గారేజ్‌లో ఇంపాలా మీటర్ రీడింగ్ చెక్ చేసిరా'' అన్నాడు అంజన్- సిగరెట్ వెలిగించి పొగ రింగు రింగులుగా వదులుతూ.

తలుపు వారగా తెరచి బయటకు వచ్చాడు మదన్. ఎవరూ లేరని నిశ్చయించుకుని మెల్లగా మేడమెట్లు దిగాడు.

మెట్లు పక్కగా ముందుకు నడిచి దొడ్డిగుమ్మం తెరచి బయటపడి గారేజ్‌ను

చేరుకున్నాడు.

అటూ ఇటూ చూసి జేబులోంచి మారుతాళం చెవులు తీసి ప్రయత్నించసాగాడు. నిముషంలో అతని ప్రయత్నం ఫలించి తాళం తెరుచుకుంది.

గారేజ్‌లో దూరి తలుపు దగ్గరకు లాగి టార్చి వెలిగించాడు.

మొట్టమొదట వున్న కారు ఇంపాలాయే...

బయటకి వెళ్ళడానికి వీలుగా అక్కడ వుందని గ్రహించాడు మదన్.

ఫ్రంట్ డోర్ తెరచి మీటర్ పై టార్చి వేసి పరిశీలించి ఆ నెంబర్ గుర్తుపెట్టుకుని, యధాతథంగా గారేజ్‌ను మూసి తాళం వేసి దొడ్డిగుమ్మం లోంచి లోపలకు వెళ్ళబోయి, మెరుపులా ఆగి అలాగే గోడకు కరచుకుని వుండిపోయాడు.

కనుచివరల నుంచి లోపలికి చూసాడు.

మీనాక్షి ఒక ఖాళీ గదిలో దూరి తల బయటకు పెట్టి ఎవరికో సైగ చేస్తోంది. మరో క్షణం తర్వాత ఆమె వద్దకు వచ్చాడు కిశోర్.

ఇద్దరూ కలసి లోపలకు దూరి తలుపులు గడియలు పెట్టుకున్నారు.

మదన్ మొహం నిండా చెమటల్లు పట్టేశాయి. వీళ్ళిద్దరి మధ్య వున్న సంబంధం ఏమిటి? ఎందుకా ఖాళీ గదిలో దూరారు? ఇంత రాత్రివేళ కలుసుకోవలసిన అవసరం వాళ్ళకేం వచ్చింది? ఈ గూడుపుఠాణి ఏమిటి? తనిప్పుడు లోపలికెలా వెళ్ళడం? తను లోపలికెళ్ళేలోగా వాళ్ళు బయటకు వచ్చేస్తేనో! ఏం చెయ్యాలి? వీళ్ళ రహస్యం కూడా శోధించాలా?... రకరకాలుగా వేధిస్తున్న ప్రశ్నలను పక్కకు నెట్టేసి లోపలికి కదిలాడు మదన్.

వాళ్ళిద్దరూ దూరిన గది ముందు చేరి, చుట్టూ ఓమారు పరికించాడు. ఎవరూ వస్తున్న జాడలేదని నిశ్చయించుకుని తలుపుల పక్కనే వున్న కిటికీ రెక్క ఓరగా తోసి, లోపలికి తొంగిచూసాడు- నిశ్శబ్దంగా.

మీనాక్షి, కిశోర్‌లు పూర్తి నగ్నంగా ఒకరి కౌగిట్లో ఒకరు యిరుక్కుపోయి.. పరిసరాలను పూర్తిగా మర్చిపోయి.. గచ్చు నేలనే పూల పందిరిగా భావిస్తూ.. స్వర్గపుటంచుల్లో తేలియాడుతూ.. ఒకరి ఆవేశాలను మరొకరు; ఒకరి ఆనందాన్ని మరొకరు పంచుకుంటూ.. తీవ్రంగా కష్టపడుతున్నారు.

వాళ్ళిద్దరి బట్టలు ఒక పక్కగా పడి వున్నాయి- కుప్పగా.

ఇక చూడలేక కిటికీ రెక్క దగ్గరకు లాగేసి గబగబా మేడ ఎక్కి రూంలోకి దూరి తలుపులు గడియవేసాడు మదన్.

మీటర్ రీడింగ్ చెప్పాడు మదన్.

"వాట్! సరిగ్గా చూసావా?" అడిగాడు అంజన్. తల వూపాడు మదన్.

"నిన్న రాత్రి ముసుగు ఆకారాన్ని చూడటం; కారు తీసుకెళ్ళడం నిజమేనా?"

"అవును. ఎందుకా అనుమానం?" బుర్ర గోక్కుని అడిగాడు మదన్.

"మనమీ బంగ్లాకి వచ్చేటప్పుడు ఇంపాలా నేనే డ్రైవ్ చేసాను కదా!.. ఇక్కడికి వచ్చిన తర్వాత మీటర్ రీడింగ్ అనుకోకుండా చూసాను. నువ్విప్పుడు చెప్పిన రీడింగ్ కూడా అదే... అంటే హంతకుడు చాలా తెలివైనవాడు, ముందుచూపు గల వ్యక్తన్నమాట. ఎవరికీ అనుమానం రాకుండా, కారు ఎక్కడికీ కదలనట్టు కనిపించాలని మీటర్‌ని డిస్‌కనెక్ట్ చేసి డ్రైవ్ చేస్తున్నాడు. తిరిగి వచ్చి యథాతథంగా బిగిస్తూ వుండవచ్చు"

"హంతకుడు అతి తెలివి ప్రదర్శించాడన్నమాట... అయితే ఎప్పుడో ఒకప్పుడు తనకు తనే తప్పటడుగు వేసి పప్పులో కాలువేస్తాడు. అప్పుడు పట్టుబడిపోతాడు. అతి తెలివి ఎన్నటికైనా ముప్పే..."

"పొరపాటు... హంతకుడు తప్పటడుగు ఎప్పుడు వేస్తాడా అని మనం వేచి వుంటామా! అతని జాడలు పసిగట్టి వల పన్ని మనమే బంధించాలి"

"ఇంతకీ హంతకుడు ఎవరై వుంటారు?"

"బావుంది నీ ప్రశ్న... అది అర్థం కాకే కదా బుర్రలు బ్రద్దలు కొట్టుకుంటున్నా... హంతకుడెవరో తెలిస్తే ఈ చిక్కులన్నీ ఎందుకు? హంతకుడెవరో నాకెలా తెలుస్తుంది?... ఎవరో ఆ ఆగంతకుడు?!" సాలోచనగా అన్నాడు అంజన్.

"మరో ముఖ్యమైన విషయం" అంటూ తను చూసిన దృశ్యం వివరాలు చెప్పాడు మదన్.

సన్నగా ఈల వేసాడు అప్రయత్నంగా అంజన్.

"అలాగా... అయితే మరో కొత్త విషయం బయటపడింది, మన ఆలోచనలను సవ్యమైన మార్గంలో పెట్టడానికి"

"కిశోర్ ఈ హత్యలకు మూలకారకుడేమోనని నా అనుమానం" అన్నాడు మదన్.

"అనుమానించడంలో తప్పులేదు. కాని దీనికి సరైన ఆధారం చిక్కాలి కదా!... ఆగంతకుడు, కిశోర్ అని చెప్పడానికి తగిన ఆధారం.. క్లూ దొరకాలి.. మధూ.. నువ్వొక పని చెయ్యి. నువ్వు ఇంపాలా డిక్కీలో దాక్కో... నేను గారేజ్ తాళం వేసేస్తాను. ఆగంతకుడు ఏదో సమయంలో ఈ రాత్రి కూడా కారు తీసుకు వెళ్ళచ్చు. ఎక్కడికి వెళ్ళేదీ నువ్వు తెలుసుకో..." చెప్పాడు అంజన్.

"వెరీగుడ్ ఐడియా... మరి నువ్వేం చేస్తావ్?"

“మీనాక్షి, కిశోర్‌లు దూరిన రూంవద్ద కాపు కాసి, ఆగంతకుడు కిశోర్ అవునో కాదో తెలుసుకుంటాను”

“అలాగే...” అన్నాడు మదన్ హుషారుగా.

ఇద్దరూ గారేజ్‌ను చేరుకున్నారు.

అంజన్ తాళం తెరిచాడు...

మదన్ డిక్కీలో కూర్చున్నాడు.

“జాగ్రత్త... గారేజ్ తెరుస్తున్న శబ్దం వినిపించగానే డిక్కీ తలుపు మూసుకో” హెచ్చరించి గారేజ్‌కి తాళం వేసి లోపలికి వచ్చాడు అంజన్.

ఇద్దరు కాముకులూ దూరిన గది ఎదురుగా వున్న మరో ఖాళీ గదిలో దూరి కిటికీ వారగా ఎదుటి రూముపై దృష్టి నిలిపాడు అంజన్.

సరిగ్గా అప్పుడే...

* * *

గోడ గడియారం టంగ్.. టంగ్..మని పన్నెండు గంటలు కొట్టసాగింది. ఆఖరి గంట కొట్టీ కొట్టకముందే ప్రారంభమయ్యాయి భీకర ఆర్తనాదాలు, అరుపులు, కేకలు, పెడబొబ్బలు... భీతి గొలిపేలా, ఒళ్ళు జలదరించేలా వినిపిస్తున్నాయి.

అప్పటికే రాసకేళిలో పూర్తిగా మునిగివున్న మీనాక్షి, కిశోర్‌లు ఉలిక్కిపడి ఒకరి నుంచి మరొకరు విడిపోయారు.

మీనాక్షి పతివ్రత ఏమీకాదు. గిరిధర్‌తో పెళ్లి కాకముందే ఒక యువకుడితో కామకేళీ విలాసాల్లో మునిగి తేలడం వల్ల వచ్చిన కడుపును, అతి సునాయాసంగా అబార్షన్ చేయించుకుంది.

అదే క్షణంలో...

ఆ పక్క రూంలో...

కిరకిరమని శబ్దం చేస్తూ మెల్లగా పైకి లేచింది- గది మధ్య నేలమీద ఒక చెక్కపలక... ఐదడుగులు పొడవు, వెడల్పు గల స్క్వేర్ ఆకారంలో వుందది.

దాని అడుగు నుంచి... నేలమాళిగ నుంచి, చెక్కపలకను శబ్దం కాకుండా వెనక్కి జారవిడిచి పైకి వచ్చాడు ఆగంతకుడు.

ఆ గదికి బయట ఎప్పుడూ తాళం వుంటుంది. అది తెరవకూడదు. అది రంగనాథవర్మగారి ఆజ్ఞ. ఆయన ఆజ్ఞ ప్రకారమే ఇంతవరకూ ఆ గది తెరవలేదు.

గది లోపల ఆ కారణంగా దుమ్ము, ధూళి నిండివుంది. అక్కడక్కడ బూజులు పట్టాయి. సాలిపురుగులు గూళ్ళు ఏర్పరచుకున్నాయి.

కిటికీ రెక్కను వారగా తెరచి బయటికి పరికించి చూశాడు ఆగంతకుడు. అతని నిశిత నేత్రాల నుంచి ఏదీ దాటిపోలేదు. అలాగే అంజన్ అతని కళ్ళను దాటిపోలేదు. ఆ వెంటనే రెక్కమూసి వెనుతిరిగాడు.

అదే సమయంలో ఆగంతకునికి పక్క రూంలోంచి మాటలు వినిపించసాగాయి.

గదికీ గదికీ మధ్య తలుపులు వుండే ఏర్పాటు ఆ బంగ్లాలో వుంది. అందువల్ల తలుపుల సందులోంచి మాటలు వినిపిస్తున్నాయి.

తలుపుల సందువద్ద చెవి ఆనించి అవతలి మాటలు వినసాగాడు ఆగంతకుడు.

''కిశోర్...'' పిలిచింది మత్తుగా మీనాక్షి.

''ఏమిటి మీనా బేబీ...'' మరింత మత్తుగా జవాబిచ్చాడు కిశోర్.

''నువ్వు తియ్యగా మాట్లాడతావు''

''నువ్వు అందంగా వుంటావు''

''అవునుగానీ... మనకి రోజూ ఈ అరుపులు, కేకలు ఏమిటి? వీటివల్ల మనం భయపడుతూ కలుసుకోవలసి వస్తోంది''

''అవును. కానీ ఏం చెయ్యలేంగా...''

''ఎందుకు చెయ్యలేం.. ప్రస్తుతం ఈ పని చెయ్! కమాన్.. డూయిట్ ఐసే..'' మత్తుగా చూస్తూ అతనికి సహకరించింది మీనాక్షి.

మీనాక్షి దృష్టిలో శీలానికి విలువ లేదు. ఎందుకంటే ఎంతో విచ్చలవిడితనాన్ని అలవరచుకుంది గనుక...!

ఆవేశపడుతున్నాడు కిశోర్. అతని ఆవేశాన్ని మరింతగా రెచ్చగొడుతూ మూల్గుతోంది.. మత్తుగా, తీయగా మూల్గుతోంది మీనాక్షి.

''కిశోర్..''

''ఆఁ..''

''నువ్వంటే నాకిష్టం''

''నువ్వంటే నాకు మరీ ఇష్టం''

''మనల్ని ఎవరూ విడదీయలేరు''

''అవును''

మరికొంత సేపటికి ఆవేశాన్ని ఆపుకుంటూ ఆమెపై వాలిపోయాడు కిశోర్. మీనాక్షి తృప్తిగా నిట్టూర్చింది.

నిముషం తర్వాత ఇద్దరూ పైకి లేచి బట్టలు వేసుకున్నారు.

మీనాక్షి పెదవులపై గాఢంగా చుంబించాడు కిశోర్.

"నేను ముందు వెళ్తాను. నువ్వు తర్వాత రా" అని బయటికి వచ్చి- ఎవరూ లేరని గ్రహించి ఒక రూందాటి- ఆ పక్కరూంలో దూరి తలుపులు బిగించింది ఆమె.

అంతా విన్న ఆగంతకుడు క్రూరంగా నవ్వుకున్నాడు.

అతని పెదవుల కదలిక, మొహాన్ని కవర్ చేసిన మాస్క్ చాటున కప్పబడిపోవడం వల్ల తెలిసే వీలులేదు.

రెండు నిముషాలు కామ్‌గా కూర్చుని, ఇక వెళ్దామని పైకి లేచాడు కిశోర్.

అదే సమయంలో మధ్యతలుపులు తెరచి లోపలికి అడుగుపెట్టిన ఆగంతకుణ్ణి చూసి బిగుసుకుపోయాడు కిశోర్.

అతని గుండెలు గుబగుబలాడాయి.

చేతులు వణుకుతున్నాయి.

శంకర్‌ని చంపిన హంతకుడు ఇతనే అయివుంటాడని అనుకున్న తర్వాత కిశోర్ కాళ్ళు ఆడడం మానేసాయి.

మొహాన్నంటిన చెమటను అరచేత్తో తుడుచుకుంటూ, తడబడిన గొంతుతో "ఏ.. ఎ.. ఎవరు నువ్వు?" అనగలిగాడు.

జవాబు నోటితో చెప్పలేదు ఆగంతకుడు.

గభాల్న ముందుకు దూకి కిశోర్ నోరు నొక్కేసాడు.

అతను భయంతో పెనుగులాడుతున్నాడు..

అయినా విడిచిపెట్టలేదు. అతనిది ఉడుంపట్టు.

కాలును పైకెత్తి, మోకాలు కిందకి వున్న జిప్పర్ తెరిచాడు ఆగంతకుడు. అతని చేతిలోకి తళతళ లాడుతున్న పన్నెండు అంగుళాల- పొడవైన, పదునైన కత్తి వచ్చింది.

దాన్ని చూసి బెదిరిపోయిన కిశోర్ మరింతగా పెనుగులాడుతున్నాడు. అయినా లాభం లేకపోయింది.

కత్తి పైకెత్తి సరాసరి అతని గుండెల్లో దించేసాడు ఆగంతకుడు.

చిన్నకేక కూడా వెయ్యడానికి వీలులేక నిలువుగుడ్లు వేసి చూస్తూ నేలకు

జారిపోయాడు కిశోర్. అతని ప్రాణాలు అనంత వాయువుల్లో లీనమైపోయాయి.

ముందుకు వంగి అతని గుండెల్లో ఇరుక్కున్న కత్తిని బయటికి లాగి, దానికంటిన రక్తాన్ని కిశోర్ బట్టలకే తుడిచి శుభ్రంచేసి- దాన్ని మోకాలు కింద సీక్రెట్ పాకెట్‌లో వుంచి, జిప్పర్ లాగేసాడు ఆగంతకుడు.

మరొక్క క్షణం కూడా అక్కడ వుండకుండా పక్కరూంలో దూరి గడియవేసి- నేలమాళిగ.. అదే.. భూగృహంలో దూరిపోయాడా హంతకుడు.

* * *

సరిగ్గా అప్పుడే...

అరుపులు, కేకలు మొదలయ్యాయి.

వాటిని వింటూ కిటికీ వారగా నించుని చూడసాగాడు అంజన్.

సెకన్ల ముల్లు వేగంగా తిరుగుతోంది.

ఓపిగ్గా, సహనంతో ఎటూ కదలకుండా అలాగే నిలబడ్డాడతను.

మరికొంత సేపటికి తలుపు తెరుచుకుని బయటకు వచ్చింది మీనాక్షి. ఆమె తన రూంలోకి పోవడం గమనించాడు.

మరింత జాగ్రత్తగా చూడసాగాడు.

రెండు నిముషాలు గడిచాయి... కానీ కిశోర్ ఇంకా బయటికి రావడం లేదు. మరో పది నిముషాలు గడిచాయి.

సడెన్‌గా అరుపులు, ఆర్తనాదాలు ఆగిపోయాయి.

ఆశ్చర్యపోయాడు అంజన్. కానీ ఇసుమంత కూడా కదల్లేదు.

మరో పదినిముషాలు ఓపికతో చూశాడు. అప్పటికీ కిశోర్ బయటకు రావడంలేదు. వచ్చే సూచనలు కూడా కనిపించటంలేదు.

ఏమైపోయాడు? ఇంతసేపు లోపల ఏం చేస్తున్నాడు? అటునుంచి మరో మార్గం లేదే! ఏమైపోయాడు? ఏమీ నిశ్చయించుకోలేక మరో రెండు నిముషాలు గడిపి- ఏదో నిశ్చయంతో బయటికి వచ్చాడు అంజన్.

మెల్లగా లోపలకు నెట్టాడు తలుపు...

అదే సమయంలో హాలు ముఖద్వారం వైపు పోతున్న తెల్లని బట్టల్లోని ఆకారం కాళ్ళ గజ్జెల శబ్దం చేసుకుంటూ గాలిలో తేలుతున్నట్టుగా పోతోంది.

ఆ ఆకారాన్ని చూశాడు అంజన్. క్షణం ఏం చెయ్యాలో అతనికి తోచలేదు.

గదిలోకి పోవాలా? లేక ఆ ఆకారాన్ని వెంటాడాలా?

అతను ఏదీ నిశ్చయించుకోకముందే ఆకారం సింహద్వారం దాటింది.

తల పంకించి రూంలో ప్రవేశించి నోరు వెళ్ళబెట్టాడు అంజన్.

భీకరంగా వుంది, అస్తవ్యస్తంగా పడివున్న కిశోర్ శవం.

బట్టలు చెదిరిపోయి, తల రేగిపోయి, గుండెల వద్ద అయిన పెద్దగాయంలోంచి రక్తం కారుతూ నేలంతా రక్తప్రవాహంలా ఏర్పడి, భయానకంగా వుందా దృశ్యం...

'రిగర్ మార్టిస్' ఇంకా ప్రారంభం కాలేదని గ్రహించాడు అంజన్. రిగర్ మార్టిస్ అంటే... హత్య చెయ్యబడిన వ్యక్తి శరీరం నుంచి కారుతున్న రక్తం నిర్ణీత సమయం తరువాత గడ్డకడుతుంది. అలా రక్తం గడ్డకట్టడాన్నే రిగర్ మార్టిస్ అంటారు. ఆ సమయంలో రక్తనాళాలు బిర్ర బిగుసుకుపోతాయి.

రక్తం ఇంకా కారుతూనే వుంది. హత్య జరిగి ఎంతోసేపు కాలేదని గ్రహించాడు అంజన్. ఆ గదంతా నిశితంగా పరిశీలించాడు.

కానీ ఎటువంటి క్లూ అతనికి లభించలేదు. వెంటనే బయటకు వచ్చేసాడు.

అప్పుడు ప్రారంభమైంది తోపులో, గుండెలు జలదరించేటట్టు భీతిగొలిపే ఏడుపు...

ఆగిపోయాడు అంజన్.

ముసుగుతన్ని నిద్రిస్తున్న సోముల్ని కదిలించి చూసాడు. కాని లాభం లేకపోయింది. అతను లేచే స్థితిలో లేడు. చెవిలో శంఖం పెట్టి ఊదినా ఖచ్చితంగా లేవడు.

ఏడుపల్లా మారి నవ్వు వినబడసాగింది. విరగబడుతూ, పగలబడుతూ; తృళ్ళుతూ వినిపిస్తోంది పకపకమని నవ్వు.

అతని ప్రయత్నం లేకుండానే అంజన్ ఒళ్ళు జలదరించింది.

సరిగ్గా అదే సమయంలో వినిపించింది ఎవరిదో గావుకేక...!!!

# 11

కళ్లు మూసుకుని పడుకుందన్నమాటేగాని నిద్ర రావడంలేదు ప్రీతికి.

భర్త పోయిన బాధలో ఆమె సగమైపోయింది.

నిన్నటికి, యిప్పటికి- ఆమెలో ఎంత మార్పు!

కళ్ళు లోతుకుపోయి పీక్కుపోయిన మొహం- ఆమె వయస్సు మరో ఐదు సంవత్సరాలు పైబడ్డట్టు ఎత్తిచూపిస్తోంది.

నిన్నటి రాత్రి- తనకు, తన భర్తకు మధ్య జరిగిన సంభాషణను పదేపదే తలచుకుని ఏడుస్తోంది. నిశ్శబ్దంగా రోదిస్తోంది.

కళ్ళమ్మట ధారాపాతంగా కారుతున్న కన్నీళ్ళు తలగడను పూర్తిగా తడిపేసాయి.

తనవల్లే తన భర్త పోయాడనే ఆలోచనతో ఆమె మథనపడుతోంది.

తనెంత దురదృష్టవంతురాలు. తనకి నిద్దట్లో పళ్ళు నూరే జబ్బు లేకపోయినట్లయితే తన భర్త బ్రతికి వుండేవాడు.

తన వల్లనే తన భర్త చనిపోయాడు. తను నిజంగా చాలా దుర్మార్గురాలు. ఆయన నిద్ర చెడగొట్టడమే కాకుండా; ఏడుపుతో విసిగించడంవల్లే బయట పడుకుంటానన్నారు. తను చేసిన పొరపాటుకు తన భర్త బలైపోయాడు.

ఏవేవో పిచ్చి పిచ్చి ఊహలతో మనసును పాడుచేసుకుని సన్నగా రోదిస్తోంది ప్రీతి.

బయట అరుపులు, కేకలు వినిపిస్తున్నా పట్టించుకుని భయపడే స్థితిలో లేదామె. ఆమె జీవితానికో అర్థం, పరమార్థాన్ని తెచ్చిపెట్టే భర్తే పోయిన తర్వాత ఆమెనా కేకలు మాత్రం ఏం చేస్తాయి?!

ప్రీతికి ధైర్యంగా వుండటం కోసం ఆమె పక్కనే పడుకున్న లలిత ఆదమరచి నిద్రపోతోంది. ఆమెలో కూడా కొద్దిగా కళ తగ్గిందనే చెప్పాలి.

ఏదో శబ్దమై; ప్రీతి కళ్లు తెరిచి చూసింది.

ఎదురుగా గోడకు జారబడివున్న శంకర్ శవాన్ని ఆమె యింకా చూడలేదు.

ఏమీ లేదనుకుని కళ్ళు మూసుకుంది. నిముషం తర్వాత దుర్గంధం ఆమె ముక్కుపుటాలను సోకి ఉక్కిరిబిక్కిరి చేసింది.

ముక్కు చీదుతూ లేచి కూర్చుని.. అప్పుడు చూసింది, భూమిలో దిగేసిన నిట్రాటలా గోడకు జారబడివున్న భర్త శవాన్ని!

ఆమె శరీరం మొత్తం కంపించసాగింది. నిలువు గుడ్లేసుకుని భయంగా చూడసాగింది.

మహారాణీ కాలేజీ ఇంగ్లీషు లెక్చరర్ శివరామ్‌గారు చెప్పిన నిర్వచనం ఇక్కడ చెప్పక తప్పదు.

‘‘చూడండి.. మన పక్కన శవం వుందనుకోండి. దాన్ని చూసి ఎందుకోయ్ భయపడటం. అది మనల్ని ఏమీ చెయ్యదు, చెయ్యలేదు. అదే మన పక్కన నీచ బుద్ధిగల మానవుడు వున్నాడనుకోండి, వాడు మన పర్సు అన్నా దొంగిలిస్తాడు, లేకపోతే మన ప్రాణాలైనా తీసేసి చక్కాపోతాడు. అందువల్ల శవాలను చూసి

భయపడకూడదోయ్'' అనేవారాయన.

కాని యిక్కడ పరిస్థితి అలాకాదు. ఆ గాలిబంగ్లాలో ఎన్నో భయానక సంఘటనలు జరిగాయి, జరుగుతూనే వున్నాయి. కారణం తెలియదు. దెయ్యాలు చేసాయో, మనుషులే చేస్తున్నారో తెలియని సందిగ్ధావస్థకు లోనవుతూ అనుక్షణం ప్రాణభయంతో, ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని, ఎప్పుడు ఎవరి ప్రాణాలకు ముప్పు వస్తుందోననే భయంతో సతమతమవుతూ, క్షణమో యుగంలా గడుపుతున్న ప్రీతి మొదలగువాళ్ళు శవాన్నే కాదు, అదురుపాటుగా విన్న చిన్న శబ్దానికైనా భయపడతారనడంలో అతిశయోక్తి ఏమీలేదు.

ఇప్పుడు ప్రీతి పరిస్థితి కూడా అలాగే వుంది.

తేలవేసిన కనుగుడ్లతో తననే అదోరకంగా, భీకరంగా చూస్తున్నట్టున్న భర్త శవాన్ని చూసి కెవ్వుమని గావుకేక పెట్టింది ప్రీతి.

* * *

డిక్కీలో కిక్కురుమనకుండా కూర్చున్నాడు మదన్. డిక్కీ తెరిచే వుంచాడు.

అయినా ఒక్కటే ఉక్కపోతగా వుంది.

గేరేజ్ మూసివేయడం వల్ల లోపలంతా చీకటిగా వుంది.

పైనున్న వెంటిలేటర్ ద్వారా తప్ప మరేవిధంగానూ లోనికి గాలి వచ్చే వీలులేదు. ఆ వచ్చేగాలి కూడా అంతంత మాత్రంగానే వుంది.

పావుగంట కూడా గడిచిందో లేదోగాని అతని శరీరం చెమటతో తడిసి ముద్దయి పోయింది. బట్టలతో స్నానం చేసినట్టు తయారయ్యాడు మదన్.

మరో అరగంట నిశ్శబ్దంగా గడిచిపోయింది.

అసహనంగా ఎదురు చూస్తున్నాడు అతను. హంతకుడు ఈరోజు బయటకి పోడా? లేక తమ ఎత్తు గ్రహించి కారు తీసుకోవడానికి భయపడుతున్నాడా? ఎందుకీ ఆలస్యం? లేక ఎవరినైనా హత్య చేసే ప్రయత్నంలో వున్నాడా? ఇంకా ఎంతసేపు తనీ శిక్ష భరించాలి? తప్పుతుందా! ఇటువంటి వెధవ డిటెక్షన్ అంగీకరించిన తర్వాత ఏమనుకుని ప్రయోజనం లేదు...

అతనికి తెలియకుండానే మరో ముప్పావుగంట గడిచిపోయింది.

సరిగ్గా అదే సమయంలో బయట గేరేజ్ తాళం తీస్తున్న శబ్దం వినిపించింది.

మదన్ కంగారుగా డిక్కీ మూసుకున్నాడు. అతని గుండెలు దడదడలాడసాగాయి.

గర్..మని శబ్దం చేస్తూ తెరుచుకున్నాయి గేరేజ్ తలుపులు.

ఆగంతకుడు లోనికి ప్రవేశించాడు.

* * *

మేడమెట్లు ఎక్కబోతున్న అంజన్, కేక విని ఆ పని విరమించుకుని పక్కకు తిరిగాడు.

ప్రీతి చెయ్యి పట్టుకుని వేగంగా బయటకు వచ్చిన లలిత తలుపుగొళ్ళెం పెడుతూ కనిపించింది.

''లల్లీ... ఏం జరిగింది?'' ఆతృతగా ప్రశ్నించాడు.

''అన్నయ్య శవం గదిలో చూసిన వదిన కేక వేసింది. నాకు నిద్రాభంగమై నేనూ చూశాను. వెంటనే వదిన్ని బయటకు తీసుకొచ్చాను'' చెప్పింది లలిత.

ప్రీతి కళ్ళల్లో భయం తాలూకు భావాలు యింకా చెరిగిపోలేదు.

ఆ వెంటనే గొళ్ళెం తీసి గదిలో ప్రవేశించాడు అంజన్. రూమంతా గాలించి చూసాడు. అతని కళ్ళకు శంకర్ శవం కనిపించలేదు.

''లల్లీ.. ఇక్కడ ఏ శవం లేదు!'' అన్నాడు ఆశ్చర్యంగా.

''అంజూ...మా కళ్ళారా చూశాం. ఇంతలోకే ఎలా మాయమైంది!'' అనగలిగింది లలిత.

ప్రీతి పిచ్చిచూపులు చూడసాగింది తప్పితే మాట్లాడలేదు.

''ఐ బిలీవ్ యు.. సింప్లీ.. లీవ్ దిస్ మేటర్... ఇంతకంటే భయంకర సంఘటనలే జరిగాయి, జరుగుతున్నాయి కదా! పడుకున్నవాళ్ళను డిస్టర్బ్ చేయడమెందుకు? ఉదయం మాట్లాడుకుందాం. మీరు నిర్భయంగా పడుకోండి'' ధైర్యం చెప్పాడు అంజన్.

కిశోర్ హత్య విషయం వాళ్ళకిప్పుడు చెప్పదలుచుకోలేదు. అసలే శంకర్ శవం కనపడిందని భయపడుతున్నారు. ఈ సమయంలో కిశోర్ హత్య గురించి చెబితే యిక ఈ రాత్రికి వాళ్ళు నిద్రపోరు. అనవసరంగా భయాలు పెంచి వాళ్ళ నిద్రలు పాడుచెయ్యడం అంజన్‌కి యిష్టంలేదు.

ఉదయం ఎలాగూ ఈ విషయం బయటపడుతుంది. అప్పుడు చూసుకోవచ్చు అనుకుంటూ మేడమీద తన రూంలోకి పోయి పడుకున్నాడు అంజన్.

మాగన్నుగా నిద్ర పట్టే సమయంలో మేలుకున్నాడు. పక్క మంచం మీద వుండవలసిన మదన్ లేడు.

అప్పుడు గుర్తుకు వచ్చింది- అతనికి తను అప్పగించిన పని విషయం.

సమయం చూశాడు. రిస్ట్‌వాచీ రెండున్నర గంటలు చూపిస్తోంది.

ఆశ్చర్యంతో లేచికూర్చున్నాడు అంజన్. ఇంతసేపూ ఏం చేస్తున్నాడు మదన్.. ఇంకా గేరేజ్‌లోనే వున్నాడా? హంతకుడు రాలేదా? లేక అతన్ని వెంటతరిమే కార్యక్రమంలో వున్నాడా? ప్రమాదంలోగాని చిక్కుకున్నాడా? ఆ ఆలోచన వచ్చిందే తడవుగా పరుపు కింద దాచిన రివాల్వర్ పాంటుజేబులో వుంచుకుని తలుపులు దగ్గరకు లాగి, మేడ మెట్లు దిగసాగాడు అంజన్.

* * *

తాళం తియ్యబోతూ గేరేజ్ డోర్స్ ఇరుకుల్లోకి చూసాడు ఆగంతకుడు.

ఆ ఇరుకుల్లో వుండవలసిన సిగరెట్ పీకలు కిందపడి వున్నాయి.

నిన్న రాత్రి ఆ డోర్స్ మూసేటప్పుడు వాటిని ఇరుకుల్లో వుంచాడు. డోర్స్ తెరిస్తేగాని అవి కింద పడవు.

అంటే ఎవరో గేరేజ్ డోర్స్ తీశారన్నమాట...!

గేరేజ్ తాళం తీసి, రివాల్వర్ తీసి చేత్తోపట్టుకుని ముందుకు అడుగులు వేసాడు ఆగంతకుడు.

ఇంపాలా డిక్కీ దగ్గరకు వచ్చి ఆగిపోయాడు. డిక్కీ సరిగ్గా మూయబడినట్టు లేదని గ్రహించాడు. అంటే...

డిక్కీ హేండిల్ పట్టుకుని కొద్దిగా ఎత్తి దబ్‌మని మూసేసాడు. ఆ వెంటనే డిక్కీకి తాళం వేసాడు.

గేరేజ్‌లో ఓ మూల ఏదో బటన్ ప్రెస్ చేసాడు. గోడలో కలసిపోయిన సీక్రెట్ డోర్ పక్కకు తప్పుకుంది. ఆ ఖాళీ... ఒక అల్మారాలా వుంది. దానిలో కావలసినంత పెట్రోలు కేనుల్లో స్టాక్ చేసివుంది.

ఒక కేన్ అందుకుని ఇంపాలా పక్కనేవున్న కాడిలాక్ కారు ఆయిల్ టేంక్‌లో తనకు సరిపోతుందనుకున్నంత పెట్రోల్ పోసి; ఆ కేన్‌ను సీక్రెట్ అల్మారాలో వుంచి రహస్య ద్వారం క్లోజ్ చేసేసాడు ఆగంతకుడు.

కాడిలాక్‌ని అధిరోహించి బయటకు తీసుకువచ్చాడు. తర్వాత గేరేజ్ డోర్స్ క్లోజ్ చేసి; యిరుకుల్లో సిగరెట్ పీకలు వుంచి తాళం వేసాడు.

క్లచ్ నొక్కి గేరు మార్చి, టాప్ గేరులో ముందుకి దూకించాడు కాడిలాక్‌ను. శరవేగంతో స్మూత్‌గా దూసుకుపోతోంది- అందమైన బ్లాక్ కలర్ కాడిలాక్ కారు.

# 12

భూగృహంలోంచి పైకి వచ్చాడు ఆగంతకుడు. మధ్యతలుపు తెరిచి ప్రీతి గదిలోకి ప్రవేశించాడు.

మంచం మీద లలిత, ప్రీతి నిద్రపోతున్నారు. లలిత మొహంలో అమాయకత్వం, ప్రీతి వదనంలో ఆవేదనతో కూడిన భావాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి.

మెత్తగా అడుగులు వేస్తూ లలిత పక్కకు వచ్చాడు ఆగంతకుడు. జేబులోంచి చిన్నసైజు క్లోరోఫాం బాటిల్ తీసి లలిత మొహం పక్కగా వుంచి స్ప్రే బటన్ ప్రెస్ చేశాడు. సన్నటి తుంపర ఆమె ముక్కు దగ్గర పడింది. ఆ మరునిముషంలో తియ్యటి క్లోరోఫాం వాసన పీల్చిన లలిత స్పృహ కోల్పోయింది.

భుజానికి వున్న బేగ్‌లోంచి మినీసైజ్ చార్జ్‌డ్ ఆటోమేటిక్ వీడియో కెమేరా తీసి, ఒక ఎత్తు బల్లమీద.. మంచానికి లెవిల్‌గా వున్న బల్లమీద వుంచి ప్రీతి వద్దకు వచ్చాడు.

ముందే బటన్ ప్రెస్ చెయ్యడం వల్ల ఆగంతకుని ప్రతి కదలికా- వీడియో ఫిల్మ్‌పై ఎక్కిపోతోంది.

మరో మంచం మీద వున్న స్పేర్ తలదిండును తీసుకుని ప్రీతి తల వెనక్కు చేరి ఆమె మొహంపై దిండు వుంచి బలంగా అదమసాగాడు. తన శక్తినంతా చేతుల్లో కేంద్రీకరించి బలంకొద్దీ అదిమిపెట్టాడు.

గాఢనిద్రలో వున్న ప్రీతికి ఊపిరి సలపకపోయేసరికి మెలుకువ వచ్చింది. తన స్థితిని గ్రహించి చాలా భయపడిపోయింది.

చేతులతో తలదిండును ఎంత తోసేద్దామన్నా వీలు కాకపోయింది.

ఉండేకొద్దీ ఊపిరి స్తంభించిపోతోంది.

భీతితో ఏమీ చెయ్యలేక కాళ్ళు టపటపమని మంచంపై కొట్టసాగింది.

గుండెల్లో ఏదో మంట ప్రారంభమైంది.

కనీసం నోటితో చిన్న శబ్దం కూడా చెయ్యలేకపోతోంది.

ఆగంతకుడు చేతుల్ని ఇంకా తొలగించలేదు. కనుగుడ్లు పెద్దవి చేసి ఆమె కాళ్ళవైపు చూస్తున్నాడు.

ప్రీతికి తెలియకుండానే ఆమె ప్రాణాలు ఆమెను విడిచిపోయాయి. దానితోపాటు ఆమె కాళ్ళ కదలిక కూడా ఆగిపోయింది. కాళ్ళు రెండూ బిగుసుకుపోయాయి.

తృప్తిగా ఊపిరి పీల్చుకుని వీడియో కెమేరా ఆఫ్ చేశాడు.

దాన్ని బేగ్‌లో వుంచి బేగ్‌ని భుజానికి తగిలించుకుని గేరేజ్ వద్దకు వెళ్ళడానికి ఉద్యుక్తుడయ్యాడు- ఆగంతకుడు.

* * *

గేరేజ్‌లో ప్రవేశించి, ఇంపాలా కారు అక్కడే నిశ్చింతగా వుండటం చూసి ఆశ్చర్యపోయాడు అంజన్.

మళ్ళీ గేరేజ్ తెరుచుకుంటున్న శబ్దం విన్న మదన్, హంతకుడే తిరిగి వచ్చాడన్న భయంతో శబ్దం చెయ్యకుండా అలాగే ముడుచుకుని కూర్చున్నాడు.

లోపల అతనికి ఏమాత్రం సౌకర్యంగా లేదు. చాలా యిబ్బందికరంగా వుంది. చెమట్లు ధారాపాతంగా కారుతూ డిక్కీలోపల తడిపేస్తున్నాయి. ఇక్కడినుంచి ఎలా బయట పడాలిరా దేవుడా! అని వాపోయాడు మదన్.

డిక్కీ తలుపు లాగి చూసాడు అంజన్. తెరుచుకోలేదు. తాళం వేసివుందని గ్రహించి ఏదో అనుమానంతో డిక్కీ మీద రిథమిక్‌గా టిక్.. టకా.. టిక్.. అని కోడ్‌లో శబ్దం చేసాడు.

డిక్కీలో జపం చేస్తున్న మదన్‌కి అనుమానం తీరిపోయింది. అదేవిధంగా లోపలినుంచి తను కూడా శబ్దం చేసాడు.

ఆ వెంటనే జేబులోంచి 'మాస్టర్ కీ' తీసి మూడు నిముషాలు ప్రయత్నించిన మీదట డిక్కీ తెరుచుకుంది. హేండిల్ పట్టుకుని పైకి ఎత్తాడు అంజన్.

"స్వామీ.. ఆంజనేయా! ధన్యుడనైతిని స్వామీ! ధన్యుడనైతిని.. నా మూడుగంటల జపం ఫలించినది. నీ దివ్య మంగళ రూపాన్ని దర్శించుకొనగలిగే అర్హతను నాకు యిప్పటికైనా ప్రసాదించినందులకు నాజన్మ చరితార్థమైనది. అల్పుడనైన నేను నీకు ఏమిచ్చి ఋణ విముక్తుణ్ణి కాగలను స్వామీ..!!" తను చూసిన జానపద, పౌరాణిక సినిమాలలోని డైలాగులను ఏర్చి కూర్చి; భక్తి ప్రపత్తులను మాటల్లో ఒలికించుతూ, చేతల్లో చూపిస్తూ- నిజమైన, ఏకైక ఆంజనేయ భక్తుడిలా పలికాడు మదన్, డిక్కీ నుంచి విముక్తి లభించిందన్న ఆనందాతిశయాలతో.

అంజన్‌కి నవ్వాగింది కాదు. అయినా బలవంతంగా బిగబట్టుకుని అదే బాణీలో చెప్పాడు. "భక్తా.. నీ జపాన్ని మెచ్చితిని. నాపై నీకు గల అనంతమైన భక్తి ప్రపత్తులకు ఇవియే నా ఆశీస్సులు. ఏదేని ఒక్క వరమ్మును కోరుకొమ్ము.. తక్షణం యిచ్చెదను"

డిక్కీలోంచి బయటకు వచ్చి వళ్ళు విరుచుకున్నాడు మదన్. తడిసిన షర్టును విప్పి మెలిపెట్టి పిండుతూ అంజన్ వైపు కోపంగా చూసాడు. "నా అతీగతీ చూడకుండా హాయిగా పడుకుంటావా! బుద్ధి గడ్డితిని ఇటువంటి వెధవ డిక్కీ డిటెక్షన్‌కి పూనుకున్నాను.

బాగా బుద్ధి చెప్పావు. ఇటువంటి పిచ్చిపనులు ఇంకెప్పుడూ చెప్పకు. నరకం ఎక్కడో లేదు. ఆ డిక్కీలోనే వుంది. మూడుగంటలు భయానకంగా గడిపాను'' దీర్ఘశ్వాస విడిచి షర్టు ధరించాడు.

ఇక ఆపుకోవడం అంజన్‌కి చేతకాలేదు. పకపకా నవ్వాడు.

''నీకు నవ్వులాటగానే వుంటుంది. ఆ డిక్కీలో ఓ గంట కూర్చో... అప్పుడు తెలుస్తుంది ఆ నరకం ఏమిటో...'' ఎకసక్కెంగా అన్నాడు మదన్.

గేరేజ్ తాళం వేస్తూ ''అబ్బా.. క్షమించరా బాబూ.. నీ వరస చూస్తుంటే తెల్లారేదాకా ఈ బాణీ వదిలేలా లేవు'' అన్నాడు అంజన్.

అప్పటివరకూ లోపల జరిగిన విషయాలన్నీ అతనికి చెప్పాడు.

''ఆఁ.. మరో హత్య జరిగిందా!'' అడిగాడు మదన్.

''అవును.. ఇంతకీ హంతకుడు పెట్రోలు ఎక్కడ దాచాడో తెలియలేదా?''

''డిక్కీలో ఇరుక్కున్నారా మహానుభావా అంటే పెట్రోలు... పెట్రోలు అంటావేమిటి?''

''సరే.. నువ్వొక పని చెయ్యి... బిల్డింగ్ వెనుక పెంకుటింట్లో ఒకరూంలో శంకర్ శవాన్ని వుంచాను కదా! అది అక్కడ వుందో లేదో చూసిరా.. జాగ్రత్త.. రివాల్వర్ వుందా?'' అడిగాడు.

తల వూపి బిల్డింగ్ వెనుక వైపుకు కదిలాడు మదన్.

తన రూంకి చేరుకున్నాడు అంజన్.

మరో పావుగంట తర్వాత వచ్చి చెప్పాడు మదన్ ''శంకర్ శవం భద్రంగా అక్కడే వుంది.''

ఏదో ఆలోచిస్తూ గెడ్డం కింద చేత్తో రాసుకున్నాడు అంజన్.

# 13

ఉదయం కొంచెం ఆలస్యంగా లేచాడు అంజన్.

అప్పటికే కిందనుంచి ఏడుపులు వినిపిస్తున్నాయి. మదన్‌ని తట్టి లేపాడు.

రాత్రి జరిగిన సంఘటన అతని మనసులో ముద్రవేసింది కాబోలు... అంతరాంతరాలలో దాగిన ఆ భయం తాలూకు చిహ్నాలు కలరూపం పొందాయి... ఆ కల ఇంకా చెదిరిపోక, అంజన్ తట్టేసరికి కలవరించసాగాడు. ''హంతకుడా!.. ప్లీజ్.. ఆ రివాల్వర్‌లో వున్న ఆరు బుల్లెట్స్‌తో కాల్చి చంపేయ్. కాని నన్నా డిక్కీలో మాత్రం బంధించకు..వద్దు..వద్దు'' అంటూ.

రెండోసారి గట్టిగా కుదిపేసరికి తృళ్ళిపడి లేచాడు మదన్ ''ఏం జరిగింది?'' అన్నాడు, క్షణం తర్వాత ఏడుపులు విని, కిశోర్ విషయం మరచి.

''ఏమో! చూద్దాం పద'' అన్నాడు అంజన్- కిశోర్ శవం బయట పడిందనుకుని.

ఇద్దరూ మేడ దిగి ఏడుపులు వినిపిస్తున్న ప్రీతి గదిలోకి వెళ్ళారు.

మంచం మీద ఆమె శవాన్ని చూసి దిగ్భ్రాంతులయ్యారు.

కోటిలింగం జీవంలేని చూపులు చూస్తున్నాడు. ఆ కాస్త సమయంలోనే అతని వయసు మరో పదేళ్ళు పైబడ్డట్టు వుంది.

''ఎలా జరిగిందీ దారుణం?'' పక్కనే వున్న గిరిధర్‌ని ప్రశ్నించాడు.

''ఉదయం నిద్రలేచిన లలిత, ప్రీతి మొహం మీద తలదిండు వుండడం చూసి, దిండు తీసి పక్కన పడేసిందట. అప్పుడు గమనించింది ఆమె నిర్జీవ దేహాన్ని. ఈ దారుణ హత్యలు ఎందుకు జరుగుతున్నాయో అర్థం కాకుండా వుంది'' బాధగా అన్నాడు గిరిధర్.

శవాన్ని దగ్గరగా చూశారు అంజన్, మదన్‌లు.

ముక్కు దగ్గర చిన్న చిన్న దూది పీచులు అతుక్కుని వున్నాయి.

తలదిండు తీసి వెనక్కి తిప్పిచూశాడు అంజన్. దిండు మధ్యలో రెండు చిరుగులు వున్నాయి. బహుశా- హంతకుడు దిండుతో అదిమేటప్పుడు ఆ చిరుగుల నుంచి బయటపడ్డ దూది పీచులు ఆమె ముక్కు వద్ద అతుక్కుని వుంటాయని ఊహించాడు అంజన్.

''తలదిండుతో అదిమిపెట్టి హత్య చేశారు!'' అన్నాడు మదన్.

''అవును'' అన్నాడు గిరిధర్.

ప్రీతి శవం మీద పడి వెక్కి వెక్కి ఏడుస్తోంది లలిత.

మంచం పక్కన నిలుచుని చిన్నగా రోదిస్తున్నారు మీనాక్షి, పేరమాంబ, జలజలు.

రవి పరుగెత్తుకుని వచ్చాడు ఆ గదిలోకి. ఆయాసపడుతూ, ''కిశోర్ కనిపించటం లేదని అంతా గాలిస్తుంటే, ఒక గదిలో చచ్చిపడివున్నాడు. ఎవరో కత్తితో పొడిచి చంపేసారు'' బాధను అదిమిపెట్టుకుంటూ చెప్పాడు.

ఎవరి మొహంలోనూ కత్తివేటుకు నెత్తురుచుక్క లేదు.

మంగతాయారు మెల్లగా గొణగసాగింది- 'అమ్మ నాయనోయ్... ఈ దెయ్యాల కొంపలో ఇలా హత్యలు జరుగుతాయని తెలిస్తే నేను చచ్చినా వచ్చేదాన్ని కాదు... ఎంత తొందరగా వీలయితే అంత తొందరగా నన్నీ కొంపలోంచి బయటపడేయ్‌రా దేవుడా!

నువ్వేం కోరితో అది చెల్లిస్తాను'' అంటూ.

ఆమె పక్కనే వున్న సోములు మంగతాయారును కసిరాడు.

గిరిధర్ సమ్మతిని తీసుకున్న అంజన్, మదన్ వైపు తిరిగి ''నువ్వీ శవాన్ని భుజానికి ఎత్తుకో... నేను కిశోర్ శవాన్ని తీసుకువస్తాను. ఇద్దరి శవాల్ని బంగ్లా వెనుక యింట్లో వుంచి వద్దాం'' అన్నాడు.

తల వూపి, బిగుసుకుపోయిన ప్రీతి శవాన్ని అతి కష్టం మీద భుజానికి ఎత్తుకున్నాడు మదన్.

* * *

''వెరీగుడ్... నువ్వు, నేను చెప్పిన పనల్లా చెప్పినట్టు అలా చేస్తే చాలు... నా కోరిక తీరుతుంది. నిన్ను ఈ క్షణం నుంచి మరింత గాఢంగా ప్రేమిస్తున్నాను రవీ..'' అంది జలజ అతనిపై ప్రేమ ఒలకబోస్తూ.

వాళ్ళిద్దరూ రహస్యంగా మధ్యాహ్నం పన్నెండు గంటలకు తోటలో కలుసుకున్నారు.

ఉబ్బి తబ్బిబ్బయిపోయాడు రవి.

''ఇంకా ఏమైనా చెయ్యాలా?.. చెప్పు, క్షణంలో చేసేస్తాను'' అన్నాడు హుషారుగా.

అతని చెవిలో చెయ్యవలసిన పని గురించి చెప్పింది జలజ.

''నువ్వే చూస్తావ్‌గా నా ప్రతాపం... కాని అలా చేయడం వల్ల నీకు ప్రయోజన మేముంది?'' అని అడిగాడు.

''చెప్పింది చెయ్యడం వరకే నీ వంతు. ప్రశ్నలు అడగవద్దని క్రితమే చెప్పాను నీకు'' అంది జలజ సీరియస్‌గా.

''సరే.. సరే.. ఇంతకీ మనం ఎప్పణ్ణించి ప్రేమించుకుందాం?''

''ఈ క్షణం నుంచే...''

''అయితే పద.. అలా షికారుకి పోయివద్దాం'' అన్నాడు రవి- అదోలా చూస్తూ.

''ఇప్పుడు నాకు తీరిక లేదు. నేను చేయవలసిన పనులు చాలా వున్నాయి. పరిస్థితులన్నీ చక్కబడనీయ్.. తీరిగ్గా ప్రేమించుకోవచ్చు. ముందు నేను చెప్పింది చెయ్'' రవి అరచేతి మీద ముద్దు పెట్టుకుంటూ చెప్పింది.

అరేబియన్ హార్స్ మీద స్వారీ చేస్తున్నంత ఆనందంగానూ, యువరాజులా సింహాసనాన్ని అధిరోహించి వజ్రకిరీటాన్ని శిరస్సుపై వుంచుకున్నంత సంతోషంగానూ ఫీలయ్యాడు రవి.

జలజ తన కార్యసాధనకు తననో పావులా ఉపయోగించుకుంటోందన్న సంగతి పాపం రవికి తెలియదు!

'మగవాడి మనసన్నా తెలుసుకోవచ్చుగాని, ఆడదాని ఆంతర్యం తెలుసుకోవడం ఎవ్వరి తరమూ కాదు...' అని పెద్దలు ఊరకే అన్నారా!

* * *

లలిత గదిని పిల్లిలా దాటబోతూ "అంజన్ బాబూ.. అంజన్ బాబూ.." అని మెల్లగా పిలిచింది మంగతాయారు.

ఆమె మాటలు విన్న లలిత బయటకు రావడం చూసి, చేతిలో వున్న ఉత్తరాన్ని వెనక్కి దాచేసింది.

"అంజన్‌ని ఎందుకు పిలుస్తున్నావు? ఆ చేతిలో ఏమిటి?" అనుమానంగా అడిగింది లలిత.

"ఏ.. ఏంలేదు.. అమ్మాయిగారూ.." తడబడింది మంగతాయారు.

"ఏమీ లేకపోతే ఆ కంగారెందుకు? నీ చేతిలో ఏముందో చూపించు" నిలదీసి అడిగింది.

లలిత సైగనందుకుని రూంలోకి వెళ్ళింది "ఉత్తరం అమ్మాయిగారూ.." అంది భయంగా.

"ఎవరికి?"

"అంజన్‌బాబుకి..."

"ఎవరు రాసారు?" మరింత అనుమానంగా అడిగింది.

"జలజ అమ్మాయిగారు."

"ఆ ఉత్తరం యిలా యివ్వు."

"జలజగారికి తెలిస్తే తిడతారేమో!"

"తిట్టదు. అంజన్‌కి నేనిస్తాను. ఇలా యివ్వు" ఉత్తరం లలిత చేతిలో వుంచి మంగతాయారు కిందకి దిగి వచ్చేసింది.

అనుమానం, అసూయ ముందుపుట్టి ఆడది తర్వాత పుట్టిందన్న సామెత ఎంతవరకు నిజమో నాకు తెలియదుగాని, లలిత విషయంలో మాత్రం ఆ సామెత నిజమైంది.

అరటావు కాగితాన్ని మడత విప్పి చదవసాగింది. ఆమె కళ్ళు అక్షరాల వెంట

శరవేగంతో పరుగులు తీస్తున్నాయి.

'మై డియర్ అంజన్...

నీ ప్రేమను పొందగలగడం నిజంగా నా అదృష్టం. మన ఇద్దరి ప్రేమ కలకాలం నిలుస్తుంది. నీ ప్రేమవాహినిలో నేను మునిగి తేలాలని వుంది. కాని మనకంత సమయం వుండటం లేదు. నీవే నా ఆరాధ్య దేవుడివి. జన్మ జన్మలకు నువ్వే నా భర్తగా కావాలని కోటి దేవుళ్ళకు మొక్కుతున్నాను.

నిన్న సాయంత్రం తోటలో మనం కలుసుకున్నప్పుడు నువ్వు చేసిన చిలిపి పని నేనింకా మరచిపోలేదు. ఆ తీయటి అనుభూతి నాకు మాత్రమే సొంతం చేసినందుకు నీకు నా కృతజ్ఞతలు. అఁ.. మర్చిపోయాను. ప్రేమికుల మధ్య క్షమాపణలు, కృతజ్ఞతలు వుండకూడదని అంటారుకదా! సరే... ఇంతకీ మరో అరగంటలో మన మామూలు ప్లేస్‌కి వస్తావుకదూ! వుంటాను.

ఇట్లు,<br>
నీ హృదయ రాణి,<br>
జలజ.'

ఉత్తరం పూర్తిగా చదివేసరికి లలితకు కోపం, ద్వేషం, ఈర్ష్య, అసూయ, బాధ అన్నీ ఒక్కసారిగా కలగాపులగంగా కలిగాయి.

కొంతసేపు ఆలోచిస్తూ అలాగే కూర్చుండిపోయింది.

అడుగుల చప్పుడు విని తలుపు చాటుకు తప్పుకుంది.

అంజన్ ఆమె గది ముందు క్షణం ఆగి మేడ మెట్లు దిగి బయటకు వెళ్ళిపోయాడు. మరో నిముషం తర్వాత జలజ కూడా బయటికి వెళ్ళడం చూసింది లలిత.

వెంటనే పక్కనే వున్న జలజ రూంలో ప్రవేశించింది. లక్కీగా పేరమాంబ అక్కడ లేదు.

తలుపులు దగ్గరకు జారవేసి డెస్కులు, అల్మారాలు, బీరువాలు అన్నీ వెతకసాగింది. కానీ ఆమెకు ఏమీ కనిపించలేదు.

యథాలాపంగా పరుపు కాళ్ళవైపు ఎత్తింది. ఆమె కళ్ళకు రెండు ఉత్తరాలు కనిపించాయి.

వాటిని తీసుకుని తన రూంలోకి ప్రవేశించి గడియ పెట్టింది.

ఒక ఉత్తరం తెరిచి చదవసాగింది.

'జలజా డార్లింగ్...

కవిత్వం అంటే తెలియనివాడు కూడా ప్రేమలో పడితే... కవిత్వంలో పండితుడు అయిపోతాడనీ, కవిత్వానికే భాష్యం చెబుతాడనీ మన ప్రేమవల్ల గ్రహించాను. మన ప్రేమసామ్రాజ్యంలో నేను యువరాజుని, నువ్వు యువరాణివి. నీ అందానికి నేను ముగ్ధుణ్ణి అయిపోయాను. గండు మీనాల్లాంటి నీ కళ్ళల్లో వున్న శతకోటి దివ్యకాంతులు నన్ను ఆకర్షిస్తున్నాయి. వాటిని ఎంతకాలం చూసినా తనివి తీరదు. ఈ లెటర్ వ్రాస్తున్నంతసేపూ నీ కళ్ళు నా కళ్ళముందు కదలాడి నన్ను బాధిస్తున్నాయి. ఇక వ్రాయలేను...

ఇట్లు,
నీ అంజన్.'

మరో లెటర్ విప్పింది. లెటర్ చదువుతున్నంతసేపూ ఆమెలో రకరకాల భావాలు కదలాడుతున్నాయి.

'జలజా డియర్...

మన ప్రేమకు పునాది నీ అందమైన నేత్రాలే సుమా! అలాగని నువ్వు అందంగా లేవని కాదు. నీ ఒంపు సొంపుల వయ్యారాలు నాలో గిలిగింతలు రేపుతున్నాయి. నీ కళ్ళను, ఒంపు సొంపులను ఎన్నిసార్లు ముద్దాడినా నా తనివి తీరడం లేదు. సాయంత్రం ఎప్పుడవుతుందా! నువ్వెప్పుడు వస్తావా! అని ఆరాటంగా నిరీక్షిస్తున్న...

నీ అంజన్.'

రెండు ఉత్తరాలూ చదివిన లలిత దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది.

మంచం మీద బోర్లా పడుకుని, దిండులో తలదూర్చి నిశ్శబ్దంగా రోదించసాగింది.

ఆమెకు ప్రపంచం బ్రద్దలైనట్టు, నింగి నేలకు క్రుంగిపోయినట్టు అనిపించసాగింది. విశ్వమంతా గాడాంధకారంలో మునిగినట్టు, తానొక్కతే ఆ గాడాంధకారంలో దిక్కుతోచక విలపిస్తున్నట్లు భ్రమించింది.

లలిత తన అందమైన ఊహాసౌధాన్ని అంజన్ చుట్టూ అల్లుకుని, ఏవేవో తీయని కలలు కన్నది. అలాంటిది అతను తనను మోసగించాడని మనసులో కలిగిన ఒక్క ఊహే.. ఆమె ఆశాసౌధాన్ని గాలికి కూలిన పేకమేడలా- పునాదులతో సహా కూల్చివేసింది.

# 14

గాలిబంగ్లా వెనుక నడుస్తున్నారు అంజన్, మదన్.

"మధూ... కిశోర్‌ని గిరిధర్ చంపి వుంటాడంటావా?" ప్రశ్నించాడు అంజన్.

"చంపితే చంపి వుండొచ్చు... లేకపోతే చంపకనూ పోవచ్చు" అన్నాడు మదన్.

"పిచ్చి పిచ్చిగా మాట్లాడకు. ఆ రెండు మాటల్లో ఏదో ఒకటి ఎలాగూ నిజమౌతుంది... జరిగినదాన్నిబట్టి చూస్తే అలాగే అనిపిస్తుంది. మీనాక్షితో కిశోర్ అక్రమ సంబంధం పెట్టుకున్నాడని తెలిసిన గిరిధర్, కిశోర్ మీద పగతో అతన్ని హత్య చేసి వుండొచ్చు... అవకాశం వుంది" చెప్పాడు అంజన్.

"హత్య ఎలా చేసి వుంటాడని నీ ఊహ..." అడిగాడు మదన్.

"గిరిధర్ గదికీ, మీనాక్షి, కిశోర్‌లు కలుసుకున్న గదికీ మధ్య మరోగది వుందికదా! గదికీ గదికీ మధ్య తలుపుల ఏర్పాటు వుంది. కనుక హత్య చెయ్యడం మరీ సులువు. గిరిధర్ మధ్యతలుపులు తెరుచుకుని పక్కగదిలోకి వెళ్ళివుంటాడు. మీనాక్షి వెళ్ళిపోయేవరకూ వేచివున్నాడు. తర్వాత రాసక్రీడ జరిగిన గది తలుపులు తెరిచి కిశోర్‌ని హత్య చేసి, యధాప్రకారం వెళ్ళిపోయి వుంటాడు" చెప్పాడు అంజన్.

"నువ్వు ఒక విషయం మరిచావు"

"ఏమిటది?"

"గిరిధర్ గది పక్కగది రంగనాథవర్మగారి ఆజ్ఞ ప్రకారం సీలువేసి వుందని నీకు తెలియదా! ఆ గదికి రెండువైపులా వున్న తలుపులు కూడా బిగించి వుంటాయి. బయట తాళం వ్రేలాడుతోంది. ఇక గిరిధర్‌కి ఆ గదిలోంచి వెళ్ళే వీలులేదు" వివరించాడు మదన్.

"అవును. అదీ నిజమే. మరి ఎలా హత్య జరిగింది?"

"తన గదిలోంచి బయటకు వచ్చి ఆ గదిలోకి ప్రవేశించి వుండొచ్చు"

"నథింగ్... అలా జరిగే వీలులేదు. నా దృష్టి మీనాక్షి, కిశోర్‌లు వున్న రూముపై నిలిపాను. నువ్వు చెప్పినట్లు జరిగితే గిరిధర్ నాకంట పడివుండేవాడు."

"వాళ్లకంటే ముందుగానే ఆ గదిలోకి ప్రవేశించాడేమో!" అనుమానం వెలిబుచ్చాడు మదన్.

"అది ఖాళీ రూము. అందులో పూచికపుల్ల కూడా లేదు. దాక్కోడానికి మార్గంలేదు"

"పోనీ వాళ్ల పక్కరూంలో ముందుగా దాక్కున్నాడేమో?"

"ఆ పక్కన రూమేలేదు. వాళ్ళు దూరిన రూమే చివరిది"

"మట్టిబుర్ర... ఆ విషయమే జ్ఞాపకం లేదు. ఆఁ.. కిటికీ ఊచలు..." మదన్ మాటను మధ్యలోనే కట్ చేసాడు అంజన్. "నిక్షేపంగా వున్నాయి"

ఓ క్షణం బుర్ర గోక్కున్నాడు మదన్. "ఎలా చెప్పినా క్రాస్ చేస్తున్నావు. అలా అయితే ఎలా?... పోనీ కిశోర్ హత్య జరగలేదనుకుందాం" దూరంగా జరుగుతూ అన్నాడు.

‘‘నోర్మూయ్... డిటెక్షన్ అంటే నీకు నవ్వులాటగా వుంది. హత్య ఎలా జరిగిందన్నది తెలుసుకోవాలంటే- అన్ని మూలల నుంచీ పరిశోధించాలి’’

‘‘ఈ బంగ్లాకి మనం వచ్చిన తరువాత మనకి కరువైంది ఆ నవ్వు ఒక్కటే...’’

‘‘అవును. ఇన్ని హత్యలు ఎలా జరుగుతున్నాయో, ఎవరు చేస్తున్నారో తెలియడం లేదు’’

‘‘ప్రీతి హత్య ఎలా జరిగిందో...?’’

‘‘ఏమో! హంతకుడికి అనేక మార్గాలు... ఎలాగైనా చెయ్యగలడు’’ భుజాలు ఎగురవేసి అన్నాడు అంజన్.

‘‘హంతకుడు ప్రీతిని హత్య చేస్తుంటే లలితకు మెలుకువ రాలేదంటావా?’’ అడిగాడు మదన్.

‘‘స్పృహలో వుంటే ఖచ్చితంగా మెలుకువ వచ్చి తీరుతుంది. బహుశా క్లోరోఫాం ఇచ్చి ఆమెకు స్పృహ తప్పించి వుండొచ్చు’’

‘‘అయితే నేనేం చెయ్యాలో చెప్పు’’ అన్నాడు మదన్.

‘‘గేరేజ్‌లో...’’

‘‘అమ్మో.. డిక్కీ పనైతే చచ్చినా చెయ్యను’’ నిక్కచ్చిగా అన్నాడు మదన్.

చిన్నగా నవ్వాడు అంజన్. ‘‘డిక్కీ పని కాదులే... పెట్రోలు ఎక్కడ స్టోర్ చెయ్యబడి వుందో తెలుసుకోవాలి. గేరేజ్‌లో బాగా లోపలికి వున్న రోల్స్‌రాయిస్ కారు హంతకుడు వాడటంలేదు కదా! నువ్వు ఆ కారు కింద పడుకుని వుండు. ఆగంతకుడు పెట్రోలు ఎక్కడ దాస్తున్నాడో గ్రహించు.

నేను ఆ గజ్జెల దెయ్యాన్ని రాత్రికి వెంటాడతాను. ఇప్పటికే చాలా ఆలస్యమైంది. ఇక ఉపేక్షించడం వల్ల ప్రయోజనం లేదు. ఎంత త్వరగా ఈ దెయ్యాలగోల పరిష్కరిస్తే అంత మంచిది’’ చెప్పాడు.

‘‘డిక్కీ జపం పోయి, కారు కింద శవజపం తప్పదన్నమాట... తప్పేదేముంది, నా ఖర్మ కాలింది’’ మనసులో అనుకోబోయి పైకి అనేసాడు మదన్.

అంజన్ సీరియస్‌గా చూసేసరికి నడక వేగం పెంచాడు అతను. అప్పుడే చిరుచీకట్లు ముసురుకోసాగాయి...

మదన్ వెనుక కదిలాడు అంజన్.

వాళ్ల సంభాషణ అంతా విన్న, ఒక చెట్టు చాటున వున్న రెండు కళ్ళను వాళ్ళిద్దరూ గమనించలేదు...!!!

* * *

లలిత ముభావంగా వుండటం గమనించాడు అంజన్.

తనతో మాట్లాడకపోవడం, కనీసం పలకరింపుగానైనా నవ్వకపోవడం; అసలు తనవైపే చూడకపోవడం అతనికి బాధ కలిగించింది.

భోజనం చేసేటప్పుడు కూడా ఎవరితోను సరిగా మాట్లాడలేదావె... తన వంక ఒక్కమారైనా చూడకపోవడం, అతనికి చాలా ఆశ్చర్యంగా వుంది.

నిముషానికి ఒక్కసారైనా, పడుకునే లోపులో ఆమెను చూడకపోతే తనకు తోచదు. అలాగే ఆమె కూడా ప్రవర్తించేది.

మరీ ఈరోజు ఈ మూడు గంటల్లో ఎందుకింత మార్పు...!

అంతా హాల్లో కూర్చుని వున్నారు.

ఎవరి మొహాల్లోనూ కళాకాంతులు లేవు. రోజూ అంతుపట్టని హత్యలు వరుసగా జరిగిపోతుంటే ఇక వాళ్ళ మొహాల్లో కళాకాంతులు ఎలావుంటాయి?

‘‘ఇప్పటికైనా మనం బయటపడే మార్గం లేదా?’’ అడిగింది మీనాక్షి. ఆమెను అంటిపెట్టుకుని కూర్చున్నారు పేరమాంబ, జలజలు.

ఎవరూ మాట్లాడలేదు. ఆమె ప్రశ్నకు ఎవరు మాత్రం ఏమని జవాబు చెప్పగలరు? అక్కడినుంచి వీలయినంత త్వరగా బయటపడాలని వాళ్ళకు లేదా?! ఎందుకు లేదు? బయట పడడానికి అనువైన మార్గమే లేదు...

కోటిలింగంలో హుషారంతా తుడిచిపెట్టుకు పోయింది. కూతురు, అల్లుడు చనిపోవడంతో అతన్ని బాగా క్రుంగదీసింది ఆ బాధ.

రవి మాత్రం జలజ వంక ఆదోలా చూస్తూ హుషారుగా వున్నాడు.

‘‘ఇప్పటికే చాలా ఆలస్యమైంది. ఇక పడుకోండి’’ తన రూంకి వెళ్తూ చెప్పాడు గిరిధర్.

అంతా అక్కడినుంచి కదిలారు.

‘‘లల్లీ...’’ రూంలోకి వెళ్లబోతున్న ఆమెను పిలిచాడు అంజన్.

ఎవరి రూముల్లోకి వాళ్లు పోయి తలుపులు బిడాయించుకున్నారు.

ఆగింది లలిత.

‘‘ఏమిటి మాట్లాడవు?’’ అడిగాడు.

‘‘ఇంకా నీతో నాకు మాటలేమిటి?’’ కోపంగా అంది లలిత.

‘‘ఏమిటి ఈవేళ వింతగా ప్రవర్తిస్తున్నావ్?’’

"తెలియక అడుగుతున్నావా? లేక తెలిసి, తెలియనట్టు నాటకమాడుతున్నావా?"

"ఏమిటి నువ్వనేది?"

"ప్రేమిస్తున్నట్టు నటించి నాలా ఎంతమందిని మోసగించాలనుకుంటున్నావు?" తీవ్రంగా అడిగింది.

"నిన్ను మోసగించానా?!"

"నటించకు..."

"నేను నిజం చెబుతున్నాను.. నామాట నమ్ము"

"అయితే ఈ లెటర్స్ మాటేమిటి?"

అంజన్ జలజకు రాసినట్లున్న రెండు ఉత్తరాల్నీ అతని చేతిలో పడేసింది.

వాటిని చదివి నిర్ఘాంతపోయాడు అంజన్. "నామాట నమ్ము.. ఈ ఉత్తరాలు నేను రాయలేదు"

"నీ మాటతో నువ్వు నన్ను మోసగించగలవేమో కానీ, నా కళ్ళు నన్ను మోసగించవు. నీ రైటింగ్ నాకు తెలుసు. ఆ రైటింగ్, సంతకాలు నీ చేతివ్రాతేనని గ్రహించలేనంత అమాయకురాలిని కాదు"

"ఈ రైటింగ్ అచ్చు నా చేతిరాతలాగే వుంది. సంతకం కూడా నేను పెట్టినట్టే వుంది. కానీ ఈ లెటర్స్ రాసింది మాత్రం నేనుకాదు"

"బావుంది. ఇది మరో కొత్త నాటకమా!... వెనకటికి నీలాంటివాడే, ఒక అరటిపళ్ళ దుకాణం దగ్గరికి వెళ్ళాడంట. గెలనున్న అరటిపళ్ళు అతను పీకడం చూసిన కొట్టువాడు కొంతసేపటి తరవాత, అతను ఎంతకీ డబ్బులు ఇవ్వకపోయేసరికి అడిగాడంట. అప్పుడు వాడు యిలా జవాబు చెప్పాడు. అరటి పళ్ళు గెలనుంచి నేనే పీకాను. ఆ కింద పారేసిన తొక్కలు కూడా నేనే వేశాను. కానీ అరటిపళ్ళు మాత్రం నేను తినలేదు అన్నాడంట. అబద్ధం ఆడితే అతికినట్టు ఉండాలి. ఈ కథ నీకెందుకు చెప్పానో తెలుసా! బుద్ధి తెచ్చుకుని మసలుతావని...

ఇకముందు జాగ్రత్తగా నడుచుకో... నీతో మాట్లాడటమే మహా పాపం... ఇకముందు నన్ను కలవడానికిగాని, పలకరించడానికిగాని ప్రయత్నించకు. అది నీకే మంచిది కాదు" అంటూ చకచకా రూంలోకి పోయి తలుపులు భళ్ళున మూసేసింది లలిత.

కళ్ళముందు వున్న ప్రపంచమంతా గిర్రున తిరుగుతున్నట్టు అనిపించింది అంజన్‌కి.

తనను మనసారా ప్రేమించిన లలితేనా ఇంతసేపూ ఇలా మాట్లాడింది! ఇది కలా... నిజమా!

తను రాసినట్లుగా లెటర్స్ ఎవరు సృష్టించారు? జలజా.. ఆమెను ఇంకా తను ప్రేమిస్తాననే అనుకుంటుందా? అయినా తన రైటింగ్‌ని జలజ ఎలా కాపీ కొట్టి వ్రాయగలదు? ఆమెకు ఎవరైనా సహకరించారేమో! అయితే ఎవరు?...

మదన్ ఆ పని చెయ్యడు. గిరిధర్... అతను కూడా చెయ్యకపోవచ్చు. ఇక మిగిలింది కోటిలింగం, రవి. బాధలో వున్న కోటిలింగం చేసాడంటే హాస్యాస్పదమే... ఒకవేళ రవి... జలజ ప్రోత్సాహంతో...

ఆలోచనలు కట్టిపెట్టి బెడ్ మీద వాలిపోయాడు.

* * *

రాత్రి పదకొండు గంటలకు అంజన్‌ని తట్టిలేపాడు మదన్.

చల్లని నీళ్ళతో మొహం కడుక్కుని తుడుచుకున్నాడు అంజన్. అతని మత్తంతా ఎగిరిపోయింది.

ఇద్దరూ గేరేజ్‌ని చేరుకున్నారు. మదన్‌ని అందులో వుంచి తాళం వేసేసాడు అంజన్.

మొదటిరోజు రాత్రి భూమిని చీల్చుకుని శవం లేచిన ప్రదేశంలో ఒక చెట్టుచాటున నిలబడి ఎదురు చూడసాగాడు.

కీచురాళ్ళు కరిచేలా అరుస్తున్నాయి...

పరిసరాలను జాగ్రత్తగా పరికిస్తూ జేబులోంచి రివాల్వర్ తీసి స్టిఫ్‌గా పట్టుకుని, రాబోయే దెయ్యం కోసం పట్టుదలగా ఎదురు చూడసాగాడు.

చెట్టు మీద గుడ్లగూబ కీచుగా అరిచింది.

## 15

అర్ధరాత్రి పన్నెండు గంటలు.

గోడ గడియారం టంగ్.. టంగ్.. మని 12 గంటలు కొట్టడం ముగించేసరికి కేకలు, ఆర్తనాదాలు, పెడబొబ్బలు, అరుపులు ప్రారంభమయ్యాయి యధావిధిగా.

హృదయ విదారకంగా, గుండెలు జలదరించేలా వున్నాయా ఆర్తనాదాలు...

ఆ కేకలకు అందరికీ మెలుకువ వచ్చినా ఎవరూ బయటికి రావడానికి సాహసించడంలేదు. ఎప్పుడు ఎవరికి మూడుతుందో తెలియదు కదా!

కానీ గిరిధర్ తలుపు తెరచుకుని బయటకు వచ్చాడు. నీలం రంగు ప్యాంటు మీద తెల్లచొక్కా ధరించాడు.

కేకలు అలా సడెన్‌గా ఆగిపోవడం, అతను బయటకు రావడం, కొన్ని క్షణాల తేడాలో జరిగింది.

చుట్టూ పరికించాడు. అప్పుడే సింహద్వారం దాటుతున్న తెల్లని ఆకారాన్ని చూసి క్షణం ఆగకుండా వెంటపడ్డాడు.

తోటలో నడుస్తూ ఏడుస్తోందా ఆకారం. సన్నగా రోదిస్తోంది.

ఆ ఏడుపు వినలేక గిరిధర్ ఒళ్ళు జలదరించింది.

చుట్టూ చూసాడు. ఎక్కడా ఏ అలికిడీ లేదు.

ధైర్యం తెచ్చుకుని ఆకారం వెనుక అలాగే నడవసాగాడు.

గిరిధర్ పాదాలు పడి ఎండుటాకులు నలిగిపోతున్నాయి. ఆ రోదనలో ఆ శబ్దం అదోరకంగా వుంది.

క్షణం తర్వాత ఏడుపు నవ్వుగా మారింది. ముందు చిన్నగా నవ్వుతోంది. ఆ నవ్వు మనుషులు నవ్వినట్టు లేదు. అదోరకమైన భీతికి గురిచేస్తోందా నవ్వు...

మొహాన పట్టిన చెమటను ఒణుకుతున్న అరచేత్తో తుడుచుకొని అనుసరిస్తున్నాడు గిరిధర్. అతని షర్టు పూర్తిగా తడిసిపోయింది.

చెట్టుమీద గుడ్లగూబ వికృతంగా అరిచింది.

తృళ్ళిపడి తేరుకున్నాడు గిరిధర్.

ఆ ఆకారం అతన్ని ఎక్కడికో అలా తీసుకుపోతూంది.

అంజన్ నుంచున్న చెట్టుకి పాతిక గజాల దూరంలో కొన్ని క్షణాలు ఆగిందా ఆకారం.

పకపకా నవ్వసాగింది... విరగబడి, పగలబడి, వికృతంగా, భీకరంగా, భయానకంగా నవ్వింది.

తిరిగి ముందుకు కదిలింది...

ఆకారం వెనుకే అలా పోతున్నాడు గిరిధర్.

* * *

కీచుగా అరచిన గుడ్లగూబ అరుపుకు ఉలిక్కిపడి, తన భయానికి తనలో తనే నవ్వుకున్నాడు అంజన్.

పాతిక గజాల దూరంలో వెళ్తున్న ఆకారం అతని కంటపడింది.

దాన్ని అనుసరిస్తున్న గిరిధర్‌ని కూడా చూశాడు.

ఆశ్చర్యంతో తలమునకలయ్యాడు.

ఇప్పుడెలా? ఆకారాన్ని గిరిధర్ వెంబడిస్తుంటే తనెలా వెంటాడగలడు? అని మనసులో అనుకుని వాళ్ళిద్దరి వెనుకా వెళ్ళడానికే నిశ్చయించుకున్నాడు.

వెంటనే రివాల్వర్‌ని అలాగే పట్టుకుని గిరిధర్‌కి వంద గజాలు వెనుకగా అనుసరించ సాగాడు అంజన్.

చెట్ల మధ్యనుంచి అలా తీసుకుపోతోంది ఆకారం. దాని వెనుక గిరిధర్, ఆ వెనుక అంజన్ పట్టుదలగా వెళుతున్నారు.

ఒక చెట్టువద్ద సడెన్‌గా ఆకారం అదృశ్యమైపోవడం అంజన్ దూరం నుంచి చూసాడు.

ఆ చెట్టు పక్కకే గిరిధర్ కూడా వెళ్ళాడు.

అదే సమయంలో మెల్లగా కురుస్తున్న వర్షం తీవ్రరూపాన్ని దాల్చి కుంభవృష్టిలా కురవసాగింది.

అంజన్ పూర్తిగా తడిసిపోయాడు... తడిసిపోతూనే వున్నాడు. అయినా లెక్కచేయ లేదు.

వడివడిగా ముందుకు నడవసాగాడు.

మెరుపుల వెలుగులో అతను ధరించిన బ్లాక్ జర్కిన్ మెరుస్తోంది.

చెట్టుకిందకి వచ్చాడు అంజన్.

ఎక్కడో రెండు నక్కలు బిగ్గరగా అరిచాయి.

ఆ చెట్టు.. మర్రి చెట్టు.. చెట్టు మొదళ్ళలా వున్న పెద్ద పెద్ద ఊడలతో, దెయ్యాల తలల్లా ఊగుతున్న చిన్న చిన్న ఊడలతో నిండివున్న వృక్షం అది. ఆ తోపు మొత్తానికి అదే పెద్దచెట్టు.

ఆ చెట్టు కొమ్మమీద కూర్చున్న గుడ్లగూబ- చక్రాలవంటి తన కళ్ళను అటూ యిటూ తిప్పి తీక్షణంగా చూస్తోంది. దాని చూపే భయం కలిగించేలా వుంది.

ఆ గుడ్లగూబను చూసి ఆగిపోయాడు అంజన్.

అదే క్షణంలో అతని వీపుమీద చెళ్ళుమని ఏదో తగిలింది.

అదిరిపాటుగా వెనక్కి తిరిగాడు.

చెట్టు ఊడ... గాలికి అతని వీపుని పరామర్శించింది.

గుండెదడను తగ్గించుకుని చిన్నగా నవ్వుకున్నాడు అంజన్.

ఉరుములు, మెరుపులు ఎక్కువ అయ్యాయి.

చెట్టు పక్కగా, భూమిలో పాతుకుపోయిన లావుపాటి ఊడల మధ్యగా తప్పించుకుని, ఒకోచోట ఒంగుని- దూరుతూ నడుస్తున్నాడు అంజన్.

ఎక్కడో పిడుగు పడింది. ఆ శబ్దానికి చెవులు మూసుకున్నాడు.

ఇటు వచ్చిన గిరిధర్ కనిపించడేమిటి?! అనుకుంటూ చెట్టు వెనక్కి వచ్చాడు.

అదే సమయంలో మెరుపులు మెరిశాయి.

ఆ మెరుపుల వెలుగులో భూమిలోకి పాతుకుపోయిన ఒక ఊడకు జారబడి అటు తిరిగి నిలుచున్న గిరిధర్ అతని కళ్ళకు కొన్ని క్షణాలు మాత్రమే కనిపించాడు.

మెరుపులు ఆగిపోవడంతో పాటుగా అక్కడ చిక్కని చీకటి ఆవరించింది.

"గిరిధర్... ఆకారం ఇక కనిపించదు. పోదాం పదండి" అన్నాడు అంజన్.

కాని అతని మాటకు గిరిధర్ నుంచి జవాబు లేదు...!

మరోమారు పిలిచాడు... జవాబు శూన్యం!!

అనుమానంతో గిరిధర్ భుజం మీద చెయ్యివేసి పిలిచాడు.

ముందుకు బోర్లా విరుచుకు పడిపోయాడు గిరిధర్.

వణుకుతున్న చేతులతో అతన్ని వెల్లికిలా తిప్పాడు... మెరుపులు మెరిసాయి...

ఒక్కక్షణం... మెరుపుల వెలుగులో గిరిధర్‌ని చూశాడు.

అంత ధైర్యవంతుడైన అంజన్ కెవ్వుమని బిగ్గరగా అరిచాడు.

క్షణం తర్వాత తేరుకున్నాడు.

వర్షం చినుకులు తలమీదుగా కారి అతని కళ్ళల్లో పడుతున్నాయి.

గిరిధర్ పీక నలిగి వుంది. దానికి గుర్తుగా నైలాన్ తాడు గుర్తులు పడి, అక్కడ పీక చూట్టూ నల్లగా కమిలిపోయి వుంది.

వర్షానికి తడిసిన జుట్టు అతని మొహం మీద పడి కళ్ళను కప్పేస్తోంది.

బిగుసుకుపోయి వున్న ఆ శవం, పడివున్న తీరు, ఆ నిశిరాత్రి సమయంలో మర్రివృక్షం కింద మెరుపుల వెలుగులో చూసిన... గిరిధర్ శవాన్ని చూసిన ఎవ్వరు మాత్రం నిగ్రహించుకోగలరు.

ఎంత ధైర్యవంతుడైనా ఆ స్థితిలో అరవక తప్పదు. అంజన్ కనుక అరవడంతో సరిపోయింది. మరొకరెవరన్నా అయితే గుండె ఆగి చచ్చేవారే!!!

చేసేదిలేక గిరిధర్ శవాన్ని భుజానికి ఎత్తుకున్నాడు అంజన్. విక్రమార్కుడి భుజం మీద భేతాళుడి శవం వ్రేలాడుతున్నట్టు, అంజన్ భుజం మీద గిరిధర్ శవం

వ్రేలాడుతోంది.

వర్షంలో తడుస్తూ చెట్లమధ్యగా బంగ్లా వైపు నడక సాగించాడు అంజన్.

## 16

గట్టిగా అరిచాడు అంజన్, ''గిరిధర్‌ని చంపేసారు'' అని.

ఆ అరుపుకు అంతా బయటికి వచ్చారు.

ఆ వెంటనే గందరగోళం అయిపోయింది.

గొల్లున ఏడవసాగారు మీనాక్షి, లలిత, పేరమాంబ, జలజలు...

కోటిలింగం, రవి, సోములు, మంగతాయారు దిష్టిబొమ్మల్లా చూడసాగారు.

జరిగింది జరిగినట్లుగా చెప్పాడు అంజన్.

ఎంత కాముకురాలైనప్పటికీ మీనాక్షి ఒక సాధారణ స్త్రీ. శీలానికి వున్న పవిత్రతను భంగపరిచినా, మానవత్వం గల స్త్రీగా ఆమెకు గిరిధర్‌పై ప్రేమాభిమానాలు వున్నాయి. ఆ కారణంగానే ఆమె మనస్ఫూర్తిగా రోదిస్తోంది.

కొన్ని నిముషాలు అలా ఏడుస్తూ వున్న మీనాక్షి, ఏడుపు ఆపేసింది. అంజన్ వంక తీక్షణంగా చూసింది.

పైకి లేచి అతని కాలర్ పట్టుకుని కుదుపుతూ ''చెప్పు.. నిజం చెప్పు.. నా భర్తను నువ్వే చంపేసి వుంటావ్? ఆయన్ని శవాన్ని చేసి తెచ్చి, ఏవో కథలు చెబుతున్నావ్! చెప్పు.. ఎందుకు చంపావ్?'' విచక్షణాజ్ఞానం మరచిపోయి అంది మీనాక్షి.

బాధలో వున్న ఆమె పరిస్థితి గ్రహించిన అంజన్ మిన్నకుండిపోయాడు. దాన్ని మరోలా అర్ధం చేసుకుందామె.

ఇంకా గట్టిగా కుదిపేస్తూ ''చెబుతావా చెప్పవా'' తీక్షణంగా అడిగింది.

''గిరిధర్‌ని చంపాల్సిన అవసరం నాకేముంది. నాకేం తెలియదు. మనిషిని చంపడమంటే మీకంత తేలికగా వున్నట్టుంది. అతన్ని చంపడం వల్ల నాకు ఒరిగేదేముంది?''

''నువ్వు లలితను ప్రేమిస్తున్నావని నాకు తెలుసు. నాభర్త తన తదనంతరం తన వాటాకు వచ్చే ఆస్తి మొత్తాన్ని ఆమెకు రాసేసారు. ఆ ఆస్తి కోసమే నువ్వు నాభర్తను చంపి వుంటావు'' ఏదేదో ఊహించుకొని అంది మీనాక్షి.

''పొరపాటు... లలిత నన్ను ప్రేమించడం లేదు. కావలిస్తే మీరే అడగండి ఆమెను'' పిచ్చెక్కేలా చూస్తూ అన్నాడు అంజన్.

"అయితే హత్య చేయబడ్డ అందర్నీ మరోచోటుకి ఎందుకు చేరవేస్తున్నావు? ఆ అవసరం నీకేమిటి?"

"నాన్‌సెన్స్... చచ్చినవాళ్ళను కళ్ళెదురుగా వుంచుకొని ఈ బంగ్లాలో ఇలా మసలగలరా!.. అలా అయితే చెప్పండి.. ఆ మిగిలిన శవాల్ని కూడా తెచ్చి మీ ఎదురుగా వుంచుతాను" ముక్కుపుటాలు అదురుతూండగా అన్నాడు.

నిర్ఘాంతపోయింది మీనాక్షి. ఏమీ జవాబు చెప్పలేకపోయింది. ఆమెలో అప్పటికే శక్తి క్షీణించిపోయింది. ఏడ్చి, అరచి, మాట్లాడి వుందేమో ఆమెలో ఓపిక నశించిపోయింది.

అంజన్ కాలర్ వద్ద వేసిన రెండుచేతులూ అలాగే వుంచి నేలకు జారిపోయింది. అలా జారడంలో ఆమె చేతులు అతను ధరించిన ఆయిల్ జర్కిన్ జిప్పర్ మీదనుంచి కిందకు జారాయి. ఆటోమేటిగ్గా ఆమె ప్రమేయం లేకుండానే జిప్పర్ కిందవరకూ ఊడిపోయింది. మీనాక్షి నేలకు జారిపోయింది.

ఆమెకు స్పృహ తెప్పించే ప్రయత్నంలో పడ్డారు మంగతాయారు, కోటిలింగంలు.

లలిత ఇంకా తేరుకోలేకపోతోంది. ఆమెకు ఆ కుటుంబంలో అందరికన్నా ప్రేమాభిమానాలు గల వ్యక్తి గిరిధర్‌పై వున్న ప్రేమ- ఆమెకు తన తల్లిదండ్రుల మీద కూడా లేదేమో!

అంజన్ తన రూంవైపు వెళ్ళబోతూ కోటిలింగం మాటవిని ఆగాడు.

"బాబూ... మీనాక్షి భర్తపోయిన స్థితిలో ఏదో వాగింది. అదేం పట్టించుకోకు. ఈ శవాన్ని కూడా అక్కడికే చేరవేయ్" నిర్వికారంగా అన్నాడు కోటిలింగం.

చేసేదిలేక గిరిధర్ శవాన్ని భుజం మీద వేసుకున్నాడు అంజన్.

"రవీ.. నువ్వు సాయం వెళ్ళు.." అన్నాడు కోటిలింగం.

"అమ్మ బాబోయ్.. నాకు శవాలంటే చాలా భయం" తప్పించుకున్నాడు రవి.

"సరే.. నేనే వస్తాను పద" అంటూ టార్చిలైటుతో అతని వెంట వెళ్ళాడు కోటిలింగం.

టార్చి వెలుగు వెంట కోటిలింగం ముందు నడుస్తుండగా, వెనుక అతన్ని అనుసరించాడు అంజన్.

వర్షం తగ్గుముఖం పట్టింది.

కీచురాళ్ళు అరవడం మొదలెట్టాయి...!

* * *

రోల్స్‌రాయిస్ కారు కింద వెల్లికిలా పడుకుని గంటసేపు జపం చేసాడు మదన్.

ఆ పద్ధతి కూడా అతనికి కష్టంగానే వుంది.

ఒళ్ళంతా చెమట్లు పట్టేశాయి. చీకటి అంధకారంలా వుంది లోపలంతా...

మరికొంత సేపటికి బయట వర్షం పడుతూండటం అతనికి తెలుస్తూనే ఉంది.

మరోగంట అతి కష్టంమీద గడిపాడు.

అప్పటికి వర్షం పూర్తిగా వెలిసిపోయింది.

తుంపరలు కూడా పడటం లేదు.

తాళం తీస్తున్న శబ్దం వినిపించి బోర్లా పడుకుని, దృష్టిని ముందుకు సారించాడు మదన్.

సిగరెట్ పీకలు కిందపడి వుండటం చూశాడు ఆగంతకుడు.

జేబులోంచి రివాల్వర్ తీసి, కుడిచేతిలో వుంచుకున్నాడు.

ఎడమ చేత్తో మూడు కార్ల డిక్కీలు ఎత్తిచూశాడు.

ఏదో స్ఫురించి పెన్ టార్చితీసి ఒక్కో కారు కింద చూడసాగాడు.

అది గమనించిన మదన్ గుండెలు దడదడలాడాయి.

జేబులో చెయ్యి పెట్టబోయాడు.

అదే క్షణంలో అతన్ని చూసేశాడు ఆగంతకుడు.

గరగరలాడుతూ ఆజ్ఞాపించాడు. ‘‘కదలవద్దు.. అలాగే బయటికి రా..’’ కంఠం గంభీరంగా వుంది. గరగరమని గంభీరంగా వినిపిస్తున్న ఆ కంఠాన్ని గుర్తుపట్టడం కష్టం.

తనను గుర్తుపట్టకుండా గొంతు మార్చి మాట్లాడుతూ వుండవచ్చు ఆగంతకుడు.

మెల్లిగా జరుగుతూ బయటకు వచ్చాడు మదన్.

‘‘పైకిలే...’’ అన్నాడు ఆగంతకుడు.

లేస్తున్నట్టు లేచి; కింద పడిపోయి, కాలుతో ఆగంతకుని చేతిలోని రివాల్వర్‌ని తన్నేశాడు మదన్.

రివాల్వర్ ఎగిరి ఏ మూలో పడిపోయింది.

ఆగంతకుడి కళ్ళు చింతనిప్పుల్లా ఎర్రబడ్డాయి.

అదే అదనుగా భావించి ఎగిరి ఆగంతకుడి గుండెలపై తన్నాడు మదన్.

నాలుగడుగుల దూరంలో పడ్డాడు ఆగంతకుడు. ఆ వెంటనే మెరుపులా పైకి లేచి మదన్ మొహం మీద పిడిపోటు పొడిచి, చెయ్యి మెలితిప్పి- గాలిలోకి లేపి గిరాటు వేసాడు.

మదన్ గాలిలో ఆరడుగుల ఎత్తుకు లేచి, ఇంపాలా మీదుగా అవతలకు పోయి పడ్డాడు.

అతని నడుం కలుక్కుమంది. పక్కటెముకలు పటపటలాడాయి. తల నేలకు పొడుచుకుని ఖంగున శబ్దం చేసింది. అంతే...

మదన్ కళ్ళకు పంచరంగుల నక్షత్రాలో తెలియదు, శిల్కుపరదాలో తెలియదు, నల్లని చీకటి తెరలో తెలియదు... మొత్తానికి ఏవో కనిపించాయి. తల పక్కకు వాల్చేసి స్పృహ కోల్పోయాడు.

ముసుగు చాటున నవ్వుకున్నాడు ఆగంతకుడు.

టార్చి వెలుగులో రివాల్వర్ వెతికి జేబులో వేసుకున్నాడు.

సీక్రెట్ డోర్ తెరచి పెట్రోల్ టిన్ బయటికి తీశాడు.

* * *

మొహం మీద ఏదో చిలకరింపబడేసరికి తృళ్ళిపడి లేచాడు మదన్.

ఎదురుగా అంజన్ వున్నాడు.

చిరునవ్వు నవ్వి మొహం మీద తడిని భుజాలకు తుడుచుకుని; తల తడుము కున్నాడు.

చిన్న బొప్పి కట్టింది తలమీద.

విషయం తెలుసుకుని "సరే.. ఇలా సమయం వృధాచేస్తే లాభంలేదు. ఇక్కడంతా గాలించి వదులుదాం... ఏమైనా తెలుస్తుందేమో చూద్దాం" అంటూ గేరేజ్‌లో అంగుళం అంగుళం పెన్ టార్చి వెలుగులో శోధించసాగాడు అంజన్.

మదన్ మరోవైపుగా శోధిస్తున్నాడు.

అరగంటసేపు కష్టపడి చెక్ చేసినా లాభం లేకపోయింది.

మదన్ నిస్పృహగా గోడకు జారబడ్డాడు. "నా నడుం నొప్పి మొదలయింది కానీ ఏం కనిపించింది. ఇలా అయితే కనిపించినట్టే... నీకో నమస్కారం పెడతానుగానీ ఇక్కడినుంచి కదులు తండ్రీ..." అంటూ కదలడంలో అతని మోచేయి గోడకు పొడుచుకుని సర్..మని శబ్దమయింది.

మదన్ వంక చూసిన అంజన్ మొహంలో సంతోషం కనిపించి వెనుతిరిగాడు అతను.

మదన్ కంటికి గోడలో ఏర్పడ్డ ఖాళీలోంచి అల్మారా, ఆ లోపల వున్న పెట్రోల్ టిన్స్ కనిపించాయి.

తన మోచేయి పొడుచుకున్న చోట చూశాడు నిశిత నేత్రాలతో.

గోడరంగులో కలిసిపోయి, గోడలో కవర్ అయిపోయినట్టున్న కుంకుడుకాయ పరిమాణంలో గల బుడిపె ఒకటి కనిపించింది.

దాన్ని మళ్ళీ ప్రెస్ చేసాడు. సీక్రెట్ డోర్ గోడను కవర్ చేసింది. తిరిగి నొక్కాడు. సర్‌మని తెరచుకుంది.

''ఒక చిక్కు విడిపోయింది. ఈ పెట్రోల్ టిన్స్ గురించి ఎవరికీ చెప్పకు'' అన్నాడు, సీక్రెట్ డోర్ క్లోజ్ చేస్తూ అంజన్.

''ఎందువల్ల?'' ప్రశ్నించాడు మదన్.

''పెట్రోల్ కనిపించిందని తెలియగానే అంతా మద్రాసు వెళ్ళిపోదామంటారు. అలాచేస్తే హంతకుడు మనకిక దొరకడు... ఈరోజు గిరిధర్‌ని చంపేశాడు. ఇన్ని హత్యలు చేసిన హంతకుణ్ణి మనం వదలకూడదు. ఎలాగైనా వల వేసి పట్టాలి'' చెప్పాడు.

''ఆఁ.. అప్పుడే మరో హత్యా...?!''

''అవును. గిరిధర్ శవాన్ని పెంకుటింట్లో భద్రపరిచి నేనిలా వచ్చాను నీకోసం''

''హంతకుడిని పట్టడానికి ప్లాన్ నువ్వు ఆలోచించు''

''ఆలోచించనవసరం లేదు. ఇన్ని హత్యలు చేసిన హంతకుడు మరో హత్య చెయ్యడానికి వెనుకాడడు. తప్పకుండా మరో హత్య చెయ్యడానికి ప్రయత్నిస్తాడు. ఆ సమయం మనం వినియోగించుకోవాలి''

''ఎవర్ని హత్య చెయ్యవచ్చని నీ ఉద్దేశ్యం?''

''ఏమో! మనల్నే కావచ్చు''

''ఇంతవరకూ మన జోలికి రాలేదు కదా?!''

'అవును. కాని మనం ప్రతిరోజూ హంతకుడికి అడ్డుపడుతున్నాం. ఆ కోపంతో మనల్ని చంపాలని నిశ్చయించుకున్నా ఆశ్చర్యపోనవసరం లేదు''

''మన జాగ్రత్తలో మనం వుందాం. మరి హంతకుడి ఉనికి ఎలా కనిపెట్టడం?''

''చూద్దాం.. మనకు క్లూ దొరికే మరో సంఘటన జరిగేవరకు వేచి చూడటమే... అంతవరకు ఏం చెయ్యలేం''

''నాకొక అనుమానం. గేరేజ్‌లో ఎవరో వున్నారని హంతకుడు ఎలా ఊహిస్తున్నాడు... కాదు గ్రహిస్తున్నాడు'' అడిగాడు మదన్.

''ఆ ఆలోచనే నాకు రాలేదు సుమా! బహుశా ఆ కీలకం గేరేజ్ బయటే వుండొచ్చు.. చూద్దాం పద'' అన్నాడు అంజన్.

ఇద్దరూ బయటకు వచ్చారు. డోర్స్ మూసి వెతకసాగారు. డోర్స్ మూల కింద పడివున్నాయి రెండు సిగరెట్ పీకలు. వాటిని పైకి తీసి పరీక్షించారు.

సిగరెట్ పీకల మధ్యభాగాల వద్ద నలిగివున్నాయి. అవి రెడ్‌విల్స్ ఫిల్టర్ సిగరెట్ పీకలు.

''కోటిలింగం, రవి... ఇద్దరూ కాల్చేవి రెడ్‌విల్స్ సిగరెట్లే...'' అన్నాడు మదన్.

''అవును...'' సాలోచనగా అన్నాడు అంజన్.

''గేరేజ్ డోర్స్ ఇరుకుల్లో వుంచినందువల్ల యివి నలిగిపోయాయి. నువ్వు చెప్పినదానికంటే హంతకుడు మరింత తెలివైనవాడు. ఈ చిన్న విషయాన్ని గ్రహించలేక మనం చిక్కుల్లో చిక్కుకున్నాం'' మదన్ చెబుతున్న మాటలు విన్నాడు. కాని జవాబు చెప్పలేదు అంజన్.

ఇద్దరూ తాళం వేసి లోనికి నడిచారు.

# 17

తెల్లవారురూము మూడు గంటలయింది.

కిశోర్ హత్య చెయ్యబడ్డ రూముకి ఎదురుగా వున్న మరో ఖాళీ రూమ్‌లో... మీనాక్షి, రవి కామకేళీ విలాసాల్లో మునిగి తేలుతున్నారు.

భర్త చనిపోయి మూడుగంటలు కూడా పూర్తికాలేదు. అప్పుడే మరో పురుషుడి కౌగిట్లో నగ్నంగా అమరసుఖాలు అనుభవిస్తోంది. బహుశా భర్త చనిపోయిన బాధను మరచిపోవడానికి కావచ్చు, లేక ఎప్పుడు తనకు కూడా చావు మూడుతుందో తెలియదు కనుక ఈలోపులోనే పూర్తి ఆనందాన్ని చవిచూడాలన్న తలంపు కావచ్చు.

ఆనందంతో మూలుగుతోంది మీనాక్షి...

రక్తం రుచి మరిగిన పులి, చపలచిత్తురాలైన స్త్రీ- ఒకే జాతికి చెందినవారు. వారి క్రియలు అంతమవడం చాలా కష్టం. రక్తం రుచి మరిగిన పులి ఏ విధంగా అయితే రక్తాన్ని చూసి వదిలిపెట్టదో, ఆ విధంగానే- చపలచిత్తురాలు తన కామవాంఛను తీర్చుకోవడానికి ఎవరు దొరికినా వదిలిపెట్టదు.

మీనాక్షికి ఆ విధంగానే రవి తగిలాడు. వెంటనే కాచ్ చేసింది.

మరో అరగంటసేపు రవితో గడిపి, లేచి బట్టలు వేసుకుంది మీనాక్షి.

ఆమెకంటే ముందుగా తన రూంకి వెళ్ళిపోయాడు రవి.

రెండు నిముషాలు ఆగి, తన రూంని చేరుకుని తలుపు గడియ పెట్టింది మీనాక్షి.

శారీరక వాంఛను తీర్చుకున్నందువల్ల ఆమెకిప్పుడు మానసికంగా తృప్తిగా వుంది.

అక్కడే బట్టలు విప్పేసి ఎటాచ్‌డ్ బాత్రూంలో శుభ్రంగా స్నానంచేసి బట్టలు ధరించింది.

అద్దం ఎదురుగా నిలుచుని తనను తాను చూసుకుని మురిసిపోసాగింది. నిలువు టద్దంలో చూసుకుంటూ- తెల్ల వస్త్రాలు ధరించినా తన అందం చెక్కు చెదరలేదని ఆనందపడింది.

అద్దంలో ఎవరి మొహం వారికే అందంగా కనిపిస్తుంది. అద్దానికి భేదభావాలు లేవు. అద్దానికి అంతా సమానులే... అన్న విషయం మీనాక్షికి తెలియదు కాబోలు.

నిలువుటద్దం ముందు వున్న బల్లమీద కూర్చుంటూ, ఆ క్షణంలో కనిపించిన అద్దంలోని ప్రతిబింబాన్ని చూసి- గజగజ లాడుతూ వెనుతిరిగి కెవ్వున అరిచింది భయంకరంగా.

అద్దంలో కనిపించిన ప్రతిబింబం గిరిధర్‌ది.

బయటకు వెళ్ళే తలుపుల ప్రక్కన గోడకు జారబడి వుంది- నిర్జీవంగా వున్న గిరిధర్ శవం భీతి గొలిపేలా వుంది.

మరోసారి కేక వేసి బయటకు పరుగుతీసింది మీనాక్షి.

ఆమె కేకలు విన్న అంజన్, మదన్ కిందకి వచ్చారు. భయం వల్ల మెలుకువ వచ్చినా ఎవరూ బయటికి రాలేదు. లలిత మాత్రం మేలుకుని లేదు.

కంగారుగా ‘‘శవం... శవం...’’ అంది వాళ్ళ దగ్గరికి ఆవేశపడుతూ వచ్చి.

‘‘ఎవరి శవం?’’ అంజన్ అడిగాడు.

చెప్పింది. ఆమె వెంట లోపలికి వెళ్ళిన వాళ్ళిద్దరికీ ఏ శవమూ కనిపించలేదక్కడ.

‘‘ఏదీ... ఇక్కడే వుండాలి... ఏమైపోయింది’’ పిచ్చి చూపులు చూస్తూ చెప్పింది.

ఆమెకు ధైర్యం చెప్పారు ఇద్దరూ.

‘‘ఇక్కడ పడుకోలేకపోతే మేడ మీద మీ చెల్లెళ్ళ గదిలో పడుకోండి. రేపటి నుంచి మాత్రం ఎవరినో ఒకర్ని మీకు తోడుగా పడుకోబెట్టుకోండి’’ అన్నాడు అంజన్.

‘‘ఫరవాలేదు. తలుపులు వేసుకుని పడుకుంటాను’’ ధైర్యంగా అందామె.

ఇద్దరూ తలాడించి తమ రూమ్‌కి చేరుకున్నారు.

‘‘మధూ... నువ్వొక విషయం గ్రహించావా?’’ అడిగాడు అంజన్.

‘‘ఏమిటది?’’ అన్నాడు మదన్.

‘‘ప్రీతి చనిపోయిన ముందురోజు రాత్రి ఆమెకు ఆమె భర్త శంకర్ శవం కనిపించింది.

అలాగే ఈరోజు చనిపోయిన తన భర్త గిరిధర్ శవం మీనాక్షికి కనిపించింది.''

''అంటే... రేపు రాత్రి మీనాక్షి హత్య చెయ్యబడుతుందని నీ అనుమానమా?''

''అనుమానం కాదు... రెండు సంఘటనలూ ఊహిస్తుంటే నాకు నమ్మకం కలుగుతోంది.''

''ఈ విషయం మీనాక్షికి చెబితే...''

''చెప్పకపోవడమే మంచిది. మరింత భయపడుతుంది. రేపు రాత్రి ఆమెకు తెలియకుండా ఆమెను అంటిపెట్టుకుని వుండు. ఎక్కడ కాపు కాయాలో తెలుసు కదా!''

''తెలుసు... ఈ రాత్రి మీనాక్షి, రవి కలుసుకున్న రూంలో...'' నవ్వుతూ చెప్పాడు మదన్.

''గుడ్... ఈ శవాలు మాయం కావడం, ప్రత్యక్షమవ్వడం చూస్తుంటే... దీని కీలకమంతా రంగనాథవర్మగారి ఆజ్ఞ ప్రకారం తాళం వేసివున్న రూములోనే వుందని నా అనుమానం. దాని సంగతి నేను తేల్చుకుంటాను'' అని ఏదో ఆలోచనతో ''నువ్వు పడుకో... ఇప్పుడే వస్తాను'' అంటూ బయటికి పరుగు తీశాడు అంజన్.

తోపులో వేగంగా పరుగుతీస్తూ పెంకుటిల్లును చేరుకున్నాడు. గొళ్ళెం తీసి తలుపులు తోశాడు.

ముక్కులు పగిలిపోయేలా సోకింది దుర్వాసన.

జేబులోంచి పెన్ టార్చి తీసి దాని వెలుగును నలుమూలలా వేశాడు.

ప్రసరించిన ఆ వెలుగులో ముందుగా అతనికి కనిపించింది శంకర్ శవం. దుర్గంధం విపరీతంగా వస్తోంది.

ముక్కు మూసుకుని మరోవైపు చూశాడు.

గుండెలమీద రక్తం గడ్డకట్టి, బిగుసుకుపోయి భీకరంగా వుంది కిశోర్ శవం. మరోపక్కన ప్రీతి శవం చూసి, వెలుగును ఆ పక్కకు ఫోకస్ చేశాడు.

అక్కడ... బీభత్సంగా వున్న గిరిధర్ శవం, తానింతక్రితం ఎలా వుంచాడో అదే స్థితిలో నిశ్చలంగా వుంది.

ఐదునిముషాల క్రితం మీనాక్షి రూములో వున్న శవం ఇక్కడెలా ప్రత్యక్షమైంది?... జవాబు దొరకని ప్రశ్న అది.

అక్కడంతా నిశ్శబ్దం...

తానొక్కడూ శవాల మధ్య....

అంజన్ గుండె క్షణం ఆగి, తిరిగి కొట్టుకోసాగింది.

క్షణం కూడా అక్కడ ఆగకుండా బయటకు వచ్చి తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు అంజన్.

* * *

ఉదయం పది గంటలకి తోటలో నడుస్తున్న అంజన్‌ని నిలదీసింది జలజ.

"అంజూ... లలిత నిజంగా మూర్ఖురాలు. అది ప్రేమించకపోతే పోనీయ్... నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమించే మనిషిని నేనున్నానని మరచిపోవద్దు" లాలనగా చెప్పింది జలజ.

"నీ మంచితనానికి చాలా కృతజ్ఞుణ్ణి. లలిత నా ప్రేమని తిరస్కరించాక, నాలో ప్రేమ చచ్చిపోయింది. ఇక ఎవర్నీ ప్రేమించే శక్తి నాకు లేదు" అన్నాడు అంజన్.

"నీ శక్తి నీకు తెలియడం లేదు. నువ్వు నన్ను ప్రేమించగలవు"

"ప్రేమించగలిగినా ప్రేమించను"

"ప్లీజ్.. నాకోసం.."

"క్షమించు..నాకు అవతల చాలా పనివుంది" అంటూ ఆమె జవాబుకై ఎదురు చూడకుండా వడివడిగా అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

వాళ్ళ సంభాషణ అంతా చెట్టుచాటున రెడ్‌విల్స్ సిగరెట్ కాలుస్తూ విన్నాడు రవి.

చివరికంటా కాలిన సిగరెట్‌ని బూటుకింద నలిపి జలజ ముందుకు వచ్చాడు "ఏమిటీ నాటకం" అంటూ.

"నాటకమా!" తెలియనట్లు అమాయకంగా అంది జలజ.

"నన్ను ప్రేమిస్తున్నానని చెప్పి, అంజన్ వెంట ఎందుకు పడ్డావో?" ఎత్తిపొడుపుగా అన్నాడు.

"అది నా యిష్టం"

"మరి నాకిచ్చిన మాట"

"పిచ్చివాడా! అది నేనాడిన నాటకం"

"అయితే నన్నోపావుగా ఉపయోగించుకున్నావన్నమాట... నీమీద మీ పెద్దక్క చాలా మంచిది"

"మా అక్క మంచితనం ఎలా గ్రహించావో?"

"ఎలాగైతే నీకెందుకు?.. నన్ను ప్రేమిస్తావా, ప్రేమించవా?"

“అంజన్ నా ప్రేమ కాదన్నాక, నేనెవర్నీ ప్రేమించలేను. ఆ ఓపిక నాలో లేదు” అంది నటిస్తూ.

“వాడు చెప్పిన డైలాగులు నాకు అప్పజెపుతున్నావా? నన్ను ప్రేమించలేకపోతే నా కోరిక తీర్చు. నిన్ను విడిచిపెడతాను. లేకపోతే నీ బండారం బయటపెట్టి, నిన్ను తల ఎత్తుకోనివ్వకుండా చేస్తాను” బెదిరించాడు రవి.

“బెదిరిస్తున్నావా?” రెక్‌లెస్‌గా అంది.

“కాదు. హెచ్చరిస్తున్నాను”

“నీ కోరిక ఈ జన్మలో తీరదు. నీ యిష్టం వచ్చినట్లు చేసుకో... కాని దానివల్ల నాకంటే నువ్వే ఎక్కువగా నష్టపోతావు” నవ్వుతూ చరచర అక్కడినుంచి వెళ్ళిపోయింది జలజ.

చేసేది లేక ఆమె వెళ్ళినవైపే కోపంగా చూస్తూ అరచేతిలో పిడికిలి బిగించి కొట్టుకున్నాడు. మరో సిగరెట్ వెలిగించి దమ్ములాగి, రింగు రింగులుగా గాల్లోకి పొగ వదుల్తూ ఆలోచిస్తున్నాడు రవి!

# 18

త్వరగానే భోజనాలు ముగించి రాత్రి ఎనిమిది గంటలకల్లా పడుకున్నారంతా.

పదకొండు గంటల సమయంలో రవిని తన రూముకే రప్పించుకుంది మీనాక్షి. ఎవరూ చూస్తారన్న భయం ఆమెకు లేదు. అందులో ఆశ్చర్యమూ లేదు.

క్షణాల్లో ఇద్దరూ బిజీ అయిపోయారు.

“రవీ.. నువ్వు నాతోనే వుండిపోకూడదూ?” అడిగింది మీనాక్షి.

“అలాగే.. అప్పటివరకూ మనం బ్రతికి వుంటే...”

“మనం బ్రతుకు మీద ఆశ పెంచుకుంటే బ్రతుకుతాం”

“సరే.. అవన్నీ తర్వాత ఆలోచిద్దాం” అన్నాడు రవి, ఆ ప్రసక్తి ఆసక్తిగా లేక.

వాళ్ళిద్దరూ నిన్న రాత్రి కలుసుకున్న రూములో పడిగాపులుపడి, రవి, మీనాక్షి ఎప్పుడు వస్తారా అని జపం చేస్తూ కూర్చున్నాడు మదన్.

సరిగ్గా అదే సమయానికి...

కిశోర్ హత్య చేయబడిన రూమ్‌లోకి దూరి, తలుపు గడియపెట్టేశాడు అంజన్.

తనున్న రూమ్‌కి, ఆ ప్రక్కరూమ్‌కీ మధ్యనున్న తలుపుల వద్ద నిలుచున్నాడు.

సాక్సులో దాచుకున్న బటన్ నైఫ్ తీసి ప్రెస్ చేశాడు. చక్‌మని బయటపడింది

ఏడంగుళాల పొడవుగల పదునైన బ్లేడ్. దాన్ని తలుపుల ఇరుకులోకి దూర్చి పైకెత్తడానికి ప్రయత్నించసాగాడు. ఎలాగైతే అరనిముషం తర్వాత పైకి లేచింది గడియ.

తలుపులు తోసుకుని నిశ్శబ్దంగా లోనికి ప్రవేశించాడు అంజన్.

పెన్ టార్చి తీసి బటన్ నొక్కి ఆ వెలుగులో నలుమూలలా పరీక్షించసాగాడు.

అక్కడక్కడా బూజులు, సాలిగూళ్ళతో, నేలంతా మట్టితో అసహ్యంగా వుందా రూము.

ఒక చెక్క బీరువా, ఒక మంచం, దిండు, దుప్పటి లేని ఖాళీ పందిరిమంచం తప్ప ఆ రూంలో ఇంకేమీ లేవు.

మారుతాళంతో బీరువా తెరిచాడు అంజన్.

బీరువాలో వున్న నాలుగు అరలు- అనేక పురాతన కాలం నాటి చిన్న చిన్న చెక్కడాలు, నాణాలు, పాలరాతి, రాతి విగ్రహాలు మొదలైనవాటితో నిండివున్నాయి.

పురాతన కాలం నాటివి ఏవైనా తన తండ్రికి చాలా మక్కువ అని చెప్పిన లలిత మాటలు చెవుల్లో గింగుర్లు ఎత్తాయి.

ఆలోచనలను పక్కకు నెట్టేసి బీరువా తాళం వేసి, ఆ రూమ్ అంతా నిశితంగా అంగుళం కూడా విడిచిపెట్టకుండా పరికించసాగాడు.

నాలుగడుగులు ఎత్తున్న పందిరిమంచం కింద స్క్వేర్‌గా వున్న స్థలంలో మట్టి లేకపోవడం, పలకలా వున్న సన్నని గీతను చూసి అనుమానంతో మరింత జాగ్రత్తగా పరీక్షించాడు.

చేతివ్రేళ్ళతో కొట్టిచూశాడు. టక్.. టక్..మని శబ్దం వినిపించింది.

అక్కడ అండర్‌గ్రౌండ్ వుందని గ్రహించి మరింత హుషారుగా పందిరిమంచాన్ని శోధించసాగాడు.

ఒక మంచం కోడు ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్టు అంజన్‌కి అనిపించి ఆ మంచం కోడు మీద చెయ్యి వేసాడు.

ఆ కాస్త చలనంకే స్క్వేర్ ప్లేస్‌లో వున్న చెక్కపలక కొంచెం పైకి లేచింది. ఒక రౌండు తిప్పాడు- మంచం కోడుని. చెక్కపలక పూర్తిగా పైకి లేచింది.

భూగృహంలోకి మెట్లు కనిపించాయి.

ఆ మెట్లమీదుగా జాగ్రత్తగా నేలమాళిగలోకి దిగసాగాడు అంజన్.

పది మెట్లు దిగిన తర్వాత చూశాడు, పొడవుగా వున్న ఆ సొరంగ మార్గాన్ని. సొరంగం ఎత్తు తొమ్మిది అడుగులుంది. బూజులు, సాలిగూళ్ళు, మట్టి, మశానం తప్ప మరేమీ

లేదు. సొరంగంలో వెలుతురు కోసం అక్కడక్కడా కాగడాలు వెలుగుతున్నాయి.

సొరంగంలో అలా ముందుకు నడిచాడు. ఫర్లాంగు దూరం వరకూ వుందా సొరంగం దారి.

దాని చివర మెట్లు చూసి పైకి ఎక్కాడు. అవి కూడా పది మెట్లే వున్నాయి.

మెట్లెన్నీ ఎక్కాడు అంజన్. మెట్ల చివర ఏదో మర కనిపించి తిప్పాడు. టాప్‌డోర్ పైకి లేచింది.

పైకి ఎక్కాడు...

ఆ రూమ్ పెంకుటింట్లో రెండో రూమ్ అని గ్రహించాడు. ఆ రూమ్‌లోంచి పక్క రూంలోకి ప్రవేశించాడు ముక్కు మూసుకుని.

శంకర్, గిరిధర్, కిశోర్, ప్రీతిల శవాలు నిశ్చలంగా వున్నాయి.

ఇక వాటివంక చూడలేక ముందురూమ్‌లోకి వచ్చేసి, యధాప్రకారంగా సొరంగ మార్గం గుండా తాళం వేసివున్న రూంలోకి వచ్చేశాడు అంజన్.

అక్కడనుంచి ఎలా వెళ్ళాడో అలాగే బయటపడి మదన్ దాగిన రూమ్‌లోకి ప్రవేశించాడు.

''ఇంకా రాలేదు'' కర్టెన్ చాటునుంచి వచ్చిన మదన్ చెప్పాడు.

''సరే.. ఇక్కడి సంగతి నేను చూస్తాను. నువ్వు తోపులో వున్న మర్రివృక్షం వెనుక దాగివుండు. పన్నెండు గంటలు దాటిన తర్వాత అక్కడికో దెయ్యం వస్తుంది. దాని అంతేదో చూడు'' చెప్పి మదన్‌ని పంపేసి కర్టెన్ చాటున దాగాడు అంజన్.

* * *

అర్ధరాత్రి పన్నెండు గంటలు.

గోడ గడియారం టంగ్.. టంగ్..మని గంటలు కొట్టసాగింది. పన్నెండు గంటలు ముగిసేసరికి కేకలు, అరుపులు, ఆర్తనాదాలు, పెడబొబ్బలు బీభత్సంగా, భయానకంగా వినిపించసాగాయి.

హృదయాన్ని కదిలించివేసే హృదయ విదారకమైన కేకలవి...

మరికొంత సేపటికి కేకలు ఆగిపోయాయి.

అదే సమయానికి తెల్లని ఆకారం సింహద్వారం దాటుతోంది, గజ్జెల శబ్దం చేసుకుంటూ. ఆకారం కాలి అందియలు ఘల్లు.. ఘల్లు..న భీకరంగా వినిపిస్తున్నాయి.

మరో గంటన్నర సమయాన్ని హుషారుగా గడిపేశారు రవి, మీనాక్షిలు...

రవి బట్టలు ధరించి తన గదికి పోయి పడుకున్నాడు.

మీనాక్షి అలసటగా మంచం మీద వాలిపోయింది.

సరిగ్గా అదే క్షణాన...

ఆమె పక్కరూం మధ్య తలుపు తెరుచుకుని లోనికి అడుగువేశాడు ఆగంతకుడు.

నిశ్శబ్దంగా ఆమె పక్కకు చేరాడు.

మోకాలు దగ్గర జిప్పర్ కిందకి లాగాడు.

ఆ శబ్దం.. నిశ్శబ్దంలో ఆ శబ్దం సర్..మని వినిపించింది.

ఉలిక్కిపడి కళ్ళు తెరిచిన మీనాక్షి ఆగంతకుడిని చూసి గజగజ వణికిపోసాగింది.

"వద్దు..నన్ను చంపవద్దు" బ్రతిమాలసాగింది.

ఆగంతకుని కళ్ళల్లో ఎరుపుజీరలు మీనాక్షి ప్రాణాలను తోడేస్తున్నట్లుంది, ఆమె భయపడడం.

పిడిని గట్టిగా పట్టుకుని కత్తిని ముందుకు చాపాడు.

"ప్లీజ్..నన్ను చంపకు..నేను చావను" ఏదేదో అనేస్తోంది.

ఫ్లోరోసెంట్ బల్బ్ వెలుగులో కత్తి బ్లేడ్ తళతళలాడుతూ మెరుస్తోంది.

మీనాక్షికి తనేమైపోతానో అనేది తెలియకుండానే కత్తి వేగంగా, సుతిమెత్తగా ఆమె కంఠంలో దిగబడిపోయింది.

చిన్న కేక కూడా బయటికి రాకుండానే ఆమె ప్రాణాలు చెప్పాపెట్టకుండా ఎటో ఎగిరిపోయాయి.

మీనాక్షి కంఠంలో దిగిన కత్తిని మరింత మెత్తగా బయటికి లాగి, ఆమె పీకను పర..పర..మని బీభత్సంగా కొయ్యసాగాడు ఆగంతకుడు.

ఐదు నిముషాలలో తన కార్యక్రమాలు ముగించి మేడమీద లలిత గది ముందుకు వెళ్ళాడు.

కత్తిని తలుపుల సందులో ఇరికించి గడియ తప్పించాడు. లోనికి దూరి గడియ పెట్టేసి వెనుతిరిగాడు ఆగంతకుడు.

ఫోంబెడ్ మీద ప్రశాంతమైన, అమాయకమైన వదనంతో ఆదమరచి నిదురపోతోంది లలిత.

ఆమె కళ్ళల్లోకి తీక్షణంగా ఒకమారు చూశాడు ఆగంతకుడు. ఆ వెంటనే కర్తవ్యం గుర్తుకువచ్చి; బ్లాక్ పాంటులోంచి రివాల్వర్ తీశాడు.

ఆమె నుదుటికి గురిపెట్టాడు... సేఫ్టీకాచ్ ముందుకు తోసి, ట్రిగ్గర్ మీద వేలు బిగించబోయాడు.

సరిగ్గా అదే సమయంలో కదిలింది లలిత...

మెరుపులా మంచం కిందకు దూరాడు ఆగంతకుడు.

మెలుకువ వచ్చిన లలిత పైకి లేచి గడియ తీసింది, బాత్రూంకి వెళ్దామని.

వరండాలోకి వచ్చి కాజువల్‌గా హాల్లోకి చూసింది. దానికి కారణం షాండ్లియర్స్ చేస్తున్న శబ్దం వల్ల...

రాత్రులందు జరుగుతున్న సంఘనలకు భయపడి మొదటిరాత్రి నుంచే హాలులోని లైట్లు ప్రతిరాత్రీ వెలిగించి వుంచేస్తున్నారు. అందువల్ల హాలులోని విద్యుత్ దీపాలు దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి.

ఆ వెలుగులో ఆమె చూసిన రెండు భయంకర దృశ్యాలకు లలిత తనను తాను అదుపు చేసుకోలేకపోయింది.

ఒళ్ళంతా షివరింగ్ వచ్చినట్టు కంపించిపోతుండగా కెవ్వున భీకరంగా, హాలు దద్దరిల్లిపోయేలా గావుకేక పెట్టింది. ఆ కేక ఎంత బిగ్గరగా వుందంటే, పిడుగుపాటులా వుంది.

ఆమె కళ్ళు గిర్రున తిరిగాయి. చాపచుట్టలా నేలకు జారిపోయింది లలిత. ఆ జారిపోవడం సరాసరి మెట్లకు దగ్గర కావడంతో దబదబమని శబ్దం చేస్తూ వేగంగా మెట్లమీంచి దొర్లి హాల్లో పడిపోయింది.

ఆమె కేకకు అంతా లేచి బయటకు వచ్చారు. ఏనుగులెక్కి తొక్కినా నిద్రలేవని సోములు కూడా అదిరిపడి లేచాడు.

మీనాక్షి, రవిల కోసం కర్టెన్ వెనుక పడిగాపులు పడి ఎదురుచూస్తున్న అంజన్ ఆమె కేక వినిపించిన తడవుగా మెరుపులా పరుగుతీస్తూ వచ్చాడు.

హాల్లోకి వచ్చినవారంతా శిలాప్రతిమల్లా బిగుసుకుపోయారు.

ఆ భీకర దృశ్యం చూసి భయకంపితులైన పేరమాంబ, జలజ కెవ్వున అరచి కిందపడిపోయారు.

కోటిలింగం మేడ మెట్లు దండిని ఆసరాగా చేసుకుని నేలను కూర్చుండిపోయాడు.

రవి గడగడ వణికిపోతూ కోటిలింగం పక్కనే జారబడిపోయాడు.

అందరి గుండెలూ కొన్నిక్షణాలు కొట్టుకోవడం మానేశాయి... ఆ మరుక్షణం నీరసంగా కొట్టుకోసాగాయి.

ఆ దృశ్యం...

ఎంత దారుణం...

అదే సమయంలో సడెన్‌గా ప్రారంభమైంది దడదడలాడుతూ వర్షం. ప్రకృతిని సైతం భయకంపితం చేసేలా కుంభవృష్టిలా కురవసాగింది.

ఉరుములు, మెరుపులు మరింత భీకరంగా వున్నాయి.

ఆ హాల్లో..

ఆ దృశ్యం...

హాలు మధ్యలో.. మధ్యభాగంలో ఊగుడు కుర్చీలో కూర్చోపెట్టబడి వుంది మీనాక్షి తల లేని మొండెం.

ఊగుడు కుర్చీ వేగంగా వెనక్కి, ముందుకు ఊగుతోంది...

మొండెం, తల లేని ప్రదేశంలో రక్తం బుసబుసమని పొంగుతోంది. ఆ ప్రదేశం మాంసపు ముద్దలా భయంకరంగా వుంది. మొండెం బిగుసుకుపోయి వుంది.

ఊగుతున్న కుర్చీలో మొండెం...

షాండ్లియర్స్ సరిగ్గా ఊగుతున్న కుర్చీకి పై భాగాన సీలింగ్ నుంచి వ్రేలాడు తున్నాయి. ఆ షాండ్లియర్స్ కూడా చాలా వేగంగా ఊగుతున్నాయి.

షాండ్లియర్స్ అడుగుభాగాన కొంత జుట్టు ముడి వెయ్యబడి, మిగిలిన జుట్టుతోసహా బీభత్సంగా వ్రేలాడుతోంది మీనాక్షి తల. పొడవైన కేశాలతో భీకరంగా వ్రేలాడుతోంది ఆమె తల.

తెరవబడిన పెద్దకళ్ళు హిప్నటైజ్ చేస్తాయేమో! అనిపించేలా వున్నాయి.

షాండ్లియర్స్‌తో పాటుగా భీకరమైన మీనాక్షి తల.. రక్తం కారుతూ; వేగంగా అటూ ఇటూ ఊగసాగింది.

కుర్చీలోని మొండెం వెనక్కి వెళితే, తల ముందుకి; మొండెం ముందుకి ఊగితే, తల వెనక్కి- రక్తం చిమ్ముతూ భయంకరంగా, భీకరంగా, బీభత్సంగా, వేగంగా ఊగుతున్నాయి.

నిజంగా ఆ దృశ్యం చూడటం నరకప్రాయం... భయానకం...

ఉరుములు, మెరుపుల మధ్య అందర్నీ భయవిహ్వాలుల్ని చేస్తూ ఎక్కడో పిడుగుపడింది.

ముందుగా తేరుకున్నవాడు అంజన్.

గబగబా గ్లాసుతో నీళ్ళు తెచ్చి; లలిత, పేరమాంబ, జలజలపై చల్లాడు.

ముగ్గురూ పైకిలేచి గద్గదమైన గొంతుల్ని పెగిల్చి ఏడవలేక గుండెలను అరచేతుల్లో పెట్టుకుని పిచ్చిచూపులు చూడటం తప్ప ఏమీ చెయ్యలేకపోయారు.

అదే సమయంలో లలిత రూములో మంచం కింద వున్న ఆగంతకుడు ఏం చెయ్యాలో తోచక కొన్ని క్షణాలు ఆలోచించాడు.

మరుక్షణం ఒక స్థిరనిశ్చయంతో బయటికి... వరండాలోకి వచ్చాడు.

మెట్ల పక్కగా... వరండాలో పిట్టగోడలా ఏర్పాటుచేసిన చెక్కదండికి కాళ్ళు ఆన్చి నిలబడి, జేబులోంచి రివాల్వర్ తీశాడు.

ఒక పక్కగా వున్న లలిత తల వెనుక భాగానికి గురిపెట్టాడు.

సేఫ్టీకాచ్ ముందుకు తోసి, ట్రిగ్గర్ నొక్కబోయాడు.

అదే క్షణంలో గోడ గడియారం టంగ్... టంగ్...మని రెండుగంటలు కొట్టింది.

ఉలిక్కిపడి పక్కనే వున్న స్తంభం చాటుకు తప్పుకున్నాడు ఆగంతకుడు.

తన అర్థంలేని భయానికి తానను తాను తిట్టుకుని, మళ్ళీ చెక్కదండికి జారబడి రివాల్వర్ గురి చేశాడు.

వర్షం జోరు పెరిగింది...

మేఘ ఘర్జనలు ఉండుండి వినవస్తున్నాయి...

గాలికి కర్టెన్స్ రెపరెపలాడుతున్నాయి...

కిటికీ రెక్కలు టప్..టప్..మని శబ్దం చేస్తూ కొట్టుకుంటున్నాయి...

ట్రిగ్గర్ మీద వేలు బిగిస్తున్నాడు ఆగంతకుడు.

మరో క్షణంలో లలిత ప్రాణాలు ఆమెను వీడి ఎటో పోవడానికి సిద్ధంగా వున్నాయి..!!!

# 19

పన్నెండు గంటల పది నిముషాలకి మదన్ నిరీక్షణ ఫలించింది.

తెల్లని ఆకారం వస్తూండటం మఱ్ఱిచెట్టు వెనుక వున్న అతనికి తెలుస్తూంది.

రాగానే పట్టుకోవడానికి సిద్ధంగా వున్నాడు.

కీచురాళ్ళు గోలగోలగా అరుస్తున్నాయి.

వాటి అరుపులకు కాదుగాని ఆకారాన్ని చూస్తున్న అతని ఒళ్ళు జలదరించింది. తిరిగి తనకు తాను ధైర్యం చెప్పుకున్నాడు.

తనవైపే వస్తుందనుకున్న ఆకారం మరోవైపు క్షణంలో అదృశ్యమైంది.

మదన్ గుండెలు దడదడలాడాయి.

ఏం చెయ్యాలి? తన కళ్ళెదురుగా ఎలా మాయమైంది? మనిషైతే అంత త్వరగా ఎలా మాయం కాగలదు? అంటే... దెయ్యమేనా?!... ఆ ఆలోచన అతనికి రుచించలేదు.

రకరకాల యోచనలు చేస్తూ అక్కడే నిలబడి గంట పైగానే గడిపేశాడు.

అప్పుడు...

ఆ క్షణంలో అతనికి సడెన్‌గా ఏదో స్ఫురించింది.

ఆకారం పోయిన వైపుగా వెళ్ళాడు. ఆకారం ఎక్కడైతే అదృశ్యమైందో అక్కడ నిలుచున్నాడు.

మర్రిచెట్టు రెండోవైపు భూమిలోకి పాతుకుపోయిన ఒక పెద్ద ఊడ దగ్గరి స్థలం అది...

గాలికి మర్రి ఊడలు అటూ ఇటూ ఊగుతున్నాయి.

మోకాలు మీద కూర్చుని టార్చి వెలుగులో నేలనంతా తడమసాగాడు.

అక్కడంతా చిరుగడ్డి మొలిచింది. చేత్తో తట్టిచూశాడు. అదోరకమైన బోలు శబ్దం వినిపించింది.

ఆలోచిస్తూ పక్కకు చూశాడు మదన్...

భూమిలో పాతుకుపోయిన మర్రి ఊడకు చేయి దూరేంత తొర్ర కనిపించింది. అది ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన తొర్రలా అతనికి అనిపించలేదు.

అందులో టార్చి వెలుగు ఫోకస్ చేసి చూశాడు.

ఏదో మర కనిపిస్తే తిప్పాడు.

గడ్డినేలలా వున్నచోట నాలుగడుగుల 'స్క్వేర్ ప్లేస్'గా వున్న సీక్రెట్ డోర్ పైకి లేచింది.

ఇంకేం ఆలోచించకుండా మెట్ల వెంట కిందకి దిగాడు... ఆరు మెట్లు దిగేసరికి రెండువైపులా పొడవైన సొరంగం...

ఎటువైపు పోవాలో, ఎటుపోతే ఏమి వస్తుందో మదన్‌కి తెలియదు.

జేబులోంచి రూపాయి బిళ్ళ తీసి హెడ్ అండ్ టైల్ వేశాడు. టైల్ పడింది. దాని ప్రకారం అనుకున్న మార్గాన్ని ముందుకి నడిచాడు.

అతని చేతిలో సిద్ధంగా వుంది రివాల్వర్...

అర్థ ఫర్లాంగు దూరం నడిచిన తరువాత మెట్లు కనిపించాయి. వాటి వెంట ఒక రూంలోకి ప్రవేశించాడు. గాలిబంగ్లాలో తాళం వేసి వున్న రూమ్ అది.

ఆ రూంలోనుంచి పక్కరూం ద్వారా బయటపడి హాలులోకి రాబోతున్నాడు.

అదే సమయంలో హాలులో ఏదో గందరగోళం జరుగుతోందని గ్రహించాడు మదన్.

వెంటనే హాలులోకి ప్రవేశించి నిర్ఘాంతపోయాడు.

* * *

ఆగంతకుడు ట్రిగ్గర్ నొక్కబోతున్న ఆఖరి క్షణంలో అది గమనించాడు అంజన్.

ఆ వెంటనే మెరుపువేగంతో లలిత పక్కకి దూకాడు. అతను అలా దూకుతున్న మూమెంట్‌లో ఆగంతకుడికి కన్‌ఫ్యూజన్ ఏర్పడి రివాల్వర్‌ని కొద్దిగా కదిపి, ట్రిగ్గర్ నొక్కేశాడు.

'ఢాం' మని పేలింది రివాల్వర్.

లలితను వేగంగా కిందకు తోసేశాడు అంజన్. అతను తప్పుకోవడానికి మార్గం లేకపోయింది.

మెరుపువేగంతో వచ్చిన తూటా అతని కుడి భుజంలో కూరుకుపోయింది- ఆగంతకుని గురి కుదరకపోవడం వల్ల.

మండుతున్న కొలిమిలో ఎర్రగా కాలిన ఇనప చువ్వను భుజంలో దూర్చినట్టు విలవిలలాడిపోయాడు అంజన్.

అతను ధరించిన తెల్లని స్వెట్టర్- విలవిల కారుతున్న రక్తానికి ఎర్రగా మారిపోయింది.

క్షణం కుడిభుజాన్ని ఎడమచేత్తో అదుముకున్నాడు.

ఆగంతకుణ్ణి చూసిన అందరూ భయాందోళనలతో కంపించిపోతున్నారు. ఏమీ చెయ్యలేక గుండెలుగ్గబట్టుకుని చూస్తున్నారు.

మరోసారి ట్రిగ్గర్ నొక్కుతున్నాడు ఆగంతకుడు.

తేరుకున్న అంజన్ మెరుపులా పక్కకి దూకాడు.

'ఢాం' మని పేలిన బుల్లెట్ నేలను తాకి పెచ్చులు రేపింది.

కిందపడిన లలిత పైకి లేవకుండా అంజన్ వంకే ఆశ్చర్యంగా చూస్తోంది.

లలిత ప్రాణాలు తియ్యకుండా చేశాడని అంజన్ మీద కోపం, ముందు అతన్నే అంతం చెయ్యాలన్న పట్టుదల ఆగంతకుడికి వుంది కాబోలు, వరుసగా మిగిలిన నాలుగు బుల్లెట్లు మేడమెట్లు దిగుతూ పేల్చేశాడు.

ఒక బుల్లెట్ సోఫాను చీల్చుకుంటూ పోయింది. మరొకటి మీనాక్షి మొండెం గుండెలో

చొచ్చుకుంది. మరో రెండు బుల్లెట్స్ ఏ మూలకో పోయాయి.

ఆగంతకుడి వద్దనున్న రివాల్వర్‌లో బుల్లెట్లు అయిపోయాయని గ్రహించిన అంజన్ అతని ముందుకు మెరుపులా దూకి, ఎడమచేతి పిడికిలితో పిడుగుపాటులా ముష్టిఘాతం ప్రయోగించాడు.

నాలుగడుగుల దూరంలో పడ్డాడు ఆగంతకుడు. వంచి వదిలిన వెదురు చువ్వలా మెరుపువేగంతో పైకి లేచాడు. ఆ వెంటనే ఇరువురూ హోరాహోరీగా పోట్లాడుకుంటున్నారు.. తన్నుకుంటున్నారు. గుద్దుకుంటున్నారు.. ఒకరి ఎత్తులకు మరొకరు పై ఎత్తులు వేసి తప్పించుకుంటున్నారు.

ఇద్దరూ ఒకరిని ఒకరు బిగించి పట్టుకున్నారు.

అంజన్, ఆగంతకుడి ముసుగును తీసివేయాలని శతవిధాల ప్రయత్నిస్తున్నాడు. కాని అతని ప్రయత్నాన్ని సాగనివ్వడం లేదు ఆగంతకుడు.

ఇద్దరూ సోఫా మీంచి వెనక్కి పడ్డారు.

ఆగంతకుని గుండెలపై కూర్చుని ఎడమ చేత్తో అతన్ని అదిమి పెట్టి, గాయమైన కుడిచేతితో మెడవద్ద వున్న జిప్పర్‌ని పైకి లాగాలని ప్రయత్నిస్తున్నాడు అంజన్ ఆవేశపడుతూ.

కలవరంతో ఆగంతకుని కళ్ళు అటూ ఇటూ కదిలాయి. ఆ కళ్ళలోని ఎర్రని జీరలు క్షణం అంజన్‌ని భయపెట్టాయి.

మరుక్షణం జిప్పర్ లాగబోయాడు.

ఆగంతకుడు కాళ్ళు పైకెత్తి అంజన్ మెడకు కత్తిరి పట్టువేసి వెనక్కి పడేశాడు.

ఆ వెంటనే పైకిలేచి మోకాలు కింద జిప్పర్ లాగి తళతళ మెరిసే కత్తి తీసాడు. దానితో అంజన్ కంఠంలో పొడవడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆగంతకుడి చేతిని అతను పట్టుకుని వెనక్కి తోసేస్తున్నాడు.

కొన్ని క్షణాల తర్వాత బలమంతా ప్రయోగించి ఆ చేతిని తన్నాడు అంజన్. కత్తి దూరంగా పడిపోయింది.

ఆ వెంటనే నైలాన్ తాడుతో అంజన్ మెడకు ఉరి బిగించసాగాడు ఆగంతకుడు.

అంతవరకూ పోరాడటం వల్ల కుడిచెయ్యి చచ్చుబడిపోయింది. అది ప్రస్తుతం ఇక సహకరించదు.

ఎడమచేతిని నైలాన్ తాడులో ఇరికించి, తన మెడకు పడ్డ ఉరిని తప్పించడానికి శతవిధాల ప్రయత్నిస్తున్నాడు అంజన్. కాని వీలు కుదరడంలేదు.

అతని శక్తి క్షణ క్షణం హరించుకుపోయేలా వుంది. ఒళ్ళంతా చెమటలు పట్టేసాయి. కుడిచేతి గాయం నుంచి రక్తం విపరీతంగా స్రవిస్తోంది.

మూలుగుతూ వెనక్కి పిల్లిమొగ్గ వేస్తూ కాలుతో ఆగంతకుడి మొహం మీద తన్నాడు అంజన్.

వెనక్కిపడ్డాడు ఆగంతకుడు.

ఇద్దరూ కొదమ సింగాల్లా ఒకేసారి పైకి లేచారు.

అదే సమయంలో హాల్లోకి రివాల్వర్‌తో వస్తున్న మదన్‌ని చూసిన ఆగంతకుడు- మెరుపులా దొడ్డిగుమ్మం వైపు పరుగుతీశాడు.

''మధూ.. కాచ్ హిమ్..'' అరిచాడు అంజన్.

కాని మదన్ పట్టుకోలేకపోయాడు.

క్షణం తర్వాత కారు స్టార్టయిన శబ్దం వినిపించింది.

''మధూ క్విక్.. ఫాలో మి'' అంటూ గేరేజ్ వైపు పరుగుతీసాడు అంజన్.

నిముషం తర్వాత మదన్ డ్రైవ్ చేస్తున్న ఇంపాలా, ముందు పోతున్న కాడిలాక్‌ని కనుచూపు దూరం నుంచి వెంబడిస్తోంది.

* * *

గాలిబంగ్లాకి పది కిలోమీటర్ల దూరంలో కొండ వెనుక నిర్మించబడిన చిన్న భవనాన్ని చేరుకున్నాడు ఆగంతకుడు.

ఆ భవనంలో ఒక పెద్ద హాలు వంటి గదిలో రెండు స్తంభాలకు వ్రేలాడుతున్న గొలుసులతో బంధించబడి వున్నాడు జమీందార్ రంగనాథవర్మ.

బట్టలు చిరిగి పీలికలయిపోయి, జుట్టు రేగి, గెడ్డం విపరీతంగా పెరిగిపోయి, సరైన తిండిలేక శుష్కించి- లోతుకు పోయిన కళ్ళు, ముడతలు పడ్డ శరీరంతో పిచ్చివాడిలా వున్నాడు.

అతని ఎదురుగా ఆరడుగుల ఎత్తున్న గాజుపెట్టెలో - శవమూ కాదు, అస్థిపంజరమూ కాదు అనే స్థితిలో వున్న రంగనాథవర్మ భార్య శవం అనకూడని అస్థిపంజరం వుంది.

''బాబూ.. వచ్చావా బాబూ.. నాకు ఇప్పటికైనా విముక్తి ప్రసాదించు బాబూ.. రివాల్వర్‌తో నన్ను చంపేసి పుణ్యం కట్టుకో.. ఈ నరకం నేను భరించలేను'' పాషాణ హృదయుమైనా ద్రవించేలా ప్రాధేయపడసాగాడు రంగనాథవర్మ.

పకపకా నవ్వాడు ఆగంతకుడు. పాషాణం కంటే దారుణంగా కరడుకట్టుకుపోయింది అతని హృదయం.

''వర్మా.. నువ్వు అంత త్వరగా చచ్చిపోతే ఎలా వర్మా..? నా జీవిత ధ్యేయం నెరవేరవద్దూ..! నువ్వు ఇలాగే పశ్చాత్తాపంతో కుళ్ళి కుళ్ళి ఏడుస్తూ, క్షణమో యుగంలా గడుపుతూ చావాలి.. నువ్వు ఇప్పుడే చావడానికి వీల్లేదు. నా వంశ ప్రతిష్ఠకు భంగం వాటిల్లే సమయం దగ్గర పడింది. కనుక నేను చచ్చితీరాలి. అంతవరకూ నువ్వు మాట్లాడకు.''

''వద్దు బాబూ.. నువ్వు చావడానికి వీల్లేదు. తప్పంతా నాది. శిక్ష నువ్వు అనుభవించ కూడదు'' ఆవేదనగా అన్నాడు రంగనాథవర్మ.

జిప్పర్ లాగి తలపై ముసుగు తీసేశాడు ఆగంతకుడు.

వర్మ మాటలకు అతని కళ్ళ వెంట ధారాపాతంగా కన్నీళ్ళు కారసాగాయి. ఏడుస్తున్నాడు.. బిగ్గరగా ఏడుస్తున్నాడు ఆగంతకుడు. హత్యలు చెయ్యడమే జీవిత ధ్యేయ్యంగా పెట్టుకున్న ఆగంతకుడి కరడుగట్టిన గుండె- పాషాణంగా మారిన గుండె- కరిగిపోయేలా ఏడుస్తున్నాడు...

ఆగంతకుడి ఏడుపు విన్న ఏ హృదయమైనా ద్రవించక మానదు.

నిముషం తర్వాత ఏడుపు ఆపి నవ్వసాగాడు. పగలబడి, విరగబడి నవ్వసాగాడు. బాధలో నవ్వు.. అదో రకమైన వైరాగ్యం.

మరుక్షణం నవ్వు ఆపి కొన్ని క్షణాలు మౌనంగా వుండిపోయాడు. అతని వదనం ఆ వెంటనే గంభీరంగా మారిపోయింది.

అక్కడే వున్న రాతి స్తంభంలో వున్న సీక్రెట్ అరలో దాచిన- వజ్ర వైఢూర్యాలు పొదగబడిన పిడితో, పూర్తిగా బంగారంతో.. మేలిమి బంగారంతో తయారుచెయ్యబడిన పురాతన కాలంనాటి ఖడ్గాన్ని బయటికి తీశాడు ఆగంతకుడు.

మూడడుగుల పొడవుగల బంగారు 'ఖడ్గం' అది. రెండువైపులా పదునైన ఖడ్గం. ఆగంతకుని చేతిలోని ఖడ్గం తళతళమని వింత కాంతులతో ప్రకాశిస్తోంది.

దాన్ని టేబుల్ మీద ఉంచాడు.

అదే టేబుల్ మీద వున్న టేప్ రికార్డర్‌లో ఎంప్టీ కేసెట్ ఇన్‌సర్ట్ చేసి, రికార్డింగ్ బటన్ ప్రెస్ చేశాడు.

కొంతసేపు ఏకధాటిగా మాట్లాడిన మాటలను రికార్డు చేసిన కేసెట్‌ను తీసి అదే టేబుల్‌పై వుంచాడు.

అంతవరకూ అతన్నే బాధగా చూస్తున్నాడు రంగనాథవర్మ.

ఆగంతకుడు చెప్పసాగాడు. ''వర్మా! ఇంతవరకూ నీకు నరకాన్నే చూపించాను ప్రతిక్షణం... ఇకముందు నాబాధ నీకు తప్పినట్టే... నువ్వు స్వేచ్ఛగా బయటి ప్రపంచంలోకి పోవచ్చు... ఇక నీకు నేను ఏవిధంగానూ అడ్డురాను. శాశ్వతంగా మీ అందరికీ దూరమైపోతాను. ఆఁ.. వర్మా, నీకో శుభవార్త.. నీ కూతురు లలితను హత్య చెయ్యలేక పోయాను. హత్య చేస్తున్న చివరి క్షణంలో బెడిసికొట్టింది...'' మాటలు చెబుతున్నంతసేపూ ఆగంతకుని మొహంలో రకరకాల భావాలు- ఆవేదనతో ఆవేశంతో కదలాడుతున్నాయి.

''వర్మా... నువ్వు ఇంకేమైనా నాతో చెప్పదలచుకుంటే వెంటనే చెప్పేయ్.. నేను బ్రతికేది కేవలం మరో నిముషం మాత్రమే. ఈ లోపులో నన్ను వెంటాడేవాళ్ళు వచ్చి, నిన్ను రక్షిస్తారు'' ఆవేదనతో జీర ధ్వనించింది ఆగంతకుని మాటల్లో.

''వద్దు బాబూ.. వద్దు.. నువ్వు చావడానికి వీల్లేదు. నామాట విను. లేకపోతే ముందు నన్ను చంపి, ఆ తర్వాత నువ్వు చనిపో..'' ఏడుస్తూ బాధగా అన్నాడు రంగనాథవర్మ.

అప్పుడే బయట తలుపులు బాదుతున్న శబ్దం వినవస్తోంది.

''క్షమించు వర్మా.. ఇక నా నిర్ణయం మారదు. మనలాంటి నికృష్టపు బ్రతుకులు పగవారికి కూడా వద్దు. ఈ జన్మని ఇంతటితో అంతం చేసుకుంటాను. వచ్చే జన్మంటూ వుంటే... మానవ జన్మ ఎత్తకూడదని నేను ఆఖరిసారిగా శతకోటి దేవుళ్ళకు చేసుకునే ప్రార్థన...'' అంటూ టేబుల్ మీద బంగారు ఖడ్గం అందుకున్నాడు ఆగంతకుడు.

రంగనాథవర్మ అతన్ని చావ వద్దని ఏడుస్తున్నాడు, బ్రతిమాలుతున్నాడు. ఎన్ని చేస్తున్నా అతను వినలేదు.

బంగారు ఖడ్గాన్ని విసురుగా తలమీదకు తెచ్చుకున్నాడు ఆగంతకుడు. అంతే...

పదునైన ఖడ్గపు అంచు అతని తలను పుచ్చకాయలా నరికేసింది. ఖడ్గం కిందకి జారిపోయింది.

కిందపడి గిలగిలా తన్నుకోసాగాడు ఆగంతకుడు.

రక్తం వరదలా ప్రవహించసాగింది.

ఆగంతకుని ప్రాణవాయువులు ఎప్పుడో అనంతవాయువుల్లో కలసిపోయాయి. ఆ వెంటనే అతని దేహంలో చలనం ఆగిపోయింది.

ఆ శవం పడివున్న తీరు.. ఆ దృశ్యం భీకరంగా వుంది.

బీభత్సం...

భయానకం...

ఆగంతకుని చావు కళ్ళారా చూసిన రంగనాథవర్మ గుండె ఆ బాధను తట్టుకోలేక పోయింది. ఇప్పటివరకూ మానసికంగా ప్రతిక్షణం బాధను అనుభవించిన అతని గుండె నీరసించిపోయింది. ఆగంతకుని దారుణమైన ఆత్మత్యాగాన్ని చూసి భరించలేకపోయిన రంగనాథవర్మ గుండె తక్షణం ఆగిపోయింది.

రంగనాథవర్మ ప్రాణవాయువులు ఆగంతకుని ప్రాణవాయువులను వెతుక్కుంటూ పోయాయి.

అదే క్షణంలో తలుపులు బ్రద్దలుకొట్టుకుని ఆ గదిలోకి ప్రవేశించిన అంజన్, మదన్‌లు నిశ్చేష్టులై నిలబడిపోయారు.

# 20

రెండు రోజుల తర్వాత...

సాయంత్రం ఐదు గంటలకు మద్రాసులో వున్న రంగనాథవర్మ భవనంలోని హాలులో సమావేశమయ్యారంతా.

ఒక సోఫాలో అంజన్, లలిత, కోటిలింగం; మరో సోఫాలో పేరమాంబ, జలజ; వాళ్ళ పక్కన కుషన్ ఛైర్‌లో రవి ఆశీనులై వున్నారు.

కొంచెం లేటుగా వచ్చిన మదన్ మరో ఛైర్‌లో కూర్చున్నాడు.

‘‘మాకేదో కేసెట్ వినిపిస్తానన్నావ్?’’ అడిగాడు కోటిలింగం.

అంజన్ అన్నాడు ‘‘అలాగే... వినిపిస్తాను. కానీ, అది వినిపించబోయే ముందు మీకో దారుణమైన నిజం చెప్పాలి. అది చెప్పకపోతే, నేను చెప్పేది మీరు వినలేరు. అంటే ఆ నిజం అంత భయంకరమైనది.’’

‘‘ఏమిటది?’’ రవి ప్రశ్నించాడు.

‘‘హంతకుడెవరో తెలుసా?’’ అంజన్ అడిగాడు.

‘‘ఎవరు?’’ ఆతృతగా అడిగింది లలిత.

‘‘మీ మామయ్య గిరిధర్’’ అంజన్ చెప్పిన పచ్చినిజం విని పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడింది లలిత. ఐదు నిముషాల వరకూ ఈ నిజం తెలియని ఐదుగురూ తేరుకోలేకపోయారు.

‘‘మామయ్యని ఎవరో హత్య చేసారుకదా!’’ ఆశ్చర్యాన్ని అణచుకుంటూ ప్రశ్నించింది లలిత.

“అదంతా ఒక పెద్ద నాటకం... మీ మామయ్య మాట్లాడిన కేసెట్ వినిపిస్తే మీకు నిజమేమిటో తెలుస్తుంది” అని మదన్ వద్ద వున్న టేపురికార్డర్ అందుకుని, ప్లే బటన్ ప్రెస్ చేసాడు అంజన్.

ఎంతో బాధ, ఆవేశం, ఆవేదన మిళితమైన గిరిధర్ గొంతు చెబుతున్న మాటలు ప్రవాహంలా సాగిపోతున్నాయి.

“లల్లీ... లల్లీ బేబీ... పరమ దుర్మార్గుడు, నీచుడు, పాపాత్ముడు, కిరాతకుడు అయిన నీ మామయ్య గిరిధర్‌ని మాట్లాడుతున్నాను. దయచేసి వినమ్మా... నేను చెప్పేది పూర్తిగా వింటే నా మానసిక రుగ్మతను నువ్వు అర్థం చేసుకోగలవు. నన్ను క్షమించమని అడగడానికి కూడా నాకు అర్హత లేదు. నన్ను క్షమించినా, శపించినా నీ ఇష్టం తల్లీ... నేను చెప్పేది మాత్రం పూర్తిగా విను.

మా నాన్నగారు విశ్వేశ్వరవర్మగారన్నా, మా అమ్మగారు జానకీదేవిగారన్నా, నాకు ఎంత ప్రేమో నీకు తెలుసు. మా నాన్నగారికి కుష్టువ్యాధి సోకితే ఎంత బెంగపెట్టుకున్నానో నాకే తెలియదు. మా అమ్మగారి దగ్గరకంటే మా నాన్నగారి దగ్గరే నేను ఎక్కువగా అలవాటు పడ్డాను. ఆయన మీద నాకున్నంత ప్రేమ మరెవరి మీదా లేదు. నా పోరు పడలేక మా అమ్మగారు నెలకోమారు నన్ను మా నాన్నగారి వద్దకు తీసుకువెళ్ళేవారు.

మా నాన్నగారికి కుష్టువ్యాధి సోకిన తరువాత మీ నాన్నగారు, అంటే మావయ్య ఎస్టేటులు, ఆస్తిపాస్థుల వ్యవహారాలు చూసుకునేవారు. ఒకరోజు మామయ్య నన్ను గాలిబంగ్లాకి తీసుకువెళ్లాడు. మా నాన్నగారిని నా ఎదురుగానే బెదిరించాడు “ఇప్పటికైనా ఆ ‘ఖడ్గం’ గురించి చెప్పు. లేకపోతే నీ కొడుకుని చంపేస్తాను” అని. అప్పుడు నేను గ్రహించాను...

మా నాన్నగారు, నాకు మూడేళ్ల వయసులోనే చాలాసార్లు మా వంశపారంపర్యంగా వస్తున్న, మా చరిత్రకు అపారమైన గౌరవ ప్రతిష్టలను ఆర్జించిపెట్టే బంగారు ఖడ్గం గురించి చెప్పారు. దాన్ని చిరకాలం కాపాడవలసిన బాధ్యత మనపై ఉందని ఎన్నోసార్లు చెప్పారు... మా నాన్నగారు దానిగురించి వివరాలు ఎంతకీ చెప్పకపోయేసరికి నన్ను చంపుతానని మావయ్య బెదిరించాడు. మావయ్య అన్నంత పనీ చేస్తాడేమోనని భయపడి, నాన్నగారు ఖడ్గం ఎక్కడ దాచిందీ చెప్పేశారు. ముఖ్యంగా ఆ ఖడ్గాన్ని చిరకాలం రక్షించడం కోసమే గాలిబంగ్లా నిర్మించబడింది. బంగ్లా భూగృహంలో ఉండేదా ఖడ్గం.

అంతకుముందే మా నాన్నగారిని కొరడాలతో హింసించినట్లు ఆయన

మాటలనుబట్టి తెలిసింది. వారానికొకసారి అలా హింసించడం వల్లనే కురుపులు చిదిగి, రసిలు కారి కుష్టువ్యాధి మరింత ఎక్కువైపోయింది. రహస్యం చెప్పిన వెంటనే మా నాన్నగారు బ్రతికి వుండటం ప్రమాదమనుకొని, నా కళ్లెదురుగానే ఆయన పీకను కొరడాతో బిగించి చంపేశాడు మావయ్య. ఆరు సంవత్సరాల పసివాడు ఏం గ్రహించగలడు అనుకుని వుంటాడు. బంగారు ఖడ్గాన్ని ఆ వెంటనే స్వాధీనం చేసుకున్నాడు.

ఆరునెలల తరువాత ఈ విషయం గ్రహించిన మా తల్లిగారు మావయ్యను పోలీసులకు పట్టిస్తానని బెదిరించారు. అప్పుడు నేను మంచం మీద పడుకొని వున్నాను. కానీ నిద్రపోలేదు. మా తల్లిగారి మెడకు నైలాన్ తాడు బిగించి, మావయ్య హత్య చేస్తుంటే నిస్సహాయంగా చూశాను.

ఈ రెండు హత్యలు ఆరేళ్ల వయసులో నా మదిలో బలంగా నాటుకున్నాయి. నన్ను కూడా చంపేయవచ్చు కదా! ఎందుకు చంపలేదు అని అనుమానం రావచ్చు. నన్ను కూడా చంపేస్తే అప్పుడు తప్పకుండా పోలీసులకు అనుమానం వస్తుంది. లేకపోతే రెండు హత్యలు చేసి, నన్ను మమకారంతో పెంచితే, ఆ హత్యల పాపం కడిగి వేయబడుతుందన్న మావయ్య గుడ్డినమ్మకం కావచ్చు.

నేను పెరుగుతున్నానన్న మాటేగానీ నాలో ప్రతిరోజూ, ప్రతి గంటా, ప్రతి నిముషం, ప్రతి క్షణం ఆ హత్యలే గుర్తుకువచ్చి- నన్ను మానసిక రుగ్మతకు గురిచేసేవి. నాలోని ప్రతీకార వాంఛ- అగ్నిలో ఆజ్యంలా రగులుకొనేది. నా తల్లిదండ్రులను ఎంత దారుణంగా హత్య చేసేడో అంతకు రెట్టింపు బాధను మావయ్య అనుభవించేలా చేయాలని నిశ్చయించుకున్నాను.

ఆఖరికి ప్లాన్ వేస్తున్న సమయంలో మీరు గాలిబంగ్లాలో పిక్నిక్ జరుపుకుందామని నిశ్చయించారు. నాకు ఇదో మంచి అవకాశంగా అనిపించింది. వెంటనే ప్లాన్ మార్చేశాను.

నాకు తెలిసిన ఒక స్టార్ హోటల్ డాన్సర్ రీటాని పనిమనిషి మంగతాయారుగా మార్చేశాను. లక్ష రూపాయల కోసం ఆమె, నేను చెప్పిన పనికి ఒప్పుకుంది. ఆమెకు ఆ మొత్తం ముందుగానే ఇచ్చేశాను. తెల్లని ఆకారం... దెయ్యంలా నటించింది రీటాయే! నేను చెప్పినట్టు ప్రతిరాత్రీ సరిగ్గా 12 గంటలు దాటిన తరువాత అందర్నీ భయపెట్టేది.

అరుపులు, కేకలు.. నేనే అరిచి టేప్ చేశాను. హాలులో సీలింగ్‌లో కవర్ అయ్యేలా నలుమూలలా స్టీరియోలు అరేంజ్ చేశాను. వాటి కనెక్షన్స్ నారూంలో ఉన్న గాడ్రేజ్ బీరువాలోకి ఉన్నాయి. టైం ప్రకారం నేనే టేప్ ఆన్‌చేసి, ఆఫ్ చేసేవాడ్ని.

మిమ్మల్ని భయపెట్టడానికే 'రత్తి పాత్ర' సృష్టించి రీటాని నియోగించాను. వంటవాడు సోములు నాకు స్నేహితుడు. మా ఇద్దరిమధ్యా అంతస్థులు అడ్డురావు. నా చరిత్ర తెలిసిన సోములు నాకు సహకరించడానికి అంగీకరించాడు.

సోములుకి, నాకు ఆసనాలు వేయడం బాగా వచ్చు. చిన్నప్పటినుంచీ నేర్చుకున్నాం. మేం ఇద్దరం కొద్ది తేడాలో ఇంచుమించుగా అరగంట వరకూ వాయుస్తంభన చేయగలం. మొదటిరోజు రాత్రి సోముల్ని పావుగంట ముందుగా శవంలా మేకప్ చేసి, బురద గోతిలో మరికాస్త మట్టివేసి - పైన లైట్‌గా చదునుగా వుండేలా చేశాను.

"మరో పావుగంట లోపులో రీటా నవ్వు వినేసరికి, అతను భూమిని చీల్చుకుని వచ్చిన శవంలా చాలా అద్భుతంగా నటించాడు. అతన్ని ఆ క్షణంలో చూసిన నాకే భయమేసింది.

ఇకపోతే డ్రైవర్ చంద్రం. వాడు నా బుల్లెట్‌ను పొదల్లో చూశాడు. దాన్ని దాచినా వాడికంట పడింది. వాడి చావు వాడే నిర్ణయించుకున్నాడు.స్నానానికి వెళ్లినట్టు వెళ్లి దొడ్డిదోవ గుండా జారుకుని, చెట్టుపైనుంచి పెట్రోలు పోసి, వాడ్ని అంతం చేశాను. స్నానం చేసి వచ్చినట్టు నమ్మించి, మీ అందరి ముందూ వున్నాను.

మావయ్యను రీటా ద్వారా నాలుగురోజులు భయపెట్టి, ఆ తర్వాత బంధించి, నేను గాలిబంగ్లాకి పది కిలోమీటర్ల దూరంలో నిర్మించుకున్న భవనంలో పడేశాను. ఆ మరునాడే... కళ్లు మూసుకుని అత్తయ్య మీదికి బుల్లెట్ పేల్చేశాను. నా మొదటి హత్య అదే....

మావయ్య ఎదురుగా అత్తయ్య శవాన్ని గాజుపెట్టెలో వుంచాను. ప్రతిరోజు, ప్రతి క్షణం కళ్లెదురుగా భార్య శవాన్ని వుంచుకుని ఏ భర్త మాత్రం మౌనంగా వుండగలడు. ప్రతిక్షణం నరకమే.... బాధాకరమైన ఆలోచనలు తప్ప మావయ్యకు మరే ఆలోచనలు వస్తాయి? అంతటి నరకం మరొకటి ప్రపంచంలో లేదు అని నా ఉద్దేశం.

మీ అన్నయ్య శంకర్‌ని చంపేసి, దాన్ని వీడియో ఫిల్మ్ తీశాను. ప్రతి రాత్రీ మీ నాన్న వద్దకు వెళ్లేవాడిని ఏదో కారులో... ఆ ఒక్కపూట మాత్రమే మావయ్యకు బలవంతంగా భోజనం తినిపించేవాడిని. అది కేవలం నా స్వార్థమే! భోజనం లేక చనిపోతే ఎలా? నా పగ చల్లారొద్దూ! మీ అన్నని చంపిన తర్వాత రాత్రి వెళ్లి, వీడియో ఫిల్మ్‌లో మీ అన్నని ఎలా చంపిందీ ప్రత్యక్షంగా చూపించాను. దానికంటే ప్రత్యక్ష నరకం ఇంకేముంటుంది?

తర్వాత నా భార్య మీనాక్షితో అక్రమ సంబంధం పెట్టుకున్నాడన్న ద్వేషం, పగతో కిశోర్‌ని చంపేశాను. భూగృహం గురించి ఎవరికీ తెలియకూడదని, మావయ్య ఆ రూంకి తాళం వేసి కట్టడి చేశాడు. నాకు చిన్నప్పుడే దాని గురించి తెలుసని ఆయనకి తెలీదు.

మావయ్యను బంధించిన తర్వాతే, బంగారు ఖడ్గాన్ని నా భవనానికి తరలించాను.

అంజన్, శంకర్ శవాన్ని బంగ్లా వెనుక పెంకుటింట్లో వుంచడం నాకు మరో అవకాశాన్ని ఇచ్చింది. ఆ పెంకుటింట్లోంచి రహస్య మార్గం ఎందుకు ఏర్పాటుచేశారో నాకు తెలీదు. ఊహించుకోవలసిందే... బహుశా... సెక్యూరిటీ కోసం... ఎస్కేప్ వే అయి వుంటుంది.

ఆ మార్గం గుండా బంగ్లాలో రూమ్‌లోకి, అక్కడినుంచి పక్కనే ఉన్న నా రూమ్‌లోకి, నా పక్కన వున్న శంకర్ రూమ్‌లోకి... మధ్య తలుపుల ద్వారా చేరవేశాను ఆ శవాన్ని. ఇలా చేరవేసేముందు నా భార్యకు క్లోరోఫాం ఇచ్చి, తర్వాత స్పృహ తెప్పించే స్మెల్లింగ్ స్టాల్ వాసన చూపించేవాడిని. ప్రీతి, భర్త శవాన్ని చూసిన వెంటనే, నువ్వు కూడా లేచి ఇద్దరూ బయటికి వెళ్లిన వెంటనే ఆ రూమ్‌లోకి వచ్చి, శంకర్ శవాన్ని పెంకుటింట్లోకి చేరవేశాను. కిశోర్‌ని చంపిన తర్వాత అంజన్ నన్ను అనుమానిస్తున్నాడని, తోపులో అంజన్, మదన్ మాట్లాడుకోగా విన్నాను. వెంటనే మాస్టర్ ప్లాన్ వేశాను... రీటాని వెంటాడినట్టు వెంటాడి, చెట్టు వెనక ఊడకు జారబడి నాకు తెలిసిన విద్య 'వాయుస్తంభన' చేశాను. ముందుగానే ఇంట్లో నైలాన్ తాడుతో మెడవద్ద బాగా బిగించి, నాటులు ఏర్పరచుకున్నాను. అంజన్, మదన్‌లు సాధారణమైనవాళ్లు కాదని, వాళ్లు పోలీసు డిపార్టుమెంట్‌కి సంబంధించినవాళ్లై ఉంటారని మందే గ్రహించాను.

నేను చచ్చాననుకుని నా శరీరాన్ని కూడా పెంకుటింట్లో ఉంచుతారని నాకు తెలుసు. అలాగే జరిగింది. కిశోర్‌ని చంపితే, మీనాక్షితో రవి అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. అప్పుడు గ్రహించాను, ఆ తప్పు రవిది కాదనీ, నా భార్యదని. అంత నీచంగా చపలత్వంతో ప్రవర్తిస్తున్న నా భార్యని చంపడానికే నిశ్చయించుకున్నాను.

రవిని కలిసిన తర్వాత మీనాక్షి స్నానం చేసే సమయంలో ఆ గదిలోకి ప్రవేశించి, గోడకు జారబడి వాయుస్తంభన చేశాను. నన్ను చూసి భయపడి పారిపోయింది. వెంటనే నేను పెంకుటింట్లోకి చేరుకున్నాను, సొరంగ మార్గం ద్వారా. ఆ మర్నాడు, రవి వెళ్లిపోయిన తర్వాత కసికొద్దీ మీనాక్షిని చంపేసి, మిమ్మల్ని భయభ్రాంతుల్ని చేయడానికి... అలా ఏర్పాటుచేశాను. ఆ సమయంలోనే నిన్ను చంపడానికి నీ రూమ్‌లోకి వచ్చాను. నీకు మెలుకువ రావడం చూసి మంచం కింద దాక్కున్నాను. నువ్వు బయటకు వెళ్లి, మీనాక్షి శవాన్ని చూసి అరచి పడిపోయావు. ఆ తర్వాత జరిగింది నీకు తెలుసు. నిన్ను కాల్చి చంపబోతే, నిన్ను రక్షించబోయిన అంజన్ భుజానికి గాయమైంది. అంజన్, మదన్‌లు ప్రతి రాత్రీ నాకు ఏదోవిధంగా ఆటంకం కలిగిస్తూనే వచ్చారు. వాళ్లని చంపే ఉద్దేశం నాకు ఎంతమాత్రం లేదు. కానీ తప్పని పరిస్థితుల్లో మాత్రం చంపాలనుకున్నాను.

శంకర్, ప్రీతిల హత్యల వీడియో కేసెట్లను ప్రతి రాత్రీ మీ నాన్నకు చూపించి, మరింతగా కృంగదీశాను. కొడుకు, కోడలు చస్తూ అనుభవించిన నరకయాతనను చూసి ఎవరు మాత్రం భరించగలరు? మానసికంగా మీ నాన్నని చిత్రహింసలకు గురిచేశాను. కానీ శారీరకంగా హింసించలేదు. దానికంటే మానసిక హింస వెయ్యి రెట్లు శక్తివంతమైంది.

నిన్ను ఒక్కదాన్నే చంపలేకపోయాను. చూశావా! నువ్వంటే నాకెంతో ఇష్టం. నేనన్నా నీకు ప్రేమే! కానీ నా మానసిక రుగ్మత వల్ల నిన్నుకూడా చంపాలనుకున్నాను.

నాకు ఆస్తిమీద వ్యామోహం లేదు. మీరంతా చనిపోతే, నా ఆస్తంతా అనాథాశ్రమాలకు చెందేలా రాశాను. ఆ విషయం నీకు తెలీదు కదూ! అంటే, మీ అందర్నీ చంపి, నేను కూడా చనిపోదామనే నా కోరిక. నా ప్రధానోద్దేశం ఒక్కటే - నా వంశ ప్రతిష్టకు భంగం వాటిల్లకూడదని... అందుకే హత్యలు ఎవరు చేస్తున్నారో కూడా అనుమానం రాని విధంగా పకడ్బందీగా ప్లాన్ వేశాను. కానీ ఆఖరి క్షణంలో నా రహస్యం బట్టబయలయ్యే స్థితికి వచ్చింది. నా వంశ ప్రతిష్ఠను కాపాడదామని ఎంతో ప్రయత్నించాను. కానీ వీల్లేకపోయింది. నా చరిత్ర బట్టబయలైపోయింది. అలా కాకూడదనే నా కోరిక. వీలైతే మన వంశ చరిత్రను బట్టబయలు కాకుండా పరిరక్షించు.

నాకు జీవితంమీద ఎప్పుడూ ఆశ లేదు బేబీ! నేను బ్రతికివుంటే నిన్ను చంపడానికి కూడా వెనుకాడను. అందుకే, ఇక నా జీవితానికి చరమగీతాన్ని నేను పాడుకుంటున్నాను. నా అంతానికి చింతిస్తావో, నా రుగ్మతకు, నా క్రూరత్వానికి నన్ను శపిస్తావో నీ ఇష్టం బేబీ!'' గిరిధర్ మాట్లాడిన కేసెట్ వింటూ కన్నీరు కారుస్తూ ఏడుపుని బలవంతంగా ఆపుకుంది లలిత.

ఇక ఆపై ఆపుకోలేక దుఃఖం తీరేలా చాలాసేపటివరకూ కుళ్లికుళ్లి ఏడ్చింది.

ఎవరూ ఆమెను ఓదార్చడానికి ప్రయత్నించలేదు. అలా అయితే దుఃఖం మరింత పెరుగుతుందని వాళ్లకి తెలుసు.

పది నిమిషాలు నిశ్శబ్దం.

''మరి నా నీళ్లబకెట్లోకి రక్తం ఎలా వచ్చింది?'' అర్థంకాక ప్రశ్నించింది పేరమాంబ.

''అది చెప్పవలసినవాళ్లు చెబితేనే బావుంటుంది'' కోటిలింగంని చూస్తూ అన్నాడు అంజన్.

కోటిలింగం సిగ్గుపడుతూ చెప్పసాగాడు. ''నా వాదనను అంతా కొట్టిపారేస్తున్నారనీ, దెయ్యాలు ఉన్నాయనీ చెబితే ఎవరూ నమ్మడం లేదనీ గ్రహించిన నేను, నా వాదనను

బలపరుచుకోవడం కోసం, మీ అందర్నీ నమ్మించాలని, తోటలో గొర్రెపోతును చంపి, ఆ రక్తాన్ని బకెట్లో నింపాను. దొడ్డిదోవ గుండా బకెట్ తెచ్చి, ఒక ఖాళీ గదిలో దాచాను. పేరమాంబ స్నానాల గదిలోకి నీళ్లు పట్టుకెళ్లడం చూశాను. సబ్బు కోసం ఆమె లోపలికి వెళ్లేసరికి, బకెట్లో నీళ్లు వంపేసి, రక్తం పోశాను. ఈ విషయంలో నేను చాలా సిగ్గుపడుతున్నాను'' తల దించుకున్నాడు.

''అంకుల్... ఇక ఆ విషయం మీరు మర్చిపోండి'' సరిదిద్దుతూ అంది పేరమాంబ.

రవి చెప్పసాగాడు. ''నన్నంతా క్షమించండి. నేను కూడా కొన్ని చెప్పకుండా దాచాను. అంజన్ లలితను ప్రేమించాడన్న ఈర్ష్యతో జలజ నాచేత రెండు నీచకార్యాలు చేయించింది. మొదటిది, లలితకు భోషాణం పెట్టెలో కనిపించిన శవం... నేనే!... పేరమాంబ రూమ్‌లో మేకప్ అయి, మధ్యతలుపు తెరుచుకుని, పెట్టెలో పడుకుని లలితను భయపెట్టాను. తర్వాత లలిత భయపడి పారిపోయాక; జలజ, పేరమాంబల రూమ్‌లోకి వచ్చి మేకప్ తుడిచేసుకుని బయటకు వచ్చేశాను. ఈ విషయం పేరమాంబకు తెలియకుండా జలజ, ఆమెని ఆ సమయంలో కిందికి తీసుకుపోయింది.

ఇకపోతే రెండో పని, అంజన్ రైటింగ్‌ని అనుకరించి లవ్ లెటర్స్ సృష్టించి లలిత కంటపడేలా జలజ రూమ్‌లో వుంచి, మంగతాయారును ఒప్పించి, జలజ చేత లెటర్ రాయించి, ఆమె చేత నాటకమాడించింది నేనే!... తప్పుడు పనులు ఇకముందు చచ్చినా చెయ్యను. గిరిధర్ మనసు మార్చుకోకపోయినట్లయితే, ఈ పాటికి చచ్చి వుండేవాడిని'' బిడియంగా చెప్పాడు రవి.

జలజ చచ్చేంత సిగ్గుతో తలదించుకుంది. అంజన్‌ని అనుమానించినందుకు లలిత అతడిని క్షమార్పణ వేడుకుంది.

''ప్రేమికుల మధ్య క్షమాపణలుండకూడదు'' నవ్వుతూ అన్నాడు మదన్.

''వెరీగుడ్... ఇంతకీ అసలైన సస్పెన్సును విడగొట్టలేదు. మీరిద్దరూ ఎవరు?'' అంజన్, మదన్‌లను చూస్తూ అనుమానంగా అన్నాడు కోటిలింగం.

''లలిత తల్లిదండ్రులు కనిపించకపోయేసరికి అఫీషియల్ రిక్వెస్ట్ మీద మాకు చేరింది ఈ కేసు పరిశోధన. వెంటనే నేను రంగంలోకి దిగి, నాటకమాడి లలిత స్నేహాన్ని సంపాదించాను. మా స్నేహం మమ్మల్ని ప్రేమలోకి దింపింది. మదన్ నా తమ్ముడు కాదు, నా అసిస్టెంట్ మదన్‌మోహన్... నేను సి.ఐ.డి. ఏజెంట్‌ని. నా పేరు అంజన్‌కుమార్...'' చెప్పాడు సి.ఐ.డి అంజన్‌కుమార్.

''మరి మంగతాయారుగా నటించిన రీటా, వంటవాడు సోములు నేరస్థులేనా?''

పేరమాంబ అడిగింది.

“నేరస్థుడికి సహకరించిన వారెవరైనా నేరస్థులే! తండ్రి రామదాసుని తీసుకుని సోములు, రీటా కూడా పారిపోయారని మా అనుమానం. వాళ్ల గోసం గాలింపు మొదలైంది” అన్నాడు అంజన్.

మదన్ అన్నాడు. “నా దృష్టిలో గిరిధర్ చాలా మంచివాడు. తెలివైనవాడు. కానీ అతనిది దురదృష్టకరమైన జీవితం. చిన్ననాటినుంచీ పగ, ప్రతీకార వాంఛలను పెంచుకుంటూ, మానసిక రుగ్మత వలన, తన జీవితాన్నే నాశనం చేసుకుని ఆత్మ త్యాగం చేసుకుని సమిధగా మారిపోయాడు. అది ధర్మదేవవర్మగారి చేతుల్లో చనిపోయిన ముదుసలి శాపఫలమో, లేక విధి వైపరీత్యమో తెలీదుగానీ, గిరిధర్ బలిపశువుగా మారాడు. అతని జీవితం చాలా బాధాకరమైనది”.

ఆ టాపిక్ మార్చడం కోసం జలజ అంది. “అంజన్, లలితల పెళ్లి ఎప్పుడు సెటిల్ చేస్తారు?” అని.

“నువ్విలా ఎంకరేజ్ చేశావంటే వీళ్లిద్దరూ ఇప్పుడే రిజిస్టర్ ఆఫీసుకి పరుగు తీస్తారు” అన్నాడు నవ్వుతూ కోటిలింగం.

ఆ జోక్‌కి అంతా పగలబడి నవ్వారు.

అంజన్, లలితలు ఇద్దరూ సైగలు చేసుకుని మెల్లగా బయటికి జారుకున్నాడు.

అది గమనించని కోటిలింగం “వీళ్లిద్దరూ ఎక్కడికి పోయారు?” అడిగాడు.

“మీ జోకుని నిజం చేయడానికి పోయుంటారు” అన్నాడు రవి.

“కాదు... గాలిబంగ్లాలో దెయ్యాలు ఎత్తుకుపోయి ఉంటాయి” అన్నాడు మదన్.

మిగిలినవాళ్లంతా పగలబడి నవ్వేరు.

(అయిపోయింది)

గుండెలు అరచేతుల్లో
భయం గుప్పెట్లో
ప్రాణాల కోసం పరుగులు తీస్తుంటే..
దారులన్నీ మూసుకుపోతుంటే..
మీ గుండె చప్పుడే
ఒక పెద్ద గడియారం గంటలా
మిమ్మల్ని భయపెడితే..
ఆ అనుభవం ఎలా వుంటుంది?!



జ్యోతిచిత్ర సినీవారపత్రిక
సినిమా నవలల పోటీలో
ఉత్తమ ద్వితీయ బహుమతి పొంది
సీరియల్‌గా వెలువడి
లక్షలాది పాఠకులను ఉర్రూతలూగించిన
సస్పెన్స్ & హారర్ థ్రిల్లర్

# గాలిబంగ్లా

A NOVEL BY ADAPA CHIRANJEEVI

**శ్రీకృష్ణదేవరాయ పబ్లికేషన్స్**
302, శ్రీసాయి నివాస్, ప్లాట్ నెం. 4.
ఎల్ఐసి కాలనీ, శ్రీనగర్ కాలనీ పోస్ట్,
హైదరాబాద్ - 500 073

రూ. 70/-